శనివారం
31•8•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 67
• పేజీలు: 14 + 16

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

ప్రగతిభవన్‌లో సమీక్షలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ ఉన్నారు

ఆరు నుంచి గ్రామబాట

30 రోజుల ప్రణాళిక అమలుకు సీఎం కేసీఆర్ నిర్ణయం

విస్తృత ప్రజాభాగస్వామ్యంతో నిర్వహించాలి ■ మార్గదర్శనం కోసం 3న విస్తృతస్థాయి భేటీ
అమలు పర్యవేక్షణకు గ్రామానికి ఒక ఇంచార్జి ■ పచ్చదనం, పరిశుభ్రతతో గ్రామాలు వెల్లివిరియాలి
ప్రత్యేక కార్యాచరణ నిరంతరం కొనసాగించాలి ■ పంచాయతీలకు నెలకు రూ.339 కోట్ల చొప్పున నిధులు
ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలుపై సమీక్షలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు

సఫాయీ కర్మచారులకు శుభవార్త ■ వేతనం రూ.8500కు పెంపు ■ 36 వేలమంది కార్మికులకు లబ్ధి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గ్రామాల్లో అమలుచేయాల్సిన 60 రోజుల ప్రణాళికలో భాగంగా మొదటిదశలో 30 రోజుల ప్రణాళికను సెప్టెంబర్ 6 నుంచి ప్రారంభించాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కార్యాచరణపై మార్గదర్శనం చేసేందుకు రాష్ట్రంలోని పంచాయతీరాజ్‌శాఖ అధికారులతో సెప్టెంబర్ 3న విస్తృతస్థాయి సమావేశాన్ని సీఎం నిర్వహించనున్నారు. గ్రామాల్లో అతితక్కువ వేతనాలతో పనిచేస్తున్న సఫాయీ కర్మచారులకు ముఖ్యమంత్రి శుభవార్త చెప్పారు. వారి వేతనాలను రూ.8,500కు పెంచుతున్నట్టు ప్రకటించారు. పంచాయతీరాజ్‌శాఖలో అన్ని ఖాళీలను భర్తీచేయడంతోపాటు, కేంద్ర ఆర్థికసంఘం నిధులకు రాష్ట్ర ప్రభుత్వ నిధులు జతచేసి నెలకు రూ.339 కోట్ల చొప్పున గ్రామ పంచాయతీలకు విడుదలచేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో అమలుచేయాల్సిన ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికపై శుక్రవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్ పలువురు మంత్రులు, కలెక్టర్లు, డీపీవోలు, ఉన్నతాధికారులతో ఏడుగంటలపాటు సుదీర్ఘంగా సమీక్షించారు. 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు పర్యవేక్షణకు గ్రామానికి ఒకరు చొప్పున మండలస్థాయి అధికారులను ఇంచార్జులుగా నియమించాలని కలెక్టర్లను ఆదేశించారు. మండల, జిల్లా పరిషత్తులను క్రియాశీలకంగా మార్చేందుకు అవసరమైన సిఫారసులను కలెక్టర్ల నుంచి స్వీకరించి, నిబంధనలు రూపొందించాలని నిర్ణయించారు. పచ్చదనం, పరిశుభ్రతతో

మిగతా 2వ పేజీలో

పది బ్యాంకుల మెగా విలీనం

బ్యాంకుల బలోపేతానికి, రుణవితరణ పెంచడానికే ఈ నిర్ణయం
కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి
12కు తగ్గనున్న ప్రభుత్వరంగ బ్యాంకులు
30 వేలకు పైగా శాఖల మెర్జర్

విలీనం కానున్న బ్యాంకులు..

- పంజాబ్ నేషనల్ బ్యాంక్+ ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్+ యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
- కెనరా బ్యాంక్+ సిండికేట్ బ్యాంక్
- యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా + ఆంధ్రాబ్యాంక్+ కార్పొరేషన్ బ్యాంక్
- ఇండియన్ బ్యాంక్ + అలహాబాద్ బ్యాంక్

శుక్రవారం ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్

మందగమనంలో కొనసాగుతున్న దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడానికి సంస్కరణల బాటపట్టిన కేంద్ర ప్రభుత్వం తాజాగా బ్యాంకింగ్ రంగంలో భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ), బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ)ల్లో పలు బ్యాంకులను విలీనం చేసిన కేంద్రం తాజాగా పది బ్యాంకులను కలిపి నాలుగు పెద్ద బ్యాంకులుగా మార్చుతున్నట్టు శుక్రవారం ప్రకటించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)లో ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ (ఓబీసీ), యునైటెడ్ బ్యాంకులు విలీనమవనుండగా, కెనరా బ్యాంక్‌లో సిండికేట్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్‌లో ఆంధ్రాబ్యాంక్, కార్పొరేషన్ బ్యాంకులు, ఇండియన్ బ్యాంక్‌లో అలహాబాద్ బ్యాంకు కలిసిపోనున్నాయి. దీంతో 30వేలకుపైగా శాఖలు విలీనంకానున్నాయి. అలాగే ప్రభుత్వరంగ బ్యాంకులు 27 నుంచి 12కి తగ్గనున్నాయి. మొండి బకాయిలతో సతమతమవుతున్న బ్యాంకులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి, రుణ వితరణ పెంచడానికి, ఆర్థిక రంగాన్ని పటిష్ఠం చేయడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ బ్యాంకుల విలీనంతో ఉద్యోగుల తొలిగింపు ఉండబోదని మంత్రి స్పష్టం చేయగా.. ఉద్యోగులు మాత్రం ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని నిరసిస్తూ శనివారం దేశవ్యాప్తంగా అన్ని శాఖల వద్ద ఆందోళన చేయనున్నట్లు బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రకటించింది.

వివరాలు 9వ పేజీలో

విలీనం తర్వాత ప్రభుత్వరంగ బ్యాంకుల ర్యాంకులు

స్థానం	బ్యాంక్	వ్యాపార పరిమాణం (రూ.లక్ష కోట్లలో)
1	స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	52.05
2	పీఎన్‌బీ + ఓబీసీ + యునైటెడ్ బ్యాంక్	17.94
3	బీవోబీ (విజయ + దేనా బ్యాంకులు)	16.13
4	కెనరా బ్యాంక్ + సిండికేట్ బ్యాంక్	15.20
5	యూనియన్ + ఆంధ్రా + కార్పొరేషన్	14.59
6	బ్యాంక్ ఆఫ్ ఇండియా	9.03
7	ఇండియన్ బ్యాంక్ + అలహాబాద్ బ్యాంక్	8.08
8	సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	4.68
9	ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	3.75
10	యూకో బ్యాంక్	3.17
11	బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	2.34
12	పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్	1.71

జీడీపీ ధమాల్

- ఆరేండ్ల కనిష్ఠానికి పతనం
- ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 5 శాతంగా నమోదు
- చైనా కంటే దిగజారిన భారత ఆర్థిక వృద్ధిరేటు

9

రేవంత్.. క్షమాపణ చెప్పు

కరంటోళ్ల కన్నెర్ర

ఎంపీ రేవంత్ వ్యాఖ్యలపై భగ్గుమన్న ఉద్యోగులు ● సంచలనాల కోసం మాట్లాడితే సహించబోమని హెచ్చరిక
మాతో పెట్టుకుంటే కాలగర్భంలో కలుస్తావని శాపనార్థాలు ● రాష్ట్రవ్యాప్తంగా మిన్నంటిన ఉద్యోగుల ఆందోళనలు
విద్యుత్‌సౌధ నుంచి గన్‌పార్క్ వరకు కరంటోళ్ల కవాతు ● జిల్లాల్లో భారీ ర్యాలీలు, మహాధర్నాలతో నిరసనల హోరు

శుక్రవారం హైదరాబాద్ గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద ఎంపీ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై నిరసన తెలియజేస్తున్న విద్యుత్ ఉద్యోగ సంఘాల నేతలు

విద్యుత్ సంస్థలను బలోపేతం చేయడంలో కీలకభూమిక పోషిస్తున్న టీఎస్ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావును తుపాకీతో కాల్చినా తప్పులేదన్న మల్కాజిగిరి ఎంపీ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై విద్యుత్ ఉద్యోగులు భగ్గుమన్నారు. రేవంత్‌రెడ్డి తక్షణమే తన వ్యాఖ్యలను వాపస్ తీసుకోవాలని, సీఎండీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్‌చేశారు. లేకుంటే అన్ని పవర్‌ప్లాంట్లు, జిల్లాల ఉద్యోగులను కలుపుకొని ఉద్యమిస్తామని హెచ్చరించారు. రేవంత్ వ్యాఖ్యలను ఖండిస్తూ వరుసగా రెండోరోజైన శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని విద్యుత్ ఉత్పత్తి, సరఫరా కార్యాలయాల ఎదుట ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. హైదరాబాద్‌లో సుమారు ఐదువేలమందితో భారీర్యాలీ నిర్వహించారు. చెట్టు మీద కొంగ.. రేవంత్ దొంగ, రేవంత్ డౌన్‌డౌన్ అంటూ ఉద్యోగులు నినాదాలు చేశారు. గన్‌పార్క్‌లోని అమరవీరుల స్తూపం వద్ద బైఠాయించారు. తమతో పెట్టుకుంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ వరంగల్‌లో అన్ని యూనియన్ నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు.

7

ఉద్యోగులకు భారీగా పదోన్నతులు

ప్రభుత్వానికి ఉద్యోగుల కృతజ్ఞతలు

- ఒక్కరోజే 333 మందికి ప్రమోషన్లు
- సెక్రటేరియట్‌లో 158 మందికి
- సచివాలయ చరిత్రలో ఇదే అత్యధికం
- పోలీస్‌శాఖలో 102 మందికి..

హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వివిధశాఖల్లోని ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున పదోన్నతులు కల్పించింది. శుక్రవారం ఒక్కరోజే సచివాలయంతోపాటు పోలీస్, వైద్య, ఆరోగ్యం, వర్క్స్ అండ్ అకౌంట్స్ తదితర శాఖల్లో దాదాపు 333 మంది ఉద్యోగులకు పదోన్నతులు లభించాయి. ఇప్పటికే కొన్నిశాఖలు ఉత్తర్వులు జారీచేయగా, సచివాలయ ఉద్యోగుల పదోన్నతులపై ఒకట్రెండురోజుల్లో ఉత్తర్వులు వెలువడనున్నాయి. సచివాలయంలో 158 మందికి, పోలీస్ విభాగంలో 102 మందికి, వైద్య, ఆరోగ్యశాఖలో 30 మందికి పదోన్నతులు కల్పించారు. వర్క్స్ అండ్ అకౌంట్స్ విభాగంలో 22 మందికి పదోన్నతులు

మిగతా 3వ పేజీలో

తెలంగాణ 59 టీఎంసీలు ఏపీ 152

శ్రీశైలం, సాగర్ నీటి విడుదలకు కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఆదేశాలు
రెండు జలాశయాల్లో ఎండీడీఎల్ ఎగువన 257.54 టీఎంసీల లభ్యత
ఈ నెల 13 నాటికి 35 టీఎంసీలు వాడుకున్న ఇరు రాష్ట్రాలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాల నుంచి తెలుగు రాష్ట్రాలు నీటిని వినియోగించుకునేందుకు కృష్ణానదీ యాజమాన్యబోర్డు అనుమతి నిచ్చింది. తెలంగాణ 59.01 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్ 152 టీఎంసీలు వాడుకునేందుకు అనుమతినిస్తూ శుక్రవారం బోర్డు సభ్యకార్యదర్శి పరమేశం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 9న జరిగిన త్రిసభ్యకమిటీ సమావేశం నిర్ణయాలకు అనుగుణంగా ఇరురాష్ట్రాల ఈఎన్సీలు సమర్పించిన ఇండెంట్ల ఆధారంగా ఈ ఉత్తర్వులు జారీచేసినట్టు బోర్డు సభ్యకార్యదర్శి తెలిపారు. తాజా నీటిసంవత్సరంలో కృష్ణాబేసిన్‌లో పుష్కలమైన వరద వచ్చింది. ఈ క్రమంలో కీలకమైన శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాశయాలు నిండుకుండల్లా మారాయి. పెద్ద ఎత్తున ఇన్‌ఫ్లోలు వచ్చిన

మిగతా 2వ పేజీలో

దేశవ్యాప్తంగా సీబీఐ ఆకస్మిక తనిఖీలు

హైదరాబాద్ సహా 30 నగరాల్లో సోదాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/న్యూఢిల్లీ, ఆగస్టు 30: అవినీతికి వ్యతిరేకంగా కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) శుక్రవారం దేశవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. హైదరాబాద్ సహా 30 నగరాల్లోని 150 ప్రభుత్వ కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది. వివిధ సంస్థల్లో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై వచ్చిన ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని ఆయా విభాగాల విజిలెన్స్ అధికారులతో కలిసి సంయుక్తంగా ఈ తనిఖీలు నిర్వహించింది. హైదరాబాద్, సికింద్రాబాద్, హన్మకొండ, కరీంనగర్, విశాఖపట్టణం, గుంటూరు, విజయవాడ, ఢిల్లీ, జైపూర్, జోధ్‌పూర్, గువాహటి, శ్రీనగర్, షిల్లాంగ్, చండీగఢ్, సిమ్లా, చెన్నై, మధురై, కోల్‌కతా, బెంగళూరు, ముంబై, పుణె, గాంధీనగర్, లక్నో, డెహ్రాడూన్ తదితర ప్రాంతాల్లో ఆకస్మిక సోదాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. 'సామాన్య పౌరులు, చిరు వ్యాపారులు అత్యంత అవినీతి ఉందని భావిస్తున్న ప్రభుత్వ కార్యాలయాల్లో సోదాలు జరిపాం' అని సీబీఐ అధికారి ఒకరు వెల్లడించారు. రైల్వే, కోల్, కస్టమ్స్, ఎఫ్‌సీఐ, విద్యుత్, మున్సిపల్ కార్పొరేషన్, ఈఎస్ఐసీ, రవాణా, సీపీడబ్ల్యూడీ, అగ్నిమాపక విభాగం, సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, జీఎస్టీ డిపార్ట్‌మెంట్, ప్రభుత్వ రంగ బ్యాంకులు, షిప్పింగ్, బీఎస్ఎన్ఎల్, ఎన్‌హెచ్ఏఐ తదితర ప్రభుత్వ శాఖల్లో ఈ సోదాలు నిర్వహించినట్లు చెప్పారు.

ఖమ్మంలో భారీ వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

భద్రాద్రి, నల్లగొండ, ఆసిఫాబాద్, గ్రేటర్ హైదరాబాద్‌లో ఓ మోస్తరు వాన

నాలుగురోజుల వరకు రాష్ట్రంలో వర్షాలు

ఉపరితల ఆవర్తన ప్రభావంతో శుక్రవారం రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఖమ్మం నగరంలో వర్షం దంచికొట్టింది. భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, కుమ్రంభీం ఆసిఫాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం పడింది. గ్రేటర్ హైదరాబాద్‌లో గురువారం అర్ధరాత్రి తరువాత, శుక్రవారం సాయంత్రం రెండు విడుతల్లో పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసింది. కోస్తా తమిళనాడు దాని పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 7.8 కిలోమీటర్ల వరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో తెలంగాణ మీదుగా రుతుపవనాలు బలపడి చురుకుగా కదులుతున్నాయి. రాగల నాలుగు రోజుల వరకు రాష్ట్రంలో ఓ మోస్తరు వానలు కురిసే అవకాశమున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

7

ఖమ్మం నగరంలో భారీ వర్షం కురవడంతో చెరువును తలపిస్తున్న రోడ్లపై వాహనదారుల ఇబ్బందులు

ధర్మగంట

బాధిత రైతు నర్సిరెడ్డి

పట్టా భూమి అన్యాక్రాంతం

11.12 ఎకరాలు యజమానికి తెలియకుండా ఇతరులకు పట్టా
కాస్తులో ఉన్నా భూరికార్డులు మార్చిన రెవెన్యూ అధికారులు
పట్టా ఎలా మార్చారని అడిగితే రికార్డులు దొరుకడంలేదంటున్న సిబ్బంది
'ధర్మగంట'ను ఆశ్రయించిన నల్లగొండ జిల్లా చెర్వుఅన్నారంవాసి

6

చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)

ఫారం ధర	65.00	రిటైల్ లైవ్	87.00
డ్రెస్‌డ్	126.00	స్కిన్‌లెస్	144.00

గుడ్ల ధరలు (వందకు) (రూ.)

హైదరాబాద్	330.00	రంగారెడ్డి	330.00
మెదక్	330.00	కరీంనగర్	333.00
వరంగల్	333.00	చిల్లర ధర	3.90

కేంద్రప్రభుత్వం రాష్ట్రానికి విడుదల చేసిన రూ.3110 కోట్ల 'కంపా' నిధులకు సంబంధించిన జీవో కాపీని శుక్రవారం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు అందజేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి. చిత్రంలో సీఎంవో అధికారులు భూపాల్‌రెడ్డి, ప్రియాంక వర్గీస్, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆర్ శోభ కూడా ఉన్నారు.

హైకోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్

హైకోర్టులో హరితహారం

- మొక్కలు నాటి, మట్టి గణపతి ప్రతిమల పంపిణీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జీహెచ్ఎంసీ, హైకోర్టు అధికారులు సంయుక్తంగా హైకోర్టు ప్రాంగణంలో శుక్రవారం తెలంగాణకు హరిత హారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, పలువురు న్యాయమూర్తులు మొక్కలు నాటారు. అనంతరం హైకోర్టు బార్ అసోసియేషన్ హాల్‌లో జీహెచ్ఎంసీ ప్రత్యేకంగా నిర్వహించిన కార్యక్రమంలో సీజే రాఘవేంద్రసింగ్ చౌహాన్.. న్యాయవాదులు, ఉద్యోగులకు మొక్కలు, పర్యావరణ హిత మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు ఎంఎస్ రామచంద్రారావు, పీ నవీన్‌రావు, అభినంద్‌కుమార్, అమర్‌నాథ్‌గౌడ్, వినోద్‌కుమార్, ఏ అభిషేక్‌రెడ్డి, కే లక్ష్మణ్, అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, జీహెచ్ఎంసీ కమిషనర్ లోకేశ్‌కుమార్, బార్ అధ్యక్షుడు సూర్యకరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు 24 నుంచి అర్ధసంవత్సర పరీక్షలు

- 11 వరకు దరఖాస్తు గడువు: టీఎస్‌పీఎస్సీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయ, రాష్ట్రస్థాయి సర్వీసుల్లో పనిచేస్తున్న అధికారులకు అర్ధసంవత్సర భాష, ఇతర పరీక్షలను సెప్టెంబర్ 24 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఏ వాణిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 11 వరకు దరఖాస్తు చేసుకోవాలని, అందుకు www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

అమితాబ్ ఛటోపాధ్యాయకు.. జీఎన్ రామచంద్రన్ గోల్డ్ మెడల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) శాస్త్రవేత్త, ప్రొఫెసర్ అమితాబ్ ఛటోపాధ్యాయను 'జీఎన్ రామచంద్రన్ గోల్డ్ మెడల్' అవార్డు వరించింది. బయోలాజికల్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ప్రతిభచాటినందుకు ఛటోపాధ్యాయను ఈ అవార్డుకు ఎంపికచేసినట్టు కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చ్ (సీఎస్ఐఆర్) శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపింది. భారత్‌లో స్ట్రక్చరల్ బయాలజీ ఫాదర్‌గా పేరుగాంచిన డాక్టర్ జీఎన్ రామచంద్రన్ పేరిట 2004 నుంచి ఈ అవార్డును అందజేస్తున్నారు.

సమర్థంగా నకిలీ వార్తల నియంత్రణ

- సైబర్ నిపుణుడు అరుణ్‌మోహన్ సుకుమార్ కితాబు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నకిలీ వార్తలను నియంత్రించేందుకు తెలంగాణలో సమర్థులైన అధికారులున్నారని సైబర్ నిపుణుడు అరుణ్‌మోహన్ సుకుమార్ కితాబిచ్చారు. సోషల్ మీడియాను నియంత్రించేందుకు సరైన మార్గమేమిటని శుక్రవారం ఓ పత్రిక నిర్వహించిన ఇంటర్వ్యూలో ప్రశ్నించగా.. నకిలీ వార్తల నియంత్రణకు ఎక్కువ పెట్టుబడి అవసరమన్నారు. అయితే అన్ని రాష్ట్రాలకు ఈ సామర్థ్యం లేదని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో ఇది సాధ్యమైందని, దూరదృష్టి కలిగిన సీఎం కేసీఆర్ పరిపాలన ప్రభావంతో దీనిని రుజువు చేశారని కొనియాడారు.

ముహూర్తం

సూర్యోదయం: 6.06 గంటలకు

సూర్యాస్తమయం: 6.27 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం పాడ్యమి మధ్యాహ్నం 12.15 వరకు, తదుపరి విదియ, నక్షత్రం: పుబ్బ మధ్యాహ్నం 2.08 వరకు, తదుపరి ఉత్తర, అమృతఘడియలు: ఉదయం 8.33 నుంచి 10.09 వరకు, రాహుకాలం: ఉదయం 9.11 నుంచి 10.44 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 6.06 నుంచి 7.44 వరకు, వర్జ్యం: మధ్యాహ్నం 2.29 నుంచి సాయంత్రం 4.05 వరకు,

లోకం పోకడ

చవితి చంద్రుడిని చూడొద్దు సరే.. చంద్రయాన్ ఫొటోలు కూడా చూడొద్దా స్వామీ?

ఆరు నుంచి గ్రామబాట

మొదటిపేజీ తరువాయి...

గ్రామాలు వెల్లివిరియాలని, ప్రణాళికాపద్ధతిలో గ్రామాల అభివృద్ధి, నియంత్రిత పద్ధతిలో నిధుల వినియోగం జరుగాలని, మొత్తంగా విస్తృత ప్రజాభాగస్వామ్యంతో గ్రామాల రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా పనిచేయాలని సీఎం పిలుపునిచ్చారు. ఈ బృహత్తర లక్ష్యం నెరవేర్చడానికి అవసరమైన ఒరవడికి 30 రోజుల కార్యాచరణ నాంది పలుకాలని ఆకాంక్షించారు. మొదట 60 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలుచేయాలని భావించినప్పటికీ.. అధికారుల సూచనమేరకు మొదటిదశలో 30 రోజులపాటు నిర్వహించి, మరో దశ కొనసాగించాలని నిర్ణయించారు. గ్రామాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా చేస్తున్న ఈ ప్రయత్నాన్ని నిరంతరం కొనసాగించాలని నిర్ణయించినట్టు సీఎం వెల్లడించారు.

మన ఊరిని మనమే బాగుచేసుకోవాలి

మంత్రులు, అధికారులతో విస్తృతంగా చర్చించిన తర్వాత 30 రోజుల్లో గ్రామాల్లో నిర్వహించాల్సిన పనులను సీఎం కేసీఆర్ ఖరారుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 72 ఏండ్లు గడిచినా గ్రామాల్లో పరిస్థితి ఇంకా దుర్భరంగానే ఉన్నది. మన ఊరును మనమే బాగుచేసుకోవాలనే స్పృహరావాలి. చేయగలిగి కూడా చేయకుంటే నేరం అవుతుంది. ఏ ఊరు ప్రజలు ఆ ఊరుకు కథానాయకులు కావాలి. ఊరి పరిస్థితిని మార్చుకోవాలి. పనిచేసే గ్రామ పంచాయతీ వ్యవస్థను తయారుచేయడం కోసమే కొత్త పంచాయతీరాజ్ చట్టం వచ్చింది. పంచాయతీరాజ్ వ్యవస్థలో గ్రామకార్యదర్శి నుంచి జిల్లాపరిషత్ సీఈవో వరకు అన్ని ఖాళీలను భర్తీచేస్తున్నాం. కావాల్సినన్ని నిధులు విడుదలచేస్తున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధుల బాధ్యతలను చట్టం స్పష్టంగా పేర్కొన్నది. విధులపట్ల నిర్లక్ష్యం వహించేవారిపై చర్యలు తీసుకునే అధికారంకూడా చట్టం కల్పించింది. చాలా ముఖ్యమైన పనులను ప్రభుత్వమే తన యంత్రాంగం ద్వారా నేరుగా చేస్తున్నది. గ్రామంలో పచ్చదనం పెంచడం, పరిశుభ్రత పాటించడం, పన్నులు వసూలుచేయడంలాంటి బాధ్యతలు గ్రామపంచాయతీలు నెరవేర్చాల్సి ఉన్నది. గ్రామాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. ప్రభుత్వ సంకల్పానికి ప్రజల సహకారం కూడా కావాలి. 30 రోజుల ప్రత్యేక కార్యాచరణతో కలిసిపనిచేసి గ్రామాలను మార్చుకునే సంస్కృతి అలవాటుకావాలి' అని అన్నారు. ఈ సమావేశంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సీ లక్ష్మారెడ్డి, కాలె యాదయ్య, విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, పంచాయతీరాజ్ కార్యదర్శి వికాస్‌రాజ్, సీఎంవో ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, పీసీసీఎఫ్ శోభ, అడిషనల్ పీసీసీఎఫ్ డోబ్రియాల్, సిద్దిపేట జిల్లా కలెక్టర్ వెంకట్రామిరెడ్డి, డీఎఫ్‌వో శ్రీధర్‌రావు, జెడ్పీ సీఈవో గోపాల్‌రావు, డీపీవో సురేశ్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ కరుణాకర్, వరంగల్ అర్బన్ జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్, డీఎఫ్‌వో రామలింగం, జెడ్పీ సీఈవో ప్రసూనారాణి, డీపీవో మహమూద్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రాజేంద్ర చౌహాన్, కామారెడ్డి జిల్లా కలెక్టర్ సత్యనారాయణ, డీఎఫ్‌వో వసంత, జెడ్పీ సీఈవో కాంతమ్మ, డీపీవో నరేశ్, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ శేషారావు, గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ డైరెక్టర్ ఆశ, పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్లు రామారావు, సుధాకర్‌రావు, ఆయా జిల్లాలకు చెందిన పలువురు ఎంపీడీవోలు, ఈవోపీఆర్డీలు పాల్గొన్నారు.

శుక్రవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్వహించిన సమీక్షా సమావేశానికి హాజరైన ఉన్నతాధికారులు

3న విస్తృతస్థాయి సమావేశం

ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికపై క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులకు మార్గదర్శనం చేసేందుకు సెప్టెంబర్ 3న హైదరాబాద్‌లోని తెలంగాణ అకాడమీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్‌లో విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తారు. మంత్రులు, రాష్ట్రస్థాయి అధికారులు, కలెక్టర్లతోపాటు డీఎఫ్‌వోలు, జెడ్పీ సీఈవోలు, ఎంపీడీవోలు, డీపీవోలు, డీఎల్పీవోలు, ఎంపీవోలను ఈ సమావేశానికి ఆహ్వానించారు. మధ్యాహ్న భోజనం తర్వాత రెండుగంటలకు సమావేశం ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 4న అన్ని జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సమావేశాలు నిర్వహిస్తారు. 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలుచేసే అధికారులతో సమావేశమై కలెక్టర్లు తగిన సూచనలు చేస్తారు. మొత్తం కార్యక్రమం కలెక్టర్ల పర్యవేక్షణలో జరుగుతుంది.

సఫాయీ కర్మచారులకు నెలకు రూ.8,500 వేతనం

రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీల్లో కలిపి 36 వేలమంది సఫాయీ కర్మచారులు పనిచేస్తున్నారు. ఆయా గ్రామపంచాయతీల ఆర్థిక పరిస్థితినిబట్టి రూ.1000 నుంచి రూ.5000 వరకు వేతనంతో వారు జీవితం వెళ్లదీస్తున్నారు. గ్రామపంచాయతీ బాధ్యతలు నిర్వహించడంతోపాటు మరో పని వెతుక్కోవాల్సి వస్తున్నది. వీరి దీన స్థితిని అర్థంచేసుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్.. సఫాయీ కర్మచారుల వేతనాలను రూ.8,500కు పెంచాలని నిర్ణయించారు. సఫాయీ కర్మచారులు ఇకపై పూర్తిస మయం గ్రామపంచాయతీ విధులకే కేటాయించాల్సి ఉంటుంది.

ఇదీ.. 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ

- మొదటిరోజు గ్రామసభ నిర్వహిస్తారు. 30 రోజుల ప్రత్యేక కార్యాచరణ ఎందుకు నిర్వహిస్తున్నామో ప్రజలకు విడమరిచి చెప్పాలి. ప్రభుత్వ ఉద్దేశాలను వివరిస్తారు. ప్రజల విస్తృత భాగస్వామ్యాన్ని ఆహ్వానించాలి.
- రెండోరోజు కోఆప్షన్ సభ్యుల ఎంపిక, గ్రామపంచాయతీ స్టాండింగ్ కమిటీల ఎంపిక నిర్వహించాలి.
- సర్పంచ్ కుటుంబసభ్యులను కో ఆప్షన్ సభ్యులుగా ఎంపిక చేయరాదు.
- గ్రామానికున్న అవసరాలేమిటి? ఉన్న వనరులేమిటి? అనే విషయాలను బేరీజు వేసుకుని, వాటికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలి.
- ఆ ఏడాది చేయాల్సిన పనులకు, వార్షిక ప్రణాళిక, ఐదేండ్లలో చేయాల్సిన పనులకు కూడా పంచవర్ష ప్రణాళిక రూపొందించాలి.
- ఈ ప్రణాళికలకు గ్రామసభ ఆమోదం తీసుకోవాలి. ఈ ప్రణాళిక ఆధారంగానే నిధులు ఖర్చు చేయాలి.

పారిశుద్ధ్య నిర్వహణ

- కూలిపోయిన ఇండ్లు, భవనాల శిథిలాలను తొలిగించాలి.
- పనికిరాని, ఉపయోగించని బావులు, లోతట్టు ప్రాంతాలను పూడ్చటంద్వారా నీరు నిలువకుండా చర్యలు చేపట్టి, దోమల ఉత్పత్తిని నిరోధించాలి.
- పాఠశాలలు, అంగన్‌వాడీలు వంటి అన్ని ప్రభుత్వ సంస్థలను శుభ్రపరచాలి.
- సర్కారుతుమ్మ, జిల్లేడులాంటి పిచ్చిమొక్కలను తొలిగించాలి.
- అన్ని రహదారులను శుభ్రంచేయాలి.
- డ్రైనేజీలను శుభ్రంచేయాలి. డ్రెయిన్లకు మరమ్మతులు చేయాలి. మురికికాల్వలో ఇరుక్కుపోయిన చెత్తాచెదారం తొలిగించాలి.
- అపరిశుభ్ర ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లటం ద్వారా పరిశుభ్రతా కార్యక్రమాలను చేపట్టాలి.
- లోతట్టు ప్రాంతాల్లో, రోడ్లపై నిలిచిన నీటిని తొలిగించాలి.
- గ్రామస్థులందరూ నెలలో రెండు సార్లు శ్రమదానంలో పాల్గొనేలా ప్రోత్సహించాలి.
- సంతలు, మార్కెట్ ప్రదేశాలను శుభ్రపరచాలి.
- మొక్కలకు నీరు పోయటానికి, చెత్త సేకరణకు గ్రామపంచాయతీలు ట్రాక్టర్ సమకూర్చుకోవాలి.
- అన్ని గ్రామాల్లో డంప్‌యార్డ్ ఏర్పాటుకు కావాల్సిన భూమిని గుర్తించాలి. తగిన ప్రభుత్వ భూమి అందుబాటులో లేనట్లయితే పంచాయతీ నిధులతో స్థలం కొనుగోలుచేయాలి.
- శ్మశానవాటిక నిర్మాణానికి అనుగుణమైన స్థలాన్ని గుర్తించాలి.
- గ్రామపంచాయతీలో వందశాతం మరుగుదొడ్లు నిర్మించడానికి ప్రణాళిక రూపొందించాలి.

హరితహారం

- గ్రామపంచాయతీలే గ్రామంలో నర్సరీలను ఏర్పాటుచేయాల్సి ఉన్నందున, వాటికి శాశ్వత ప్రాతిపదికన అనువైన స్థలం ఎంపికచేయాలి.
- నర్సరీలను పెంచడానికి ఫారెస్ట్ రేంజ్ అధికారి గ్రామపంచాయతీలకు సాంకేతిక సహకారం అందించాలి.
- 12,751 గ్రామపంచాయతీ హరితహారం నర్సరీలతోపాటు కొన్ని ప్రత్యేకమైన జాతులతో (మొక్కలతో) తమ సొంత నర్సరీలను అటవీశాఖ పెంచుకోవచ్చు.
- రైతులను, వారికి అవసరమైన మొక్కలను వ్యవసాయ విస్తరణాధికారుల సహకారంతో గ్రామపంచాయతీ గుర్తించాలి. ఇంటిదగ్గర నాటడానికి అవసరమైన పండ్లు, పూలమొక్కల ఇండెంట్‌ను సేకరించాలి. గ్రామపంచాయతీ లోపల నాటడానికి అందుబాటులో ఉన్న భూములను, పంచాయతీ సరిహద్దుల్లో ఉన్న భూములు, రహదారులను కూడా గ్రామపంచాయతీ గుర్తించాలి. ఈ వివరాల ఆధారంగా, గ్రామపంచాయతీ గ్రీన్ ప్లాన్ (హరిత ప్రణాళిక)ను సిద్ధంచేయాలి. ఈ గ్రీన్‌ప్లాన్‌ను గ్రామసభ ఆమోదించాలి.
- జిల్లా గ్రీన్‌కమిటీ సూచనలకు అనుగుణంగా హరితప్రణాళికను రూపొందించాలి.
- గ్రామపంచాయతీలు మొక్కలు పెట్టడంతోపాటు, రక్షణ బాధ్యత తీసుకోవాలి.

పవర్ వీక్

- 30 రోజుల కార్యాచరణలో వారంపాటు పవర్‌వీక్ నిర్వహించాలి.
- వేలాడుతున్న, వదులుగా ఉండే కరంట్ వైర్లు, విద్యుత్ స్తంభాలను సరిచేయాలి.
- వంగిన స్తంభాలను సరిచేయాలి. తుప్పుపట్టిన స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు పెట్టాలి.
- వీధిదీపాల సమర్థ నిర్వహణకు థర్డ్ వైర్, ప్రత్యేక మీటర్, స్విచ్‌లు బిగించాలి.
- వీధిలైట్లు పగలు వెలుగకుండా చూడాలి. చలికాలంలో సాయంత్రం 6 గంటలనుంచి ఉదయం 6.30 వరకు, ఇతర సమయాల్లో సాయంత్రం 7 గంటలనుంచి ఉదయం 5.30 వరకు వీధిదీపాలు వెలిగి ఉండేలా చూడాలి.

నిధుల వినియోగం

- కేంద్ర ఆర్థికసంఘం నిధులకు రాష్ట్ర ప్రభుత్వ నిధులు కూడా జమచేసి, ప్రభుత్వం గ్రామపంచాయతీలకు నిధులు విడుదల చేస్తుంది. ప్రతినెల రూ. 339 కోట్ల చొప్పున గ్రామపంచాయతీలకు నిధులు వస్తాయి.
- వీటితోపాటు గ్రామపంచాయతీ స్వీయ ఆదాయం, నరేగా నిధులు కూడా గ్రామ పంచాయతీలకు అందుబాటులో ఉంటాయి.
- గ్రామపంచాయతీ బడ్జెట్‌లో పది శాతం నిధులను పచ్చదనం పెంచే కార్యక్రమాల కోసం కేటాయించాలి.
- అప్పులు, జీతాలు చెల్లించడంలాంటి వాటితోపాటు విద్యుత్‌బిల్లుల చెల్లింపును కూడా తప్పనిసరి చేయాల్సిన చెల్లింపుల జాబితాలో (చార్జ్‌డ్ అకౌంట్) చేర్చాలి.
- వార్షిక ప్రణాళిక, పంచవర్ష ప్రణాళికకు అనుగుణంగానే నిధులు ఖర్చుచేయాలి.

సంపద సృష్టికి భారీ పెట్టుబడి

- బడ్జెట్‌లో పెరుగుతున్న పెట్టుబడి కేటాయింపులు
- అభివృద్ధి, భవిష్యత్ అవసరాలకూ ప్రాధాన్యం
- 30 శాతానికి చేరిన క్యాపిటల్ వ్యయం

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పదేండ్ల బడ్జెట్‌లో తెలంగాణలో అభివృద్ధి ప్రాజెక్టులకు కేటాయించిన మొత్తం రూ. 54,052 కోట్లు. కానీ, ప్రత్యేక తెలంగాణలో కేవలం ఐదేండ్లలోనే సంపద సృష్టి, భవిష్యత్ అవసరాల కోసం బడ్జెట్‌లో కేటాయించిన మొత్తం రూ.1.02,140 కోట్లు. ఇతర రూపంలో మరో 62,379 కోట్ల కేటాయింపుతో బడ్జెట్, బడ్జెటేతర పెట్టుబడి వ్యయం కేటాయింపులు రూ.1,64,518 కోట్లు దాటింది. ఒకవైపు సంక్షేమం, అభివృద్ధితోపాటు భవిష్యత్ ప్రయోజనాల కోసం సంపదను సృష్టించేందుకు తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే అత్యధికంగా క్యాపిటల్ వ్యయాన్ని వెచ్చిస్తున్నది. నోట్లరద్దు, జీఎస్టీ ఒడిదుడుకులు, ఆర్థిక మాంద్యం వంటి అనేక అవాంతరాలను అధిగమించి సొంతరాబడులను పెంచుకుంటూనే మరోవైపు సంపదను వృద్ధి చేసేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది.

వ్యవసాయం, నీటిపారుదలరంగాల అభివృద్ధితోపాటు ఇతరరంగాల పురోగతికి పెట్టుబడి వ్యయాన్ని పెంచుతున్నది. రవాణారంగం, పరిశ్రమలకు మౌలికవసతులు, ఖనిజ వనరుల అభివృద్ధికీ వ్యయంచేస్తున్నది. దీనివల్ల రాష్ట్ర సంపద మరింత పెరిగి రాష్ట్రస్థూల జాతీయోత్పత్తి (జీఎస్డీపీ) పెరుగుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నడూలేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో రెవెన్యూవ్యయంలో క్యాపిటల్ వ్యయం 25 నుంచి 30 శాతానికి చేరడం విశేషం. సంక్షేమంతో పాటు సంపద సృష్టికి ప్రభుత్వం పక్కాప్రణాళికతో నిధులను పెంచుతున్నది. వాస్తవానికి ఉమ్మడి ఏపీలో భవిష్యత్ అవసరాల కోసం పెట్టుబడిని వెచ్చించడంలో తీవ్రనిర్లక్ష్యం జరిగింది. 2004-05 నుంచి 2013-14వరకు పదేండ్లలో తెలంగాణకు కేవలం రూ.54,052 కోట్లు కేటాయించారు. కానీ తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక పరిస్థితి ఒక్కసారిగా మారింది. బడ్జెట్‌లో భవిష్యత్ సంపద సృష్టి కోసం 25 నుంచి 30 శాతం నిధులను కేటాయిస్తున్న రాష్ట్రాలలో తెలంగాణ మొదటి స్థానంలో నిలుస్తున్నది. 2014-15లో పెట్టుబడి వ్యయం కింద రూ. 8,372.94 కోట్లు ఖర్చుచేయగా 2015-16 ఆర్థిక సంవత్సరానికి 13,590.39 కోట్లకు పెరిగింది. 2016-17లో కేటాయింపులు రూ. 33,370.57 కోట్లకు పెరిగాయి. సవరించిన అంచనాల ప్రకారం అందులో రూ. 25.447.15 కోట్లు ఖర్చుచేశారు. 2018-19లో క్యాపిటల్ వ్యయం కింద రూ. 33,369 కోట్ల వరకు ఉంటుందని అంచనావేశారు. 2019-20 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన రూ.లక్షాఎనభై వేల కోట్ల మధ్యంతర బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం లక్షా ముప్పైవేల కోట్ల వరకు ఉండగా క్యాపిటల్ వ్యయం రూ.32,815 కోట్లుగా ఉంది. మరికొన్ని రోజుల్లో ప్రవేశపెట్టనున్న పూర్తిస్థాయి బడ్జెట్‌లో దాదాపుగా రూ.32 వేల కోట్ల కేటాయింపులు ఉండే అవకాశమున్నది. నీటిపారుదల ప్రాజెక్ట్‌లకు అన్ని ఖాతాల్లో కలిపి ప్రభుత్వం ఏటా 25 వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నది. నీటి పారుదలరంగంపై క్యాపిటల్ వ్యయం ఖాతాలో 2015-16లో 10,933.57 వెచ్చించగా, అది 2016-17లో 13,664.58 కోట్లకు పెరిగింది. 2017-18లో 10,078.46 కోట్లు వెచ్చించారు. 2018-19లో ఈ క్యాపిటల్ వ్యయం 15 వేల కోట్ల వరకు ఉంటుందని అంచనా. నీటి పారుదలరంగానికి ఈ ఏడాది 35 వేల కోట్ల వరకు కేటాయించాలని నీటిపారుదలశాఖ అంచనాలను పంపింది. మిగతా నిధులను రవాణా రంగం, పరిశ్రమలు, ఖనిజవనరులు, వ్యవసాయ, అనుబంధ రంగాలు, ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమంపై పెట్టుబడి వ్యయంగా వెచ్చించనున్నది.

క్యాపిటల్ వ్యయం కింద బడ్జెట్‌లో కేటాయింపులు

సంవత్సరం	బడ్జెట్ కేటాయింపులు	బడ్జెటేతర కేటాయింపులు	మొత్తం
2014-15	8,373	893	9,266
2015-16	13,590	3,500	17,090
2016-17	33,371	10,586	43,956
2017-18	23,902	23,266	47,168
2018-19 (ప్రొవిజనల్)	22,904	24,134	47,038
ఐదేండ్లలో మొత్తం	1,02,140	62,379	1,64,518

తెలంగాణకు 59 టీఎంసీలు

మొదటిపేజీ తరువాయి...

సమయంలోనే ఈ నెల 9న కృష్ణాబోర్డు సమావేశాన్ని నిర్వహించడంతోపాటు త్రిసభ్య కమిటీ సమావేశాన్ని కూడా నిర్వహించారు. అందులో ప్రత్యేకంగా దామాషా, ఇతరత్రా కీలక నిర్ణయాలు తీసుకోనప్పటికీ.. ఈసారి ప్రాజెక్టులకు మంచి వరద ఉన్న దరిమిలా తదుపరి ఇండెంట్ల ద్వారా నీటి విడుదలపై తుది నిర్ణయం తీసుకుంటామని బోర్డు పేర్కొన్నది. తాగు, సాగునీటి అవసరాలకుగాను ఇప్పటికే రెండు రాష్ట్రాలు నీటి వినియోగాన్ని ప్రారంభించినప్పటికీ.. భారీఎత్తున సాగు అవసరాల నేపథ్యంలో ఇటీవల రెండు రాష్ట్రాలు ఇండెంట్లు సమర్పించాయి. శ్రీశైలం, సాగర్ నుంచి 60 టీఎంసీలు కావాలని తెలంగాణ, 152 టీఎంసీల వినియోగానికి ఏపీ అనుమతి కోరాయి. అయితే ఇప్పటివరకు వాడుకున్న వినియోగాన్ని కూడా ఇందులో జోడించి అనుమతి ఇవ్వాల్సిందిగా రెండు రాష్ట్రాలు సూచించాయి. కాగా ఈ నెల 13 నాటికి రెండు జలాశయాల్లో ఉన్న నీటిలభ్యత ఆధారంగా బోర్డు ఉత్తర్వులు జారీచేసింది. ఆ రోజుకు శ్రీశైలం జలాశయంలో 182.220 టీఎంసీలు (878.90 అడుగులు) నీటినిల్వ ఉన్నందున ఎండీడీఎల్ (834 అడుగులు) ఎగువన 128.369 టీఎంసీలు, నాగార్జునసాగర్ జలాశయంలో 260.84 టీఎంసీలు (571.70 అడుగులు) నీటినిల్వ ఉన్నందున ఎండీడీఎల్ (510 అడుగులు) ఎగువన 129.171 టీఎంసీల నీటిలభ్యత ఉన్నదని పేర్కొన్నారు. ఇలా రెండు జలాశయాల్లో ఎండీడీఎల్ ఎగువన 257.54 టీఎంసీల నీటి లభ్యత ఉన్నదని తేల్చారు. ఈ క్రమంలో రెండు రాష్ట్రాల ఇండెంట్లను పరిశీలించిన కృష్ణాబోర్డు ఎలాంటి కోతలు లేకుండానే నీటి విడుదల ఉత్తర్వులు జారీచేసింది. ఆంధ్రప్రదేశ్ తన దామాషాకంటే ఎక్కువ ఇండెంట్ సమర్పించినప్పటికీ తదుపరి ఇండెంట్లలో ఆ మేరకు సర్దుబాటు జరుగుతుందని బోర్డు తన ఉత్తర్వుల్లో పేర్కొంది.

13 నాటికి 35 టీఎంసీల వినియోగం

కృష్ణాబోర్డు రెండు రాష్ట్రాలకు శ్రీశైలం, సాగర్ జలాశయాల నుంచి 211.01 టీఎంసీల నీటి వినియోగానికి అనుమతి ఇచ్చినా.. ఈ నెల 13వ తేదీనాటికి రెండు రాష్ట్రాల నీటి వినియోగాన్ని కూడా ఇందులో కలిపింది. ఈ క్రమంలో 13వ తేదీనాటికి రెండు జలాశయాల నుంచి ఆంధ్రప్రదేశ్ 20.505 టీఎంసీలు, తెలంగాణ 13.998 టీఎంసీలు వాడుకున్నాయి. అంటే రెండు రాష్ట్రాలు సుమారు 35 టీఎంసీలు వాడుకున్నందున.. నీటి విడుదల ఉత్తర్వుల ప్రకారం ఇంకా 176 టీఎంసీల వరకు వాడుకోవాల్సి ఉంటుంది. అయితే బోర్డు తన ఉత్తర్వుల్లో ఆంధ్రప్రదేశ్ 13వ తేదీనాటికి 35.575 టీఎంసీలు వాడుకున్నట్లుగా పేర్కొంది. సాంకేతిక లోపంతో వినియోగాన్ని ఎక్కువ వేసినట్టు తెలిసింది.

తాగు, సాగు అవసరాలకు నీటి విడుదల ఇలా..

ప్రాజెక్టు	తెలంగాణ	ఆంధ్రప్రదేశ్
శ్రీశైలం జలాశయం నుంచి కల్వకుర్తి ఎత్తిపోతల పథకం	14.50	-
పోతిరెడ్డిపాడు	-	88.00
హంద్రీనీవా, ముచ్చుమర్రి లిఫ్టు	-	12.00
నాగార్జునసాగర్ జలాశయం నుంచి ఎడమకాల్వ	26.06	5.00
కుడికాల్వ	-	32.00
కృష్ణాడెల్టా	-	15.00
ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు	10.47	-
హైదరాబాద్ తాగునీటి అవసరాలు	5.90	-
మిషన్ భగీరథ	2.08	-
మొత్తం	59.01	152.00

స్పైసెస్ బోర్డును తరలించవద్దు

- ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలోనే కొనసాగించాలి
- నిజామాబాద్‌లో పసుపుబోర్డు ఏర్పాటుచేయాలి
- కేంద్రమంత్రికి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్ లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వరంగల్ జిల్లా కేంద్రంలోని స్పైసెస్ బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని నిజామాబాద్‌కు తరలించవద్దని, నిజామాబాద్‌లో ప్రత్యేకంగా పసుపు బోర్డును నెలకొల్పాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్‌గోయల్‌కు లేఖరాశారు. ప్రస్తుతం వరంగల్‌లో ఉన్న స్పైసెస్‌బోర్డు ప్రాంతీ

'ఆరోగ్యవనం, జటాయువు' ప్రారంభం

మేడ్చల్ జిల్లా కీసర మండలం దమ్మాయిగూడ మున్సిపాలిటీపరిధిలోని నాగారం రిజర్వ్‌ఫారెస్టులో ఏర్పాటుచేసిన ఆరోగ్యవనం పార్కు, మేడిపల్లి మండలంలో జటాయువు అర్బన్‌పార్కును మంత్రులు చామకూర మల్లారెడ్డి, అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. 40 ఎకరాల్లో రూ.74.424 లక్షలతో ఆరోగ్యవనం పార్కు, రూ.కోటితో జటాయువు పార్కు ఏర్పాటుచేసినట్టు వారు తెలిపారు. కార్యక్రమాల్లో మేడ్చల్ కలెక్టర్ ఎంవీ రెడ్డి, పీసీసీఎఫ్ శోభ, అడిషనల్ పీసీసీఎఫ్‌లు జీ చంద్రశేఖర్‌రెడ్డి, స్వర్గం శ్రీనివాస్, ఫర్గెయిన్ పాల్గొన్నారు. -మేడ్చల్ కలెక్టరేట్/ఘట్‌కేసర్

శభాష్ నాగమల్లు

బరువు కాదు.. బాధ్యత

నీటిలోనుంచి వృద్ధుడిని భుజంపై మోసుకొచ్చిన ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు నిదర్శనంగా నిలుస్తున్నారు తెలంగాణ పోలీసులు. ఎల్బీనగర్ నుంచి సాగర్ రింగ్‌రోడ్డు వెళ్లేదారిలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. శుక్రవారం కురిసిన వర్షానికి ఆ ప్రాంతంలో భారీగా నీరు నిలిచింది. అక్కడే ఉన్న ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అంజపల్లి నాగమల్లు.. స్వయంగా మ్యాన్‌హోల్‌లో చెత్తను తొలిగించారు. అదేసమయంలో అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడైన తండ్రితో కలిసి స్కూటీపై అటుగా వెళ్తున్న వ్యక్తి వర్షపు నీటిలో చిక్కుకున్నాడు. గమనించిన నాగమల్లు.. ఇతరుల సాయంతో తప్ప నడువలేని పరిస్థితిలో ఉన్న వృద్ధుడిని భుజంపై మోస్తూ బయటకు తీసుకొచ్చారు. - వనస్థలిపురం

బతుకమ్మ చీరెలకు బ్రాండ్ ఇమేజ్!

- ప్రత్యేక లోగో కోసం ప్రయత్నాలు
- 100 రంగుల్లో బతుకమ్మ చీరెల తయారీ
- ఎమ్మెల్యే కేటీఆర్ చొరవతో నేతన్నలకు ఉపాధి
- సిరిసిల్లకు కోటి చీరెల తయారీ ఆర్డర్లు
- చేనేత, జౌళిశాఖ డైరెక్టర్ శైలజారామయ్యార్
- బతుకమ్మ చీరెల తయారీని పరిశీలించిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల బృందం

శుక్రవారం సిరిసిల్లలో బతుకమ్మ చీరెల తయారీ గురించి మీడియా ప్రతినిధులకు వివరిస్తున్న చేనేత జౌళిశాఖ డైరెక్టర్ శైలజారామయ్యార్

సిరిసిల్ల టౌన్:

సిరిసిల్ల నేతన్నలకు స్థానిక ఎమ్మెల్యే కే తారక రామారావు ప్రత్యేక చొరవతో ఉపాధి అవకాశాలు ఎంతో మెరుగయ్యాయని, బతుకమ్మ చీరెలకు బ్రాండ్ ఇమేజ్ లభిస్తున్నదని చేనేత, జౌళిశాఖ రాష్ట్ర డైరెక్టర్ శైలజారామయ్యార్ చెప్పారు. ప్రభుత్వ సహకారంతో వచ్చే రెండేండ్లలో సిరిసిల్ల బతుకమ్మ చీరెలకు ప్రత్యేక లోగో, బ్రాండ్ ఇమేజ్ తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని, తద్వారా సిరిసిల్ల పరిశ్రమకు, కార్మికులు, ఆసాములు, యజమానులకు ప్రత్యేక గుర్తింపుతోపాటు ఉపాధి అవకాశాలు విస్తృతమయ్యే అవకాశముందని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు శుక్రవారం సిరిసిల్లలో మరమగ్గాలపై తయారవుతున్న బతుకమ్మ చీరెలను పరిశీలించారు. తొలుత వెంకట్రావునగర్‌లో మరమగ్గాల పరిశ్రమతోపాటు వార్పిన్ కేంద్రాన్ని సందర్శించి, అక్కడి కార్మికులతో మాట్లాడారు. వారి జీవనస్థితిగతులను తెలుసుకున్నారు. అనంతరం మార్కెట్‌యార్డు గోదాంలోని బతుకమ్మ చీరెల స్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో శైలజారామయ్యార్ మాట్లాడుతూ, కార్మికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలన్న ప్రధానలక్ష్యంతో ఎమ్మెల్యే కేటీఆర్ కృషి ఫలితంగా సిరిసిల్లకు కోటి చీరెల తయారీ ఆర్డర్లు దక్కాయన్నారు. 2017లో 95 లక్షల చీరెలు, 2018లో 99 లక్షలు, 2019కిగాను కోటి చీరెల తయారీకి ప్రభుత్వం ఆర్డర్లు అందించిందని తెలిపారు. 122 మ్యాక్ సొసైటీల ద్వారా ఈసారి వందరకాల చీరెలను తయారుచేయిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 50 లక్షలకు పైగా చీరెలను పలు జిల్లాలకు సరఫరా చేశామని, సెప్టెంబర్ 28లోగా లక్ష్యాన్ని పూర్తిచేస్తామని తెలిపారు. 26వేలకుగాను 14వేల మరమగ్గాల అప్‌గ్రేడేషన్ పూర్తిచేశామని, చీరెల ఉత్పత్తి ద్వారా సుమారు పదివేల మందికిపైగా కార్మికులకు ఉపాధి లభిస్తున్నదని చెప్పారు. ఒక్కొక్కరు ప్రతినెలా కనీసం రూ.16 వేలనుంచి రూ.30 వేలవరకు కూలి పొందుతున్నారని వివరించారు. సిరిసిల్లలో పెరిగిన నేతకార్మికుల ఉపాధిని స్ఫూర్తిగా తీసుకుని వరంగల్, కరీంనగర్ జిల్లాల్లోని మరమగ్గాల పరిశ్రమల కేంద్రాలు సైతం బతుకమ్మ చీరెల తయారీకి ముందుకు వస్తున్నాయని వివరించారు.

సిరిసిల్లలో 'వర్కర్ టు ఓనర్'

పవర్‌లూం కార్మికులను పారిశ్రామికవేత్తలుగా మార్చాలన్న ఎమ్మెల్యే కేటీఆర్ ఆలోచనమేరకు వర్కర్ టు ఓనర్ పథకాన్ని అమలులోకి తెస్తున్నామని శైలజారామయ్యార్ వెల్లడించారు. సిరిసిల్లలో పదివేలమందికి పైగా మరమగ్గాల కార్మికులున్నారని, వారందరికీ గ్రూప్‌షెడ్లు నిర్మించి, ప్రభుత్వమే మరమగ్గాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని, దీనితో కార్మికుడు సొంతంగా వస్త్రాల ఉత్పత్తి చేసుకుంటూ ఉపాధి పొందే అవకాశముందన్నారు. మహిళలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే కేటీఆర్ అపారెల్ పార్కు ఏర్పాటుకు నిధులు మంజూరుచేశారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల దుస్తుల తయారీ ఆర్డర్లు అపారెల్ పార్కుకు అందించి, పదివేలమంది మహిళలకు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో టాస్కాబ్ చైర్మన్ కే రవీందర్‌రావు, కలెక్టర్ కృష్ణభాస్కర్, టీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు చక్రపాణి, చేనేత, జౌళిశాఖ అదనపు సంచాలకుడు శ్రీనివాస్, సంయుక్త సంచాలకుడు వెంకటేశం, జిల్లా సహాయ సంచాలకుడు అశోక్, మ్యాక్ సంఘాల నేతలు మంచ శ్రీనివాస్, మండల సత్యం, దూడం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు భారీగా పదోన్నతులు

మొదటిపేజీ తరువాయి...

కల్పించడానికి అనుమతులు ఇస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ శాఖలో సీనియార్టీ లిస్ట్‌పై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నదని, కేసు క్లియర్‌కాగానే పదోన్నతులు వస్తాయని ఉద్యోగులు చెప్పారు. ఒక్క సచివాలయంలోనే 2019 మార్చినుంచి ఇప్పటి వరకు 173 మందికి పదోన్నతులు కల్పించారు. రాష్ట్రంలోని విద్యాశాఖలో పనిచేస్తున్న ఏడుగురు అధికారులకు డీఈవోలుగా ప్రమోషన్ లభించింది. వీటి ఉత్తర్వులు త్వరలో వెలువడనున్నాయి.

సచివాలయంలో 158 మందికి

సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడానికి డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) ఆమోదం తెలిపింది. శుక్రవారం అధర్ సిన్హా నేతృత్వంలో సమావేశమైన డీపీసీ.. 105 మంది సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నట్లు తెలిసింది. 105 మంది అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లకు సెక్షన్ అధికారులుగా, 44 మంది సెక్షన్ ఆఫీసర్లకు అసిస్టెంట్ సెక్రటరీలుగా, తొమ్మిది మంది అసిస్టెంట్ సెక్రటరీలకు డిప్యూటీ సెక్రటరీలుగా పదోన్నతులు వచ్చాయి.

పోలీస్‌శాఖలో భారీస్థాయిలో..

రాష్ట్ర పోలీస్ విభాగంలో భారీస్థాయిలో పదోన్నతులను కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. డీఎస్పీలుగా పనిచేస్తున్న 49 మందికి అదనపు ఎస్పీలుగా ప్రమోషన్లు వచ్చాయి. పెద్దసంఖ్యలో పదోన్నతుల కల్పనపై పోలీసు అధికారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తున్న 53 మందికి డీఎస్పీలుగా పదోన్నతి కల్పించారు. ఈ రెండు విభాగాలలో 102 మంది అధికారులు పదోన్నతులు పొందారు.

రవాణాశాఖలో 14మందికి

సీనియర్ ఎంవీఐలతోపాటు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాంతీయ రవాణాశాఖ అధికారులుగా పదోన్నతి కల్పిస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చింది. 14 మందికి కొత్తగా ఆర్టీవోలుగా ప్రమోషన్లు ఇవ్వడంతోపాటు పోస్టింగులు ఇస్తూ జీవో జారీచేసింది. గ్రేటర్ రవాణాశాఖ పరిధిలో దాదాపు అన్ని కార్యాలయాలు ఇంచార్జి ఆర్టీవోలతో నడుస్తుండగా పదోన్నతులతో ఖాళీలు భర్తీ అయ్యాయి. పదోన్నతులతో ఖాళీ ఏర్పడిన ప్రాంతాల్లో కొత్తవారిని నియమించనున్నారు. ఖాళీ అయిన స్థానాలను ఓడీలతో భర్తీ చేయనున్నట్లు తెలిసింది.

ఏపీఏవో పదోన్నతుల నిష్పత్తి జీవోపై హర్షం

వర్క్స్, అకౌంట్స్ డిపార్టుమెంటులో 30 ఏండ్లుగా ఉన్న సమస్యను పరిష్కరించినందుకు ఆ శాఖ ఉద్యోగుల సంఘంప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆ శాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీ శంకర్ నేతృత్వంలో ఉద్యోగులు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఇందుకు సహకరించిన టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ఇతర నాయకులకు కూడా ధన్యవాదాలు తెలిపారు. వర్క్స్, అకౌంట్స్ డిపార్టుమెంటులో పీఏవో పదోన్నతులకు కిందిస్థాయి అధికారుల మధ్య నిష్పత్తిని నిర్ధారిస్తూ ఆర్థిక శాఖ జీవో 64 జారీచేసింది. తాజా ఉత్తర్వుతో ఏపీఏవోలుగా పదోన్నతులు పొందటం సాధ్యమవుతుందని సంఘం అధ్యక్షుడు బీ శంకర్ తెలిపారు. ఇందులో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చొరవ మరచిపోలేనిదన్నారు. మంత్రిని కలిసినవారిలో వర్క్స్, అకౌంట్స్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, టీజీవో రాష్ట్ర అధ్యక్షురాలు మమత, ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ తదితరులున్నారు. ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావుకు కూడా వారు కృతజ్ఞతలు తెలిపారు.

హైదరాబాద్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, వర్క్స్ అకౌంట్స్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు శంకర్ తదితరులు

సీఎం కేసీఆర్‌కు సచివాలయ ఉద్యోగుల సంఘం కృతజ్ఞతలు

భారీఎత్తున పదోన్నతులు కల్పించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు నరేందర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఒక్క రోజునే సచివాలయంలో 158 మందికి పదోన్నతులు వచ్చాయని తెలిపారు. ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు 173 మందికి ప్రమోషన్లు లభించాయని చెప్పారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఏనాడూ సచివాలయ ఉద్యోగులకు ఈ స్థాయిలో పదోన్నతులు ఇవ్వలేదన్నారు. కొత్తగా 58 పోస్టులిచ్చి భారీఎత్తున పదోన్నతులు కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని చెప్పారు.

డిగ్రీ కాలేజీల షిఫ్టింగ్‌లపై దృష్టి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కొన్ని ప్రైవేటు డిగ్రీ కాలేజీలను అనుమతి లేకుండా ఒక మండలం నుంచి మరో మండలానికి షిఫ్టింగ్ చేస్తున్నారని, ఇలాంటి వాటిపై దృష్టిపెట్టి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి హెచ్చరించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాలేజీల షిఫ్టింగ్‌ల కోసం విధి విధానాల రూపకల్పనకు త్వరలో ఓ కమిటీ ఏర్పాటుచేస్తామని తెలిపారు.

పారిశ్రామిక రంగంపై శిక్షణ

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు పరిశ్రమలను నెలకొల్పేలా ఈ ఏడాది లోఐదువేల మందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి శుక్రవారం ఉన్నతవిద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్‌తో ట్రైహైదరాబాద్ సంస్థ ప్రతినిధులు అవగాహన ఒప్పందం చేసుకున్నారు.

కృష్ణా, గోదావరికి స్వల్ప వరద

- 15 టీఎంసీలకు శ్రీరాజరాజేశ్వర
- ప్రాజెక్టు చరిత్రలో తొలిసారి గేట్లెత్తి నీటి విడుదల

హైదరాబాద్/ కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:

కృష్ణా, గోదావరి ప్రాజెక్టులకు వరద స్వల్పంగా కొనసాగుతున్నది. శుక్రవారం కూడా ఆల్మట్టికి 13వేల క్యూసెక్కుల వరద వస్తుండగా.. నారాయణపుర జలాశయానికి అంతే మొత్తాన్ని విడుదలచేస్తున్నారు. జూరాలకు నాలుగు వేల క్యూసెక్కుల వరద వస్తున్నది. కృష్ణా బేసిన్‌లో ఎగువ నుంచి దిగువ వరకు అన్ని ప్రాజెక్టుల పరిధిలో పుష్కలంగా సాగునీటి విడుదల కొనసాగుతున్నది. మరోవైపు గోదావరిపై శ్రీరాంసాగర్‌కు చాలా స్వల్పంగానే వరద వస్తుండటంతో ఇప్పటికీ జలాశయ నీటినిల్వ 18.16 టీఎంసీలుగానే ఉన్నది. కాగా కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా ఎల్లంపల్లి నుంచి భారీ మోటర్లతో గోదావరిజలాల్ని శ్రీరాజరాజేశ్వర జలాశయానికి తరలిస్తున్నారు. జలాశయంలో నీటినిల్వ 15 టీఎంసీలకు చేరుకోవడంతో శుక్రవారం రాత్రి 10.30 గంటలకు ప్రాజెక్టు చరిత్రలో తొలిసారిగా గేట్లను ఎత్తారు. మొత్తం 26 గేట్లు ఉండగా, 11, 12, 13, 14, 15, 16 గేట్లను ఎత్తి లోయర్‌మానేరుకు నీటి విడుదల ప్రారంభించారు. దిగువకు 1,850 క్యూసెక్కులు వెళ్తున్నట్టు అధికారులు తెలిపారు. రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్‌హౌస్‌లో రెండు మూడు రోజుల్లో రెండు, ఆరు నంబర్ల మోటర్ల వెట్ ట్రయల్‌రన్ నిర్వహిస్తామని, పదిహేను రోజుల్లో మొత్తం ఏడు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తామని ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు చెప్పారు.

జలాభిషేకం

వివిధ ప్రాజెక్టుల్లో శుక్రవారంనాటి నీటిమట్టాల వివరాలు

రిజర్వాయర్	ఎఫ్ఆర్ఎల్ అడుగుల్లో	ప్రస్తుత మట్టం అడుగుల్లో	పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో	ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో	ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో	అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో
ఆల్మట్టి	1705.00	1704.72	129.72	128.19	13,000	13,000
నారాయణపుర	1615.00	1614.99	37.64	37.64	13,579	14,370
ఉజ్జయిని	1630.00	1630.00	117.24	117.24	1,482	4,350
జూరాల	1045.00	1043.41	9.66	8.67	4,000	6,059
తుంగభద్ర	1633.00	1633.00	100.86	100.85	11,512	11,032
శ్రీశైలం	885.00	879.50	215.81	185.56	0	24,426
నాగార్జునసాగర్	590.00	588.30	312.05	306.99	0	19,045
పులిచింతల	175.00	172.47	45.77	41.93	0	14,876
సింగూరు	1717.93	1670.47	29.91	0.45	20	20
నిజాంసాగర్	1405.00	1368.54	17.18	0.15	0	10
శ్రీరాంసాగర్	1091.00	1063.60	90.31	18.16	1,006	400
లోయర్‌మానేరు	920.00	881.75	24.07	3.49	0	204
శ్రీరాజరాజేశ్వర	1043.31	1023.86	25.873	15.00	12,037	1850
కడెం	700.00	697.18	7.60	6.89	447	789
ఎల్లంపల్లి	485.56	471.49	20.18	10.18	0	0

కడుపు కోత తగ్గింది

- 80 నుంచి 40 శాతానికి తగ్గిన సిజేరియన్లు
- సర్కారు దవాఖానల్లో 62 శాతానికి పెరిగిన ప్రసవాలు
- సత్ఫలితాన్నిస్తున్న కేసీఆర్ కిట్ల పథకం
- ఏడాదిన్నరలో 4,52,800 మందికి లబ్ధి
- జాతీయ నాణ్యతాప్రమాణాల తనిఖీ బృందం ప్రశంసలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2017 జూన్ నాటికి ప్రభుత్వ దవాఖానల్లో 35 శాతం ఉన్న ప్రసవాలసంఖ్య 62 శాతానికి పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా సిజేరియన్ల సంఖ్య 80 శాతం నుంచి 40 శాతానికి పడిపోయింది. రాష్ట్రప్రభుత్వం అమలుచేస్తున్న కేసీఆర్ కిట్ల పథకంతో తల్లీ, బిడ్డ దవాఖాన నుంచి క్షేమంగా ఇంటికి చేరుకుంటున్నారు. దిగ్విజయంగా అమలవుతున్న కేసీఆర్ కిట్ల పథకానికి జాతీయస్థాయిలో ప్రశంసలు అందుతుండగా.. పలు రాష్ట్రాలు అమలుచేసేందుకు సిద్ధమవుతున్నాయి. తాజాగా, ఈ పథకాన్ని జాతీయ నాణ్యతా ప్రమాణాల తనిఖీ బృందం ప్రశంసించింది. 2017 జూన్ 3న కేసీఆర్ కిట్ల పథకం ప్రారంభమైన నాటినుంచి 2019 జనవరి చివరి నాటికి 4,52,800 మంది బాలింతలకు లబ్ధిచేకూరింది. ఈ పథకం కోసం ప్రభుత్వం ఇప్పటివరకు రూ.500 కోట్లకు పైగా వెచ్చించింది. దేశంలో మరెక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్.. బాలింతల కోసం 16 వస్తువులతో కూడిన కిట్ల పథకం అమలుచేస్తున్నారు.

తొలికాన్పు సహజ ప్రసవాలపై దృష్టి

తొలి కాన్పులో సిజేరియన్ల సంఖ్యను తగ్గించేందుకు రాష్ట్రంలోని 12 సర్కారు దవాఖానల్లో ప్రయోగాత్మకంగా చేపట్టిన ప్రత్యేక చర్యలతో మంచి ఫలితాలు సాధించారు. ఇతర దవాఖానల్లోనూ ఐదు నెలలుగా దీనిని అమలుచేస్తుండటంతో సిజేరియన్లు గణనీయంగా తగ్గాయి. ఏప్రిల్ నుంచి జూన్ వరకు సగటున 80 శాతం నుంచి 40 శాతానికి తగ్గినట్లు వైద్యశాఖ అంచనాలు రూపొందించింది. నీతిఆయోగ్ విడుదల చేసిన తాజానివేదికలో.. ప్రసూతిసేవలు అందించడంలో తెలంగాణ రాష్ట్రానికి దేశంలోనే మొదటి స్థానం దక్కింది. నీతిఆయోగ్, ప్రపంచబ్యాంకు, కేంద్ర ఆరోగ్య కుటుంబ మంత్రిత్వశాఖ సంయుక్తంగా హెల్త్ స్టేట్స్ ప్రోగ్రెసివ్ ఇండియా పేరిట ఈ నివేదికను రూపొందించాయి.

2019 జనవరి నుంచి జూలై వరకు ప్రభుత్వ దవాఖానల్లో శిశు జననాల సంఖ్యావివరాలు

దవాఖానలు	శిశుజననాలు
ఏరియాదవాఖాన	36,613
సీహెచ్‌సీ	26026
జిల్లా దవాఖాన	37919
పీహెచ్‌సీ	21228
స్పెషాలిటీ దవాఖాన	19,344

ఆరోగ్య సమాజమే కేసీఆర్ లక్ష్యం.

భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన నవజాత శిశువులను అందించి తెలంగాణలో ఆరోగ్యసమాజాన్ని సాధించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ వైద్య పథకాలను అమలుచేస్తున్నారు. సీఎం కేసీఆర్ లక్ష్యం. రాష్ట్రంలో మాతాశిశు మరణాలను నియంత్రించడంలో భాగంగా తెలంగాణ సర్కారు కేసీఆర్ కిట్లు- అమ్మ ఒడి కార్యక్రమాన్ని అమలుచేస్తున్నది. ఒకవైపు గర్భిణుల ఆరోగ్యానికి ప్రాధాన్యం కల్పిస్తూనే భవిష్యత్‌తరాలు ఆరోగ్యంగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రధానంగా పిల్లల ఆరోగ్యంపై దృష్టిసారించింది. మాతాశిశు సంరక్షణకోసం అధునాతన సౌకర్యాలతో, కార్పొరేట్ తరహాలో సర్కారు దవాఖానల్లో వైద్యాన్ని అందిస్తున్నారు. అన్ని జిల్లా ఆసుపత్రుల్లో నవజాత శిశువుల సంరక్షణకోసం ప్రత్యేక యూనిట్లను ఏర్పాటుచేస్తూ పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేవిధంగా చర్యలు చేపట్టారు.

తగ్గుతున్న మాతా, శిశుమరణాలు

రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంలో తీసుకువస్తున్న మార్పుల కారణంగా తెలంగాణలో మాతా, శిశు మరణాల రేటు తగ్గుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో పేదలు పడుతున్న అవస్థలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాలు జరిగేవిధంగా ప్రత్యేక కార్యక్రమాలను అమలుచేస్తున్నది. రాష్ట్రంలో ప్రసవ మరణాల శాతం, నవజాత శిశుమరణాల సంఖ్య తగ్గుతున్నదని మెటర్నిటీ మోర్టాలిటీ ఇండియా శాంపిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ ద్వారా విడుదలచేసిన ప్రత్యేక బులెటిన్ తాజా నివేదికలో పేర్కొన్నది.

P.V. NARSIMHA RAO TELANGANA VETERINARY UNIVERSITY
Administrative Office, Rajendranagar, Hyderabad – 500 030

B.Tech (Dairy Technology) Admissions Counselling

No.2/PVNRTVU/B.Tech.(DT)/2019-20 Dt. 30.08.2019

Counselling for admission into B.Tech (Dairy Technology) course for the academic year 2019-20 (6 seats under farmers' quota and 1 seat under non-farmers' quota) will be held on 06.09.2019. For further details visit university website : http://tsvu.nic.in

REGISTRAR

TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION
Prathibha Bhavan, M.J.Road, Nampally, Hyderabad

HALF YEARLY EXAMINATIONS:: SEPTEMBER-2019 TERM NOTIFICATION NO.05/2019

Applications are invited from Officers of the All India Services and State Services working in Telangana State for Half Yearly Examinations, Language Tests, and other Tests scheduled to be held from **24/09/2019** to **27-09/2019**. The application and other details can be downloaded from the Commission's website: **www.tspsc.gov.in** and the filled in applications should reach the Commission's office on or before **11/09/2019.**

Place: **Hyderabad** Sd/-
Date: **29/08/2019** **SECRETARY**

DIPR R.O. No. 337-PP/CL/Advt/1/2019-20, Dt: 30-08-19

TELANGANA STATE PUBLIC SERVICE COMMISSION
Prathibha Bhavan, M.J.Road, Nampally, Hyderabad

JUNIOR ASSISTANT, TYPIST, JUNIOR STENO AND JUNIOR ASSISTANT CUM TYPIST IN GROUP-IV SERVICES NOTIFICATION NO.10/2018, DT:07/10/2018 PRESS ADVERTISEMENT

The Commission published the list of provisionally admitted candidates' Hall Ticket Numbers for Verification of Certificates who qualified in the written test in 1:5 ratio to the post of Junior Assistant, Typist, Junior Steno and Junior Assistant Cum Typist in Group-IV services. The schedule and other criteria will be informed later. For further details visit Commission's website (www.tspsc.gov.in)

Hyderabad Sd/-
Dt: 29/08/2019 SECRETARY

DIPR R.O. No. 341-PP/CL/Advt/1/2019-20, Dt: 30-08-19

కన్నడ ప్రజల మనోభావాలను కేంద్ర ప్రభుత్వం కించపరుస్తున్నది. కన్నడ భాషాసంస్కృతులకు ప్రతిబింబంగా రాష్ట్రానికి ప్రత్యేక జెండా ఉండాలని మేం కోరాం. అయినా కేంద్రం పట్టించుకోకుండా కన్నడీయులను అవమానపరుస్తున్నది.

సిద్ధరామయ్య, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి

కర్ణాటకకు ప్రత్యేక సాంస్కృతిక జెండా ఉండాలనటానికి బీజేపీ వ్యతిరేకం కాదు. ఒకే దేశం, ఒకే జెండా అనేది రాజ్యాంగపరమైనది. మూడు రంగులజెండా రాజ్యాంగానికి సంబంధించినది. సాంస్కృతిక ప్రత్యేకతలకు ప్రతీకగా ప్రత్యేక జెండా ఉండాలని కోరుకోవటం తప్పేమీ కాదు.

సీటీ రవి, కర్ణాటక మంత్రి

చరిత్రలో నేడు

1751

రాబర్ట్ క్లైవ్ నేతృత్వంలో కేరళ లోని ఆర్కాట్‌ను ఆక్రమించిన బ్రిటిష్ సేనలు.

1917

చైనాలో సన్‌యెట్‌సేన్ నాయకత్వంలో మిలిటరీ ప్రభుత్వం ఏర్పాటు.

1945

ఆస్ట్రేలియాలో రాబర్ట్ మెంజిస్ నేతృత్వంలో లిబరల్ పార్టీ స్థాపన.

జమ్ముకశ్మీర్‌లో ఆర్టికల్ 370ని రద్దుచేయటంపై దాఖలైన వివిధ పిటిషన్లపై సుప్రీంకోర్టు సత్వర విచారణ చేపట్టాల్సిన అవసరమున్నది. అందుకుగాను ఐదుగురు సభ్యులతో కూడిన రాజ్యాంగ బెంచ్ ఏర్పాటుచేసి, మెజారిటీ ప్రజాభిమతమనే దానికి అతీతంగా రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలి. ముఖ్యంగా కశ్మీర్‌లో కొనసాగుతున్న బిగ్బంధాలు, నిర్బంధాల నేపథ్యంలో మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగకుండా చూడాలి. రాజకీయ అభిప్రాయాలు, నిర్ణయాలకు అతీతంగా రాజ్యాంగం, హక్కుల వెలుగులో పిటిషన్లను విచారించాలి.

ది హిందూ

తమిళనాడు వెల్లూరులో ఓ దళితుడి శవం విషయంలో అక్కడి అగ్రవర్ణాలు వ్యవహరించిన తీరు, వీడియో దృశ్యాలు దేశవ్యాప్తంగా దుమారం రేపాయి. ఆ గ్రామంలో దళితులకు శ్మశానవాటిక కోసం ప్రత్యేకంగా ప్రభుత్వమే భూమి కేటాయించటాన్ని స్థానిక కోర్టు తప్పబట్టింది. మిగతా సామాజిక వర్గాలకు విడిగా దళితులకు ప్రత్యేక శ్మశానవాటిక ఏర్పాటు కులాంతరాలను పోషించేదిగా ఉన్నదని ఆగ్రహించింది. గతంలో కూడా ఇలాంటి తీర్పులే కోర్టులు వెలువరించాయి. అయినా సామాజిక సాంప్రదాయాలు చట్టాల కన్నా బలమైనవిగా సామాజిక జీవనాన్ని శాసిస్తున్న తీరుకు ఇది నిదర్శనం.

ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్

అస్సాం పౌరపట్టిక

అస్సాం జాతీయ పౌర పట్టిక తుది ముసాయిదా శనివారం ఉదయం వెలువడనుండటంతో శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా భారీ ఎత్తున కేంద్ర బలగాలను తరలించారు. ఏడాది కిందటి తొలి జాబితాలో దాదాపుగా నలభై లక్షల మందికి చోటు లభించలేదు. అందువల్ల తాజా పౌర పట్టిక పట్ల చాలామందిలో ఆందోళన మొదలైంది. 1951 జనాభా గణన తరువాత మొదటి సారిగా పౌర రిజిస్టర్‌ను తయారుచేశారు. ఇప్పుడు దీనిని సవరిస్తున్నారు. 1951 జాతీయ పౌర పట్టికలో ఉన్నవారికి, వారి వారసులకు ఇబ్బంది ఉండదు. ఇతరులు 1951 నుంచి 1971 మార్చి 24 వరకు అస్సాంలో లేదా దేశంలోని మరేదైనా ప్రాంతంలో నివాసమున్నట్టు ఆధారాలు చూపితే తాజా పౌర పట్టికలో స్థానం పొందుతారు. ఈ జాబితాలో పేరు లేనంత మాత్రాన వెంటనే విదేశీయులుగా గుర్తించడం జరుగదని కేంద్రం స్పష్టం చేసింది. నిర్దిష్ట తేదీలోగా భారత పౌరులై ఉంటే వారు ట్రిబ్యునల్స్‌ను ఆశ్రయించవచ్చు. ప్రభుత్వం ఇందుకోసం వెయ్యి ట్రిబ్యునల్స్‌ను ఏర్పాటు చేస్తున్నది. ట్రిబ్యునల్‌లో న్యాయం లభించలేదని భావిస్తే హైకోర్టుకు ఆ తరువాత సుప్రీంకోర్టుకు వెళ్ళవచ్చు. ఈ ప్రక్రియ పూర్తయ్యేవరకు ఎవరిని నిర్బంధ శిబిరాలకు తరలించబోమని కూడా కేంద్రం వెల్లడించింది. దేశ పౌరులకు జాబితాలో పేరు లేకపోవడం, అక్రమ చొరబాటుదారుల పేర్లు ఉండటం జరుగకూడదని అస్సాం జాతీయవాదులు అంటున్నారు. నిజంగా పౌరులై ఉండి జాబితాలో పేరు లేకపోతే వారికి న్యాయ సహాయం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం, రాజకీయపక్షాలు న్యాయ సహాయ బృందాలను ఏర్పాటుచేస్తున్నాయి. పౌర పట్టిక తయారు చేయడమనగానే అదొక పరిష్కారంగా భావించకూడదు. పరిష్కార సాధనకు ఈ పట్టిక ఒక ప్రాతిపదిక అవుతుంది.

దశాబ్దాల పాటు పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్లనే అస్సాంలో విదేశీయుల సమస్య ఇంత జటిలంగా మారింది. తమ ప్రాంతంలో తామే అల్పసంఖ్యాకులుగా మారే పరిస్థితిని ఏ జాతీ సహించలేదు. వలస వచ్చినవారు మెజారిటీగా మారకపోవచ్చు. కానీ చెప్పుకోదగినంత మేర భూములను, వ్యాపారాలను తమ చేతిలో పెట్టుకొని స్థానికులను శాసించడం కూడా వైషమ్యాలకు దారితీస్తుంది. అస్సాం ఉద్యమం తలెత్తినప్పుడు స్థానికుల మనోభావాలను అర్థం చేసుకొని వెంటనే పరిష్కరించవలసింది. కానీ మొదట దీనిని వేర్పాటు ఉద్యమంగా ప్రచారం చేశారు.

విదేశీయుల తాకిడి మూలంగా తమ అస్తిత్వానికి ముప్పు ఏర్పడుతుండటంతో అఖిల అస్సాం విద్యార్థి సంఘం (ఆసు) ఆధ్వర్యంలో 1979 నుంచి 85 వరకు ఉధృతంగా ఉద్యమం సాగింది. ఈ ఉద్యమంలో వందలాది మంది యువకులు ప్రాణాలు కోల్పోయారు. తప్పనిసరి పరిస్థితుల్లో 1985లో అస్సాం ఒప్పందం కుదుర్చుకున్నా, దానిని అమలుచేయడం పట్ల కేంద్ర పాలకులు ఆసక్తి చూపలేదు. ఆ ఒప్పందం పర్యవసానంగానే సుప్రీంకోర్టు చొరవ మూలంగా ఈ పట్టిక తయారీ జరుగుతున్నది. అయితే ఈ ప్రయత్నంలోనూ రాజకీయపక్షాలు తమ అజెండాలను అమలుచేయాలని ప్రయత్నించడం విచారకరం. ఇంతకాలం బెంగాలీలు, లేదా ముస్లింల ఓట్ల కోసం కాంగ్రెస్ పార్టీ ప్రయత్నించింది. ఇప్పుడు హిందువుల ఓట్ల కోసం బీజేపీ ప్రయత్నిస్తున్నదని అస్సామీయులు ఆరోపిస్తున్నారు. అస్సాంలో బీజేపీకి 14 లోక్‌సభ సీట్లు లభించడంలో బెంగాలీ హిందువుల ఓట్లు కీలకమైనవి. బీజేపీ జాతీయస్థాయిలో కూడా పౌర పట్టిక తయారుచేయాలనే విస్తృత అజెండాలో భాగంగా ఈ అస్సాం ప్రక్రియను చూస్తున్నదనీ, బెంగాల్‌లో కూడా మత విభజన తీసుకురావడానికి అస్సాం ప్రయోగం ఉపయోగపడుతుందని ఆరోపణలున్నాయి. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వచ్చిన ముస్లిమేతరులకు పౌరసత్వం లభించే బిల్లు ఆమోదం పొందితే అస్సాంలోని బెంగాలీ హిందువులకు ఇబ్బంది ఉండదు. కానీ అస్సామీయులు మాత్రం బెంగాలీల వలసను ఆక్షేపిస్తున్నారు. వారు హిందువులా, ముస్లింలా అనే మతకోణంతో వారికి నిమిత్తం లేదు. ఇది జాతి అస్తిత్వ వేదన తప్ప మతవిద్వేషం కాదు. కానీ బీజేపీ విదేశీయుల్లో హిందువులను వదిలి ముస్లింలనే లక్ష్యంగా చేసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్టు విమర్శలు వస్తున్నాయి.

ఉద్యమం తలెత్తినప్పుడు స్థానికుల మనోభావాలను అర్థం చేసుకొని వెంటనే పరిష్కరించవలసింది. కానీ మొదట దీనిని వేర్పాటు ఉద్యమంగా ప్రచారం చేశారు.

విదేశాంగ మంత్రి జయశంకర్ ఇటీవల బంగ్లాదేశ్ వెళ్ళినప్పుడు బంగ్లాదేశీయులను వెనక్కు పంపిస్తారా అనే ప్రశ్న ఎదురైంది. దీనికి ఆయన అది మా ఆంతరంగిక సమస్య అని చెప్పారు. అంటే బంగ్లాదేశ్ ఆందోళన చెందవలసిందేమీ లేదనే అంతరార్థం ఉన్నది. లక్షలాది మందిని వెనుకకు పంపడం అంత సులభం కాదు. అందుకే బీజేపీ సమస్యను పరిష్కరించదని, దీనిని సాగదీసి లబ్ధి పొందుతుందని అస్సాంవాదులు విమర్శిస్తున్నారు. దశాబ్దాల పాటు పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్లనే అస్సాంలో విదేశీయుల సమస్య ఇంత జటిలంగా మారింది. తమ ప్రాంతంలో తామే అల్పసంఖ్యాకులుగా మారే పరిస్థితిని ఏ జాతీ సహించలేదు. వలస వచ్చినవారు మెజారిటీగా మారకపోవచ్చు. కానీ చెప్పుకోదగినంత మేర భూములను, వ్యాపారాలను తమ చేతిలో పెట్టుకొని స్థానికులను శాసించడం కూడా వైషమ్యాలకు దారితీస్తుంది. అస్సాం ఉద్యమం తలెత్తినప్పుడు స్థానికుల మనోభావాలను అర్థం చేసుకొని వెంటనే పరిష్కరించవలసింది. కానీ మొదట దీనిని వేర్పాటు ఉద్యమంగా ప్రచారం చేశారు. ఆ తరువాత నయానాభయాన అణిచివేయడానికి ప్రయత్నించారు. కేంద్ర నాయకులు బలమైన బెంగాలీ లాబీకి వ్యతిరేకంగా వ్యవహరించలేకపోయారు. ఇప్పుడు చాలా ఆలస్యంగా పౌర పట్టిక ఆధారంగా విదేశీయులను గుర్తించే ప్రయత్నం జరుగుతున్నది. విదేశీయులను గుర్తించడం అనగానే వారిని దేశం నుంచి వెళ్ళగొట్టాలని కాదు. ఈ సమస్యకు ఆచరణ సాధ్యమైన పరిష్కారం అన్వేషించాలి. అస్సామీయులకు మాత్రం వారి అస్తిత్వానికి ముప్పు వాటిల్లుతుందనే ఆందోళనకు తావులేకుండా భరోసా ఇవ్వాలి.

జనగళం

కౌన్సెలింగ్ ఇవ్వాలె

వినాయక నవరాత్రులను ఆనందంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలే తప్పా భక్తి పేర పెడ ధోరణులకు పాల్పడటం సమంజసం కాదు. విద్యార్థులు ప్రతిరోజు తెల్లవారుజామున చదువుకుంటారు. మంటపాల్లో ఎక్కువ సౌండ్‌తో పెట్టే భక్తి పాటల వల్ల విద్యార్థుల చదువుకు ఆటంకం ఏర్పడుతుంది. నిమజ్జనోత్సవాలు ఒక్కోచోట ఒక్కోరోజు జరుగుతూ ఉంటాయి. ఈ ఉత్సవాల్లో యువత పెద్ద ఎత్తున పోగై మద్యం సేవించటం, గొడవలు పెట్టుకోవడం లాంటి ఘటనలు ఏటా జరుగుతుండటం చూస్తూనే ఉన్నాం. కొందరు గాయాల పాలవుతున్నారు. కాబట్టి పోలీసు అధికారులు మంటప నిర్వాహకులను బాధ్యులను చేస్తూ ముందస్తుగా కౌన్సెలింగ్ ఇవ్వాలె.

- కొలిపాక శ్రీనివాస్ గౌడ్, సముద్రాల

సూచికల బోర్డులు ఏర్పాటుచేయాలె

ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవటంతో రాష్ట్రవ్యాప్తంగా వానలు జోరుగా కురుస్తున్నాయి. అయితే నగరాల్లో మాత్రం నీరు ఎక్కడికక్కడ పేర్కొంటుండటంతో ఎక్కడ మ్యాన్‌హోల్స్ ఉన్నాయో, ఎక్కడ లేవో వాహనదారులు గుర్తుపట్టలేకపోతున్నారు. జీహెచ్ఎంసీతో పాటు కార్పొరేషన్, మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకొని మ్యాన్‌హోల్స్ ఉన్నచోటల్లా సూచికల బోర్డులు ఏర్పాటుచేయాలె.

- పెరుకు శ్రావణ్, గోదావరిఖని, పెద్దపల్లి జిల్లా

డాక్టర్ కూరెళ్ల అభినందన సభ

దాశరథి పురస్కార గ్రహీత కూరెళ్ల విఠలాచార్య అభినందన సభ 2019 సెప్టెంబర్ 1న ఉదయం 10.30 గంటలకు నల్లగొండలోని చినవెంకట్‌రెడ్డి మినీ ఫంక్షన్ హాలులో జరుగుతుంది. వేణు సంకోజు అధ్యక్షతన జరుగు సభలో ముఖ్య అతిథులుగా సుద్దాల అశోక్ తేజ, కంచర్ల భూపాల్‌రెడ్డి (ఎమ్మెల్యే) హాజరవుతారు. ఆత్మీయ అతిథులుగా డాక్టర్ ఎస్. రఘు, డాక్టర్ బెల్లి యాదయ్య, డాక్టర్ కృష్ణ కౌండిన్య, డాక్టర్ పోరెడ్డి రంగయ్య తదితరులు హాజరవుతారు. అందరికీ ఆహ్వానం.

- పెండోట సోము, దాసోజు జ్ఞానేశ్వర్, తేజస్వినీ సాహిత్య సాంస్కృతిక వేదిక

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7.8.9. కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ముక్తసరి

దేవులపల్లి ప్రభాకరరావు

రాజకీయ రాముడు

ఆసియా ఖండం దేశాల మధ్య చిచ్చుపెట్టి తమాషా చూడటం, వీలైనంతవరకు లాభపడటం మొదటినుంచి అమెరికా తదితర పాశ్చాత్య దేశాల కుటిల నీతి. ఇదే కుటిలనీతి ఇంకా కొనసాగుతున్నది. నాడు బ్రిటిష్ పాలకులు ఇండియాను ముక్కలుచేయడానికి మొహమ్మద్ అలీ జిన్నా మతోన్మాదానికి మద్దతు ఇచ్చారు. ఈ రోజు కశ్మీరును భారత్ అంతర్గత సమస్యగా పరిగణిస్తున్న అమెరికా, పాశ్చాత్య దేశాలు హాంకాంగ్‌ను చైనా అంతర్గత సమస్యగా ఎందుకు పరిగణించడం లేదు?

త్రేతాయుగ శ్రీరామావతారానికి కాలదోషం లేనట్లున్నది- మహారావణ మర్దనం, సంహారంతో, అరణ్యవాసంతో, సీతమ్మవారి కష్టాలతో శ్రీరామావతారం విధి నిర్వహణ అధ్యాయం ముగియనట్లుంది. రాముడు పేరిట ఎన్ని సిత్రాలు, ఎన్ని చిత్రాలు, ఎన్ని విచిత్రాలు! విశేషించి తెలుగు చలనచిత్ర రంగంలో రాముడికి ఎన్నో వేషాలు, అనేక రూపాలు-అగ్గిరాముడు, అడవి రాముడు, అందాల రాముడు, బండ రాముడు, దొంగ రాముడు-ఇంకెందరు రాములు వస్తారో తెలియదు. వేచి చూడవలసిందే, వేయి కన్నులతో. త్వరలో, అతిత్వరలో రాబోతున్నది 'అయోధ్య రాముడు' చిత్రం. స్క్రిప్టు రెడీ, ప్రొడక్షన్ ఏర్పాట్లన్నీ పూర్తయినాయి, తారాగణం రంగులద్దుకొని రెడీగా నిల్చున్నది. అయోధ్య చక్రవర్తి గనుక కొన్ని అక్షౌహిణుల సైన్యం ముందు మోహరించిన పిదప, ఎటువంటి విఘ్నాలు కలుగకుండా ముందు అన్ని ఇండ్లకు, అన్ని నోళ్లకు తాళాలు వేయగానే 'అయోధ్య రాముడు' చిత్ర నిర్మాణం ప్రారంభమవుతుంది-తీర్పులు, ఆర్పులు, అరుపులు ఏవీ అడ్డంకి కాబోవు. తీర్పుల దారి చెత్తబుట్టలోకి; శరవేగంతో చిత్ర నిర్మాణం పూర్తవుతుంది. ఆదికవి వాల్మీకి సాక్షాత్కరింపజేసిన రాముడు కేవలం మానవమాత్రుడైన అమాయక రాముడని పెద్దలు అంటారు. రాముడు నిజంగానే రాజకీయాల రంగు, రుచి, కపట నాటకాలు, కుళ్లు, కుట్రలు ఏవీ తెలియని వాడు-అధికార వ్యామోహం అసలే లేని వాడు. తండ్రి చెప్పకముందే, తండ్రికి చిక్కులు లేకుండా వెంటనే అరణ్యవాసానికి బయల్దేరాడు. వెంట తెచ్చుకున్న పాదుకలను సైతం 'తమ్మీ' అని పిలిచి ప్రేమతో భరతుడికి ఇచ్చేశాడు. అటువంటి రామయ్య తండ్రి ఈ రోజు చిల్లర రాజకీయాల పాచిక కావడం శోచనీయం. సంభ్రమాశ్చర్యాలకు, దిగ్భ్రాంతికి అందరలవాటు పడుతున్నారు. ఒక దిగ్భ్రాంతి నుంచి కోలుకోకముందే మరో దిగ్భ్రాంతి. ఇటీవలి ఎన్నికల ఫలితాలు రాగానే ప్రధాని మోదీజీ ప్రామిస్ చేసిన 'నవభారత నిర్మాణం'లో (అన్ని ప్రామిస్‌లు ఒకేతీరుగా ఉండవు. 2014 ఎన్నికలప్పుడు ప్రామిస్ చేసిన రూ.15 లక్షలు ఇప్పటికీ జేబులో పడలేదని ఎవరూ దిగులుపడొద్దు. దానిదారి దానిది, దీనిదారి దీనిది, దేనిదారి దానిది) భాగంగా 'ఒకే దేశం, ఒకే నేషన్-కలనేషన్ కాదు-ఒకే ప్రజ' నినాదానికి అనుగుణంగా, అంబేద్కర్ చొరవతో వచ్చిన రిజర్వేషన్ల అధ్యాయం త్వరలో ముగిస్తే ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. ఎవరైనా, ఆశ్చర్యపడినా, ఆవేశపూరితులై నోరువిప్పి నిరసన తెలిపినా శాంతిభద్రతలకు, జాతీయ ప్రయోజనాలకు విఘాతం కలిగించినవారవుతారు. ఈ మధ్య, చర్చల జోలికి ఎంతమాత్రం పోకుండా పార్లమెంట్ ఆమోద ముద్ర వేసిన నేషనల్ ఇన్‌వెస్టిగేషన్ ఏజెన్సీ చట్టం సవరణ గురించి తెలిసినవారెవరూ నోరు విప్పి నిరసన తెలుపడానికి సాహసించరు. నవభారత నిర్మాణంలో భాగంగానే తిరిగి విదేశీ పర్యటనలు కొనసాగిస్తున్న రెండవ టర్మ్ ప్రధాని మోదీజీ అందాల నగరం ప్యారిస్‌లో ఫ్రెంచి అధ్యక్షుడు మక్రాన్‌తో సంభాషిస్తూ భారత్ అంతర్గత సమస్య కశ్మీర్ గురించి ప్రస్తావించారు; ప్యారిస్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడుతూ (ఈ ఇద్దరు మహానాయకులు సరసల్లాపాలు జరుపుతున్న ఫొటో ఒకటి భారత మీడియాలో కన్పించింది.) కూడా, బ్రిటన్ ప్రధానితో, జర్మనీ అధ్యక్షురాలితో మాట్లాడుతూ కూడా కశ్మీర్ సమస్య గురించి మోదీజీ ప్రస్తావించారని వార్తలు వచ్చాయి. భారత్ అంతర్గత, ద్వైపాక్షిక సమస్య గురించి ఇతర దేశాల అధినేతలతో చర్చించవలసిన అవసరం ఉందా, ఉందనుకుంటే అది ద్వైపాక్షిక, అంతర్గత సమస్యగా మిగలదు కదా అన్నది సామాన్యుల సందేహం. ఇలా మాట్లాడేబదులు మోదీ-షాలు ఓ రోజు కశ్మీరు వెళ్లి 'బాబా, మీ మేలు కోసమే, మీ మంచి కోసమే, మీకు మంచిరోజులు రావడానికే ఇంతగా సాహసించి 70 ఏండ్ల నుంచి ఉన్న 370, 35 ఏ ఆర్టికల్స్‌ను రద్దుచేసాం. అన్యథా భావించకండి..' అని తమకు సహజ భూషణాలైన అనర్గళ, గంభీర ప్రసంగాలతో వివరించినట్లయితే కోట్లాది రూపాయల భారీ వ్యయంతో కశ్మీరులో పది లక్షల మంది సాయుధ బలగాలను మోహరించవలసిన అవసరం ఉండకపోయేది; కశ్మీరుకు గోల కొండ తాళాలు వేసి కోటిమంది ప్రజల గొంతు నొక్కవలసిన అవసరం ఏర్పడకపోయేది, మూడువారాల నుంచి కశ్మీరు ప్రజల దైనందిన సాధారణ జీవితం స్తంభించకపోయేది, 'భారత్ హిందూ పాలకులు' కశ్మీరు ప్రజల ప్రాథమిక, మానవ హక్కులకు విఘాతం కల్పించి మంటగలిపారని పాక్ పాలకులు ఎవరు కన్పిస్తే వారికి చెప్పి గగ్గోలు చేయగలిగేవారు కాదు. ఈ దేశంలోని 11 మంది ప్రతిపక్ష నాయకులు అడుగు పెట్టగానే కశ్మీరులో, శ్రీనగర్‌లో నిరసనాగ్నులు ఎగసిపడుతాయని మోదీజీ ప్రభుత్వం భయపడవలసిన పరిస్థితి ఉత్పన్నం కాకపోయేది.

'ప్యారిస్‌లో మోదీజీతో అన్నీ మాట్లాడాను, కశ్మీరు గురించి కూడా మాట్లాడాను..' ట్రంప్ అన్నాడు. అమెరికాలోని భారతీయులు ట్రంప్ హయాంలో ఎదుర్కొంటున్న కష్టాలు, సమస్యల గురించి మోదీజీ ఎన్నడైనా ట్రంప్‌తో మాట్లాడారా? కరచాలనాలు, కౌగిలింతలు ముఖ్యం కావు. అవి కడుపు నింపలేవు, అమెరికాలోని భారతీయుల సమస్యలను పరిష్కరించలేవు. 'అమెరికా అమెరికన్లదే', 'అమెరికా అమెరికన్ల కోసమే' వంటి దుష్ట నినాదాలతో ట్రంప్ యూఎస్ఏలో భారతీయులను కష్టాల కొలిమిలో దింపి ముందెన్నడూలేని ఆందోళనకు గురిచేస్తున్నాడు. హెచ్1 వీసాలు, గ్రీన్‌కార్డుల విషయంలో ట్రంప్ ధోరణి, ఆయన మాటలు అక్కడి భారతీయులకు అమిత ఆందోళన కలిగిస్తున్నాయి. టెర్రరిజం భయంకర సమస్యే. కానీ, అదొక్కటే సమస్య అనుకోవడం పొరపాటు. భారతీయులకు యూఎస్ఏలో పుట్టిన బిడ్డలు అక్కడ సహజపౌరులు కాకుండా చేస్తానని ఈ మధ్యనే ట్రంప్ కొత్త పేచీ పెట్టాడు. అమెరికాలోని భారతీయుల సమస్యలు, ఇక్కట్ల గురించి మోదీజీ ఎన్నడైనా ట్రంప్‌తో మాట్లాడారా? ఏదేమైనా ఇండియాకు 400 కోట్ల డాలర్ల విలువైన ఎగుమతుల ఒప్పందం చేసుకొని ట్రంప్ ఇంటికి వెళ్తున్నాడు. మోదీ, ఇమ్రాన్ ఇద్దరూ తనకు మంచి మిత్రులని ట్రంప్ అన్నాడు. ఆసియా ఖండం దేశాల మధ్య చిచ్చుపెట్టి తమాషా చూడటం, వీలైనంతవరకు లాభపడటం మొదటినుంచి అమెరికా తదితర పాశ్చాత్య దేశాల కుటిల నీతి. ఇదే కుటిలనీతి ఇంకా కొనసాగుతున్నది. నాడు బ్రిటిష్ పాలకులు ఇండియాను ముక్కలుచేయడానికి మొహమ్మద్ అలీ జిన్నా మతోన్మాదానికి మద్దతు ఇచ్చారు. ఈ రోజు కశ్మీరును భారత్ అంతర్గత సమస్యగా పరిగణిస్తున్న అమెరికా, పాశ్చాత్య దేశాలు హాంకాంగ్‌ను చైనా అంతర్గత సమస్యగా ఎందుకు పరిగణించడం లేదు? హిందుత్వ ప్రభుత్వాలు, పాలకులు, విధానాల పట్ల పాశ్చాత్య దేశాలకు, యూఎస్ఏకు సానుభూతి ఉంటుందనుకోవడం భ్రమ. ప్రపంచమంతటా ముస్లింల సంఖ్య హిందువుల సంఖ్య కంటే ఎక్కువే కాని తక్కువ కాదు. పాకిస్థాన్‌ను అందరు వెలివేశారని భారతీయ దేశభక్తులు సంబురపడుతున్నారు. భుక్తి కంటే దేశభక్తి ముఖ్యమన్నది ఇవాళ్టి మన నినాదం. మన దేశం ఈ రోజు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక తిరోగమనం, మాంద్యం నుంచి దేశ ప్రజల దృష్టిని మళ్లించడానికి 370 వంటి మత్తుమందు ఏదో ఒకటి ఉండాలె. నోట్ల రద్దుతో మంచిరోజులు వస్తాయని కొంతకాలం గడిపారు. 370 రద్దు తర్వాత రద్దుల పర్వం ముగుస్తుందనుకుంటే పొరపాటు. దేశమంతా సమానరీతిలో అభివృద్ధి జరుగాలంటే ఫెడరల్ వ్యవస్థను రద్దుచేయాలంటారు, రిజర్వేషన్లు రద్దుచేయక తప్పదంటారు, మారిన పరిస్థితిలో భారత రాజ్యాంగానికి కాలదోషం పట్టిందంటే నోరు తెరువొద్దు! ఇవి కేవలం కనీసంగా జరుగనున్న రద్దులు మాత్రమే.

1865 ఏప్రిల్ 4 నాడు ఒక రేసిస్టు-జాతి దురహంకారం, ద్వేషం, పగ, కసి ప్రకోపించిన ఉన్మాది-తుపాకి గుళ్లకు బలైన స్వాతంత్ర్య పిపాసి, మానవతావాది, యూఎస్ఏ 16వ అధ్యక్షుడు అబ్రహం లింకన్ అన్నాడు. "No man is good enough to govern another man without the other's consent...As I would not be a slave, so I would not be a master. This expresses my idea of democracy..." నిరంకుశ పాలన దుశ్చర్యలకు గురై నిర్బంధంలో ఉన్నప్పుడు కొందరికి కాలక్షేప మార్గం కన్పించదు, సృజనాత్మక కార్యకలాపాల్లో మునిగి తేలేవారికి సమయం చాలదనిపిస్తుంది. భారత స్వాతంత్రోద్యమంలో జైలుశిక్షలు అనేక ఏండ్లు అనుభవించిన ప్రముఖులు కొందరు గ్రంథ పఠనం, రచనలో నిమగ్నమైనారు. లోక్‌మాన్య బాలగంగాధర తిలక్ మాండలే జైలులో ఉన్నప్పుడు అత్యంత మహిమాన్వితమైన భగవద్గీతను ఆంగ్లంలోకి అనువదించి అమూల్యమైన వ్యాఖ్యానం రచించారు. ఉరిశిక్ష, తేది, సమయం కోసం ఎదురుచూస్తూ యువ విప్లవకారుడు భగత్‌సింగ్ మార్క్సిజం అధ్యయనం జరిపాడు. పద కొండేండ్లు జైలులో ఉన్న నెహ్రూ అనేక గ్రంథాలు పఠించి, మిత్రులతో చర్చల ద్వారా విజ్ఞానం ఆర్జించి అమూల్య గ్రంథాలు రచించారు. ఆయన పేరు వింటే భగ్గుమంటున్నవారు ఆయన గ్రంథాల పఠనాన్ని ఆపివేయలేరు. ఇందిర ఎమర్జెన్సీలో అరెస్టయి జైలులో ఉన్న జయప్రకాశ్ అనారోగ్యంతో బాధపడుతున్నా జైలు డైరీ రచించారు. బ్రిటిష్ పాలకులు రంగూన్ జైలులో నిర్బంధించిన చివరి మొగలు చక్రవర్తి, 1857 ప్రథమ స్వాతంత్ర్య సమరం నాయకుల్లో ఒకడైన బహదుర్ షా జఫర్ తన షాయిరీ (ఉర్దూలో కవితల రచన) ఆపలేదు. నెహ్రూ, అబ్దుల్ కలాం ఆజాద్ తదితరులు అహ్మద్‌నగర్ జైలులో ఉన్నప్పుడు (ఆజాద్ ఆ జైలులోనె 'గుబారె ఖాతిర్' గ్రంథాన్ని రచించారు). కల్హణ మహాకవి 'రాజతరంగిణి' (ఇది కల్హణుడు 12వ శతాబ్దంలో రచించిన సంస్కృత గ్రంథం-ప్రాచీన కశ్మీరు చరిత్ర) గ్రంథాన్ని ఆంగ్లంలోకి అనువదించిన రంజిత్ పండిత్ కశ్మీరు చరిత్రను వివరించేవాడు. ఇది 'మా అంతర్గత విషయం' అని ఎవరెంత బల్ల గుద్దిచెప్పినా ట్రంప్ మొదలుకొని జంప్ వరకు ప్రపంచమంతటా అందరికీ ఈరోజు చర్చనీయాంశం అవుతున్నది కశ్మీరు.

మన దేశం ఈరోజు ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక తిరోగమనం, మాంద్యం నుంచి దేశ ప్రజల దృష్టిని మళ్లించడానికి 370 వంటి మత్తుమందు ఏదో ఒకటి ఉండాలె. నోట్లరద్దుతో మంచిరోజులు వస్తాయని కొంతకాలం గడిపారు. 370 రద్దు తర్వాత రద్దుల పర్వం ముగుస్తుందనుకుంటే పొరపాటు.

వినియోగదారులకు అండ

కొత్త చట్టం

డాక్టర్ అకున్ సభర్వాల్, ఐపీఎస్

ఆన్‌లైన్ మార్కెట్ యుగంలో వినియోగదారుల హక్కులు మృగ్యమవుతున్నాయి. వినియోగదారుడిగా నేరుగా వస్తువును కొని ఉపయోగించుకునే కాలం పోయింది. అవసరార్థం ఏ వస్తువునైనా ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా వస్తువులను కొనితెచ్చుకునే పరిస్థితులు వచ్చాక వినియోగదారుడు మరింతగా మోసాలకు గురవుతున్న స్థితి ఏర్పడింది. కొనుగోలు చేసిన వస్తువుల్లో నాణ్యత లోపించినా, ఆశించిన మేర నాణ్యతా ప్రమాణాలు లేకపోయినా, అంతేగాక మరేవిధమైన మోసానికి గురైనా దానిగురించి అడిగే పరిస్థితులు అంతగా లేవు. ఈ పరిస్థితుల్లో కేంద్రం ఇటీవల తీసుకొచ్చిన కొత్త వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం-2019 పలువిధాలుగా వినియోగదారులకు రక్షణ కల్పిస్తున్నది.

వినియోగదారుల చట్టం-1986 స్థానంలో వచ్చిన కొత్తచట్టం వినియోగదారుల హక్కుల ఉల్లంఘనలపై భారీ జరిమానాలు విధించే విధంగా ఉన్నది. ఇది అన్నిస్థాయిల్లోనూ జిల్లా నుంచి జాతీయస్థాయిదాకా అంతటా వినియోగదారులకు రక్షణగా నిలబడుతున్నది. వినియోగదారులకు నష్టం జరిగినప్పుడు జవాబుదారులను, కారకులను జరిమానాలతోనే సరిపెట్టకుండా కఠినశిక్షలు, జైలుకు పంపటానికి కూడా వెనుకాడని విధంగా కొత్తచట్టం వినియోగదారులకు రక్షణగా ఉంటున్నది.

గత చట్టాలతో పోలిస్తే 2019 వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం అనేకవిధాలుగా విశిష్టమైనది. ఈ నూతన చట్టం పలువిధాలుగా వినియోగదారులకు రక్షణ కవచంగా ఉంటున్నది. వినియోగదారుల కోసం అనేక రక్షణలు ఈ కొత్త చట్టంలో పొందుపర్చబడినాయి. వినియోగదారుల వివాద కేసులు సత్వర పరిష్కారం, వస్తువులు సరుకులుగా మారే క్రమంలో వాటి నిర్వహణ కూడా సమర్థవంతంగా నిర్వహించబడే అవకాశం ఉన్నది. వస్తు కొనుగోలు ఏ రూపంలో చేసినా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, మల్టీలెవల్ మార్కెటింగ్ తదితర విధానాల ద్వారా వినియోగదారులు వస్తు కొనుగోలు చేసినా వినియోగదారుడిగానే పరిగణిస్తూ అతనికి ఈ చట్టం

పీఎఫ్‌పై 8.65% వడ్డీ.. త్వరలో ప్రకటన

- ఆరు కోట్ల మంది చందాదారులకు లబ్ధి: గాంగ్వార్

న్యూఢిల్లీ: 2018-19 సంవత్సరానికిగానూ ఉద్యోగుల భవిష్యనిధి (ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్) డిపాజిట్లపై వడ్డీరేటును 8.65 శాతంగా నిర్ణయిస్తూ కార్మిక మంత్రిత్వశాఖ ఫిబ్రవరిలో తీసుకున్న నిర్ణయంపై త్వరలోనే ప్రకటన వస్తుందని ఆ శాఖా మంత్రి సంతోష్ గాంగ్వార్ శుక్రవారం పేర్కొన్నారు. పీఎఫ్‌పై 8.65శాతం వడ్డీ ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక శాఖ అభ్యంతరం వ్యక్తం చేయలేదని ఆయన తెలిపారు. త్వరలోనే దీనిపై నోటిఫికేషన్ విడుదలవుతుందని తెలిపారు. తాజా నిర్ణయంతో ఆరుకోట్ల మంది పీఎఫ్ చందాదారులకు లబ్ధి చేకూరనున్నది. 2017-18 ఏడాదికి పీఎఫ్ వడ్డీరేటును 8.55 శాతంగా నిర్ణయించారు. ప్రస్తుతం పీఎఫ్‌పై ఈ వడ్డీరేటునే కొనసాగిస్తున్నారు. కాగా, 2015-16లో పీఎఫ్‌పై 8.8శాతం వడ్డీరేటును చెల్లించారు. 2016-17లో 8.65శాతానికి తగ్గించారు. ఆ మరుసటి ఏడాది 8.55శాతంగా నిర్ణయించారు.

సెక్యూరిటీ గార్డులు ఆరెస్సెస్ శిక్షణ తీసుకోవాలి

రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ వ్యాఖ్య

న్యూఢిల్లీ, ఆగస్టు 30: ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులను ఆరెస్సెస్ శిక్షణాశిబిరాలకు పంపితే వారి మానసిక, శారీరక సామర్థ్యం బలోపేతం అవుతుందని రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. శుక్రవారం ఢిల్లీలో జరిగిన 'ప్రైవేట్ భద్రతా పరిశ్రమ సదస్సు-2019'లో ఆయన మాట్లాడుతూ.. 'భారీస్థాయిలో మీరు శిక్షణ పొందడంపై దృష్టి పెట్టండి. ఆరెస్సెస్ శాఖల శిక్షణలో మేం మెరుగుదిద్దుకున్నాం. ఇటువంటి శిక్షణే సెక్యూరిటీ గార్డులు పొందాలని నేను భావిస్తున్నా. ఇదేమీ పనికిమాలిన పని కాదు. దీని ద్వారా కొంత నేర్చుకోవచ్చు. మీ రంగంలో పనిచేసే వారికి శిక్షణ తప్పనిసరి. ఆరెస్సెస్ శిక్షణతో మానసిక, శారీరక సామర్థ్యం పెంపొందించుకోవచ్చు' అని అన్నారు.

వడివడిగా జాబిలివైపు..

- విజయవంతంగా నాలుగోసారి చంద్రయాన్-2 కక్ష్య కుదింపు

బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రతిష్ఠాత్మకంగా ప్రయోగించిన చంద్రయాన్-2 వ్యోమనౌక జాబిలివైపు వడివడిగా అడుగులు వేస్తున్నది. శుక్రవారం సాయంత్రం 06.18 గంటలకు నాలుగోసారి కక్ష్య కుదింపు ప్రక్రియను విజయవంతంగా చేపట్టినట్లు ఇస్రో వెల్లడించింది. 1155 సెకన్లపాటు ప్రొపల్షన్ సిస్టమ్‌ను మండించి 124కి.మీ.x 164 కి.మీ. కక్ష్యలోకి చంద్రయాన్-2ను విజయవంతంగా చేర్చినట్లు పేర్కొంది. తదుపరి కక్ష్య కుదింపు ప్రక్రియను సెప్టెంబర్ 1న సాయంత్రం 6-7 గంటల మధ్య చేపట్టనున్నట్లు తెలిపింది. ఈ నెల 20న చంద్రయాన్-2 వ్యోమనౌక విజయవంతంగా చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశించిన విషయం తెలిసిందే. ఆదివారం చివరి కక్ష్య కుదింపు ప్రక్రియను చేపట్టనున్నారు. సెప్టెంబర్ 2న ఆర్బిటార్ నుంచి ల్యాండర్ విడిపోయి 100 కి.మీ.x 30 కి.మీ. కక్ష్యలోకి చేరుతుందని ఇస్రో తెలిపింది. అనంతరం సెప్టెంబర్ 7న ల్యాండర్ విక్రమ్‌ను చంద్రుడి దక్షిణ ధ్రువ ప్రాంతంపై సాఫ్ట్ ల్యాండింగ్ జరిపించడానికి అత్యంత క్లిష్టమైన ప్రక్రియను చేపట్టాల్సి ఉందని వివరించింది. బెంగళూరు సమీపంలోని బైలలులో ఉన్న ఇండియన్ డీప్ స్పేస్ నెట్‌వర్క్ యాంటెన్నాల సాయంతో ఇస్రో టెలిమెట్రీ, ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్ నుంచి వ్యోమనౌక గమనాన్ని శాస్త్రవేత్తలు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

షాజహాన్‌పూర్ లా విద్యార్థిని ఆచూకీ లభ్యం!

- సొంతూరికి వెళ్లేందుకు నిరాకరించిన యువతి
- ఢిల్లీలో బసను కల్పించిన సుప్రీంకోర్టు
- యువతి తల్లిదండ్రులను ఢిల్లీకి తీసుకురావాలని యూపీ పోలీసులకు ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 30: కేంద్ర హోంశాఖ మాజీ సహాయమంత్రి స్వామి చిన్మయానంద్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన లా విద్యార్థిని ఆచూకీ శుక్రవారం ఉదయం రాజస్థాన్‌లో లభ్యమైంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం సాయంత్రం సదరు యువతిని యూపీ పోలీసులు జస్టిస్ ఆర్ భానుమతి, జస్టిస్ ఏ ఎస్ బోపన్నతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ముందు ప్రవేశపెట్టారు. న్యాయమూర్తులు ఆమెను రహస్యంగా విచారించారు. తన తల్లిదండ్రులు వచ్చేంత వరకూ ఢిల్లీలోనే ఉండాలని యువతి కోరుకుంటున్నదని, ఆమె తన సొంత రాష్ట్రానికి పోవాలని అనుకోవడం లేదని సుప్రీంకోర్టు వెల్లడించింది. యువతి కోరికమేరకు నాలుగు రోజులపాటు ఢిల్లీలో ఆమె బస చేయడానికి ఏర్పాట్లు చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. తన తల్లిదండ్రులను కలిసేంతవరకూ యూపీకి వెళ్లనని యువతి చెప్పిన నేపథ్యంలో.. యువతి తల్లిదండ్రులను కట్టుదిట్టమైన భద్రతతో యూపీలోని షాజహాన్‌పూర్ నుంచి ఢిల్లీకి వీలైనంత తొందరగా తీసుకురావాలని ఢిల్లీ పోలీసు కమిషనర్‌ను కోర్టు ఆదేశించింది. ఈ కేసుపై సెప్టెంబర్ 2న మళ్లీ వాదనలు వింటామని, అప్పటివరకూ యువతి తన తల్లిదండ్రులను తప్పా ఎవ్వరినీ కలువకూడదని ధర్మాసనం ఆదేశించింది. అంతకు ముందు.. సదరు విద్యార్థిని ఆచూకీని రాజస్థాన్‌లో కనుగొన్నామని యూపీ ప్రభుత్వం తరుపు న్యాయవాది శుక్రవారం మధ్యాహ్నం సుప్రీంకోర్టుకు తెలిపారు. అయితే, ఆమెను శుక్రవారమే కోర్టులో హాజరుపర్చాలని యూపీ సర్కారును అత్యున్నత ధర్మాసనం ఆదేశించింది. దీంతో పోలీసులు యువతిని ధర్మాసనం ముందు హాజరుపర్చారు. వారం రోజుల క్రితం షాజహాన్‌పూర్‌కు చెందిన లా విద్యార్థిని స్వామి చిన్మయానంద్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన సంగతి తెలిసిందే. అయితే, ఇదంతా బ్లాక్ మెయిల్ చేయడానికి చేసిన కుట్రలో భాగమని చిన్మయానంద్ తరుపు న్యాయవాది ఆరోపించారు. న్యాయవాద బృందం అభ్యర్థన మేరకు సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా న్యాయ విచారణకు తీసుకున్నది.

ఆర్థిక ఎమర్జెన్సీ ప్రకటించాలి: కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఆగస్టు 30: దేశంలో ఆర్థిక ఎమర్జెన్సీ ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. 'కుంచించుకుపోతున్న ఆర్థిక వ్యవస్థ, పెరుగుతున్న మోసాల'పై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆ పార్టీ అధికార ప్రతినిధులు జైవీర్ శెర్గిల్, గౌరవ్ వల్లభ్ పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ, బ్యాంకింగ్ వ్యవస్థ విశ్వసనీయతను బీజేపీ ప్రభుత్వం ధ్వంసంచేస్తున్నదన్నారు. వారు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా రుణాల ఎగవేతకు పాల్పడుతున్న వారి పేర్లు, వారు ఎగవేతకు పాల్పడిన మొండిబకాయిల (ఎన్పీఏ) వివరాలను వెల్లడించాలన్నారు. ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ భారీ ఆర్థిక మాంద్యం దిశగా అడుగులేస్తున్నదన్నారు. వరుసగా ఐదు క్రైమాసికాల్లో వృద్ధిరేటు తగ్గిపోవడమే దీనికి నిదర్శనం అని చెప్పారు. స్వల్పకాలిక ఉద్దీపన చర్యలు కేవలం గాయాలకు ఉపశమనం వంటివేనన్నారు. నిరంతరం వృద్ధిరేటు తగ్గిపోవడానికి కారణాలేమిటని నిలదీశారు.

నిర్మాణాత్మక విమర్శలను స్వాగతిస్తా

- ప్రజా జీవితంలో భిన్న మాధ్యమాలుండాలి
- భేదాభిప్రాయాలున్నా నిరంతర చర్చలు సాగాలి
- భాషను దేశ ఐక్యతకు ఉపయోగించాలి
- మలయాళ మనోరమ కాన్క్లేవ్‌లో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ/కొచ్చి, ఆగస్టు 30: నిర్మాణాత్మక విమర్శలను తాను స్వాగతిస్తానని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రజా జీవితంలో ప్రతి ఒక్కరి అభిప్రాయాలను వినేందుకు భిన్న మాధ్యమాలు ఉండాలని పేర్కొన్నారు. భేదాభిప్రాయాలు ఉన్నప్పటికీ సమాజంలో నిరంతర చర్చలకు చోటు ఉండాలన్నారు. శుక్రవారం కొచ్చిలో నిర్వహించిన మలయాళ మనోరమ న్యూస్ కాన్క్లేవ్‌ను ఉద్దేశించి ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. 'ఈ సదస్సులో నాలాంటి ఆలోచనా విధానం కలిగినవారు బహుశా ఎక్కువ మంది ఉండకపోవచ్చు. అయితే నేను కోరుకుంటున్న నిర్మాణాత్మక విమర్శలు చేసేవారు తగినంత మంది ఉన్నారు' అని ప్రధాని పేర్కొన్నారు. 'వేదికలపై తన లాంటి ఆలోచనలు ఉన్నవారు ఉంటే బాగుంటుందని ప్రముఖులు సహజంగా కోరుకుంటారు. ఎందుకంటే వారి మధ్య ఉంటే సౌకర్యంగా ఉంటుంది. నేను కూడా అలాంటి పరిసరాల్లోనే ఉండాలనుకుంటా. అదే సమయంలో, ఒకరి ఆలోచనా విధానంతో నిమిత్తం లేకుండా వ్యక్తులు, సంస్థల మధ్య నిరంతర చర్చలుండాలని కోరుకుంటా' అని ఆయన వ్యాఖ్యానించారు. నిర్వాహకులు 'నవభారతాన్ని' సమావేశ ఇతివృత్తంగా తీసుకోవడాన్ని ప్రధాని ప్రస్తావిస్తూ.. 'మీరు కూడా మోదీ భాషను మాట్లాడుతున్నారా? అని విమర్శకులు మిమ్మల్ని ప్రశ్నిస్తారు. అందుకు మీ దగ్గర సమాధానాలు ఉన్నాయని నేను భావిస్తున్నా' అని పేర్కొన్నారు. నవభారత స్ఫూర్తిని ప్రస్తావిస్తూ.. 'ఆకాంక్ష అనేది చెడు పదంగా భావించే సంస్కృతి చాలా ఏండ్లపాటు కొనసాగింది. ఇంటిపేరు, సంబంధాలను బట్టే తలుపులు తెరుచుకునేవి. అయితే ప్రస్తుతం భారత్ మారుతున్నది. ఇక్కడ ఇంటి పేరుతో సంబంధం ఉండదు. వారి సామర్థ్యమే వారికి పేరు తెస్తుంది' అని వివరించారు. గతంలో అసాధ్యమనుకున్నవి తాము సుసాధ్యం చేశామని ప్రధాని చెప్పారు. 'హర్యానా లాంటి రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ పారదర్శకంగా జరుగుతుందంటే నమ్మశక్యంగా ఉండేది కాదు. ప్రస్తుతం పారదర్శకంగా ఉద్యోగాల భర్తీ జరుగుతున్నదని ప్రజలు చెప్తున్నారు' అని ప్రధాని పేర్కొన్నారు. విధాన పక్షవాతాన్ని మార్చగలమా అని గతంలో ప్రజలు అనుకునేవారని, అదే ఇప్పుడు.. 'మార్చగలం' అని వారు అనుకుంటున్నారన్నారు. తమ ప్రభుత్వం కేవలం భారత్‌లో నివసించే ప్రజల కోసమే కాకుండా విదేశాల్లో నివసించే భారతీయుల సంక్షేమం కోసం కూడా చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. పశ్చిమ ఆసియాలో భారత నర్సులను ఉగ్రవాదులు నిర్బంధించినపుడు, వారందరినీ సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చామన్నారు. ఇటీవల తాను బహ్రెయిన్ పర్యటనకు వెళ్లినప్పుడు, ఆ దేశ జైళ్లలో మగ్గుతున్న 250 భారత ఖైదీలకు అక్కడి రాజు క్షమాభిక్ష ప్రసాదించారని చెప్పారు. అలాగే ఒమన్, సౌదీ అరేబియా కూడా పలువురు భారతీయ ఖైదీలను విడుదల చేశాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్, బీజేపీ ఎంపీ మీనాక్షి లేఖీ, కాంగ్రెస్ నేత శశిథరూర్, సీపీఐ ప్రధాన కార్యదర్శి డీ రాజా, సీపీఎం నేత మొహమ్మద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

భిన్న భాషల ప్రజలకు మీడియా వారధి కావాలి.. దేశ ఐక్యతకు భాషను ఓ పనిముట్టుగా చేసుకోవాలని ప్రధాని మోదీ సూచించారు. స్వార్థ ప్రయోజనాల కోసం కొన్ని సందర్భాల్లో భాషను దేశ విభజనకు ఉపయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విభిన్న భాషలు మాట్లాడే వారిని దగ్గర చేసేందుకు మీడియా ఒక వారధిలా క్రియాశీల పాత్ర పోషించాలని సూచించారు. 'ఇదంతా కష్టమైన పనికాదు. ఒక పదాన్ని దేశంలో మాట్లాడే 10-12 భాషల్లో ప్రచురించడం ద్వారా దీన్ని మనం ప్రారంభిద్దాం. ఏడాదిలో ఒక వ్యక్తి భిన్న భాషలకు చెందిన 300లకుపైగా పదాలను నేర్చుకోగలగుతాడు. ఒక వ్యక్తి ఇతర భారతీయ భాషను నేర్చుకోవడం ద్వారా ఉమ్మడి అంశాలను తెలుసుకోగలగుతాడు. భారత సంస్కృతిలోని ఏకత్వాన్ని నిజంగా అర్థం చేసుకోగలగుతాడు' అని పేర్కొన్నారు. దీనిపై కాంగ్రెస్ నేత శశిథరూర్ ట్వీట్ చేస్తూ.. 'మన మాతృభాష కాకుండా ఇతర భారతీయ భాషల నుంచి రోజుకో పదం నేర్చుకోవాలని ప్రధాని సూచించారు. హిందీ ఆధిపత్యం నుంచి నిష్క్రమించడాన్ని నేను స్వాగతిస్తున్నా. ' అని పేర్కొన్నారు.

ఢిల్లీలో ప్రముఖ యోగా గురువు డాక్టర్ విశ్వాస్ వసంత్ మండిక్‌కు యోగా అవార్డు అందజేస్తున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ

ప్రాచీన వైద్య విజ్ఞానానికి ఆధునికత జోడింపు

తీవ్రమైన వ్యాధులను నయం చేయగల ప్రాచీన వైద్య విజ్ఞానానికి సంబంధించిన గొప్ప గ్రంథాలు మన దగ్గర ఉన్నాయని, అయితే ఈ ప్రాచీన విజ్ఞానానికి ఆధునికతను జోడించడంలో కొద్దిగానే విజయం సాధించామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గత ఐదేండ్లలో ఆయుష్ మంత్రిత్వ శాఖ ద్వారా ఈ పరిస్థితిని మార్చేందుకు తాము ప్రయత్నించామని చెప్పారు. ల్యాబొరేటరీల్లో నిర్ధారణ చేయడం ద్వారా ఈ ప్రాచీన పరిశోధనలకు శాస్త్రీయ ఆధారాలను కనుగొన్నామన్నారు. శుక్రవారం ఢిల్లీలో యోగా అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో 1.5 లక్షల ఆరోగ్య, సంరక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అలాగే 12వేల ఆయుష్ కేంద్రాలను నెలకొల్పాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని, శుక్రవారం హర్యానాలో 10 కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఏడాదిలోనే 4 వేల ఆయుష్ కేంద్రాలను నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల నిమిత్తం నిరంతరం ప్రజల్లో తిరిగి గొంతు నొప్పితో బాధపడుతున్న హర్యానా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్‌ను ఈ ఆయుష్ సెంటర్లలో చికిత్స తీసుకోవాలని ప్రధాని సరదాగా సూచించారు. ఒకే దేశం- ఒకే పన్ను, ఒకే దేశం- ఒకే మొబిలిటీ కార్డు మాదిరిగా ఆయుష్ గ్రిడ్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆయుష్మాన్ భారత్ యోజన కింద వైద్యం పొందడం ద్వారా పేద ప్రజలు రూ.12 వేల కోట్లను ఆదా చేసుకున్నారని చెప్పారు. దాదాపు ప్రపంచంలోని ప్రతి దేశాధినేత కూడా తనతో యోగా గురించి మాట్లాడారని ప్రధాని చెప్పారు. 'నేను విదేశాలకు వెళ్లినప్పుడు, ఎంత పెద్ద దేశాధినేత అయినా యోగాతోనే సంభాషణ మొదలవుతుంది. యోగా గురించి నాతో కనీసం 5-10 నిమిషాలు మాట్లాడుతారు' అని తెలిపారు.

చంద్రయాన్ ల్యాండింగ్‌ను వీక్షించనున్న.. ముగ్గురు విద్యార్థులు

భువనేశ్వర్, రాంచి, షిల్లాంగ్: చంద్రుడిపై చంద్రయాన్-2 దిగడాన్ని ప్రధాని మోదీతో, శాస్త్రవేత్తలతో కలిసి ప్రత్యక్షంగా వీక్షించే అవకాశం ముగ్గురు విద్యార్థులకు దక్కింది. బెంగళూరులోని ఇస్రో ప్రధాన కార్యాలయం నుంచి ఈ ప్రత్యక్ష వీక్షణ జరుగనుంది. ఇందులో ప్రధాని మోదీ కూడా పాల్గొనన్నారు. వచ్చే నెల 7న ఈ చారిత్రక ఘట్టం ఆవిష్కృతమవనుంది. విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతికతపై అవగాహన కల్పించడానికి ఇస్రో ఆన్‌లైన్ క్విజ్ పోటీని నిర్వహించింది. విజేతలకు చంద్రయాన్-2 ల్యాండింగ్‌ను ఇస్రో ప్రధాన కార్యాలయం నుంచి వీక్షించే అవకాశం కల్పిస్తామని తెలిపింది. విజేతలుగా ఎంపికైన వారిలో మేఘాలయకు చెందిన రిబైట్ పావా (10వ తరగతి విద్యార్థి), జార్ఖండ్‌కు చెందిన మ్రిదులా కుమారి (9వ తరగతి), ఒడిశాకు చెందిన చిన్మయ చౌదరి (8వ తరగతి) ఉన్నారు. ఈ సందర్భంగా రిబైట్ పావా, మ్రిదులా కుమారి మాట్లాడుతూ ఇస్రో ప్రధాన కార్యాలయం నుంచి చారిత్రక ఘట్టమైన చంద్రయాన్-2 ల్యాండింగ్‌ను వీక్షించే అవకాశం రావడం సంతోషంగా ఉన్నదని చెప్పారు. ప్రధాని మోదీతో కలిసి వీక్షించనుండటం గొప్ప అనుభూతి అని పేర్కొన్నారు.

మునిగిపోతున్నాం!

- భూమిపై వేగంగా కరుగుతున్న మంచు
  - పెరుగుతున్న సముద్ర మట్టాలు
  - గ్లోబల్ వార్మింగ్‌తో వేడెక్కుతున్న కడలి
  - జీవజాతులకు పొంచి ఉన్న పెనుముప్పు
  - సమీప భవిష్యత్తులో కోట్ల మందికి తప్పని వలస

జీవం పుట్టిందీ.. జీవ పరిణామం జరిగిందీ.. సముద్రంలోనే. ఏకకణ జీవుల నుంచి మానవుల వరకు అనేక జాతులు ఉద్భవించడంలో, కాలగమనంలో పరిణామం చెందడంలో కడలిది కీలకపాత్ర. ఇప్పటికీ కొన్ని కోట్ల జీవజాతులు సాగర గర్భంలో ఆవాసం పొందుతున్నాయి. ఇలా జీవులకు ప్రాణాధారమైన సముద్రం.. మానవుడి వికృత చేష్టల వల్ల శత్రువుగా మారుతున్నది. గ్లోబల్ వార్మింగ్ వల్ల హిమపాతాలు కరిగి సముద్రాల్లోకి భారీగా నీరు చేరుతున్నది. తీరప్రాంతాలు ముంపునకు గురవుతూ కోట్ల మంది నిరాశ్రయులు అవుతున్నారు. అదేసమయంలో సముద్ర జలాలు వేడెక్కుతూ అందులోని జీవజాతుల మనుగడకు ముప్పుగా పరిణమించింది. ఐక్యరాజ్యసమితి విడుదల చేసిన తాజా నివేదికలోనూ ఇదే విషయాన్ని స్పష్టం చేసింది.

వినాశనం మొదలైంది

సముద్ర జలాలు వేడెక్కడం, జలమట్టం పెరుగడం వల్ల ఇప్పటికే అనేక నష్టాలు ఎదురవుతున్నాయి. చేపల సంఖ్య వేగంగా పడిపోతున్నది. ఉష్ణ పవనాలు, తుఫాన్ల సంఖ్య పెరిగింది. సముద్ర మట్టాలు పెరుగుతుండటంతో తీరప్రాంతాల్లో నివసిస్తున్న కోట్ల మంది ప్రజలు వలస వెళ్లాల్సి వస్తున్నది. సముద్రాలు, భూమిపై ఉన్న ఘనీభూత మండలాల (ఫ్రోజెన్ జోన్స్) పరిస్థితిపై ఐరాసకు చెందిన ఇంటర్‌గవర్నమెంటల్ ప్యానల్ ఆన్ క్లైమెట్ చేంజ్ (ఐపీసీసీ) ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఈ శతాబ్దం చివరినాటికి ఉత్తరార్ధగోళంలో ఉన్న మంచులో 30 శాతం కరుగనుంది. ఫలితంగా సముద్రాల్లోకి భారీగా నీరు చేరడంతోపాటు కోట్ల టన్నుల కార్బన్ వాతావరణంలోకి చేరనుంది. ఫలితంగా గ్లోబల్ వార్మింగ్ ముప్పు మరింత పెరుగనుంది.

వరదముప్పు.. వెయ్యిరెట్లు

సముద్రమట్టాలు ఇలాగే పెరిగితే తీరప్రాంత నగరాలు, ద్వీప దేశాలకు ఏటికేడు వరదలు, తుఫాన్ల ముప్పు పెరుగుతుందని ఐరాస హెచ్చరించింది. 2050 నాటికి ఇవి తారాస్థాయికి చేరుతాయని పేర్కొన్నది. 2100 నాటికి వరదల ముప్పు 100 నుంచి వెయ్యి రెట్లు పెరుగుతుందట. ప్రపంచవ్యాప్తంగా తీరప్రాంతాల్లో నివసిస్తున్న దాదాపు 25 కోట్ల మంది వలసలు వెళ్లాల్సి వస్తుందని స్పష్టం చేసింది.

సముద్రాలు.. జీవజాతులకు ప్రాణాధారం

సముద్రాలు మన గ్రహానికి లభించిన అద్భుతమైన వరం. గ్లోబల్ వార్మింగ్‌తో సహా వాతావరణానికి హాని కలిగించే అనేక కారకాలను తనలో ఇముడ్చుకుంటున్నది. స్పాంజిలాగా పనిచేస్తూ భూమిని కాపాడుతున్నది. ఒకవేళ సముద్రాలు లేకుంటే ఇప్పటికే గ్లోబల్ వార్మింగ్‌తో భూమి పతనం అంచుకు చేరేది.

మీకు తెలుసా..

- 1970 నుంచి వాతావరణంలోకి విడుదలవుతున్న గ్రీన్‌హౌస్ వాయువుల వల్ల ఉత్పత్తవుతున్న వేడిలో 90% సముద్రాలే పీల్చుకుంటున్నాయి.
- ఏటా విడుదలవుతున్న కార్బన్ డై ఆక్సైడ్‌లో 25 శాతాన్ని సముద్రాలు శోషించుకుంటున్నాయి.
- సముద్రంలోని వృక్షజాతుల వల్ల కిరణజన్య సంయోగక్రియ జరిగి కోట్ల టన్నుల ఆక్సిజన్ వెలువడుతున్నది.
- సముద్రంలో ఏర్పడుతున్న ఉష్ణపవనాల వల్ల అనేక ప్రాంతాల్లో వృక్ష జాతులు నశించి 'ఆక్సిజన్ రహిత ప్రాంతాలు'గా మారుతున్నాయి.

బిగ్-4 దేశాలకు భారీ ముప్పు

మంచు కరుగడం, సముద్ర మట్టాలు పెరుగడం వల్ల అమెరికా, చైనా, భారత్‌తోపాటు యూరప్ దేశాలకు భారీ ముప్పు తప్పదని ఐరాస హెచ్చరిస్తున్నది. అయినా ఈ దేశాలు ఇప్పటివరకు ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోవడం లేదని తెలిపింది. ఏటా ప్రపంచవ్యాప్తంగా ఇంధనాన్ని మండించడం ద్వారా వెలువడుతున్న కర్బన ఉద్గారాల్లో 60శాతం ఈ బిగ్-4 నుంచే వస్తున్నట్టు వెల్లడించింది.

భారత్: సముద్ర మట్టం పెరుగడం వల్ల దేశ వాణిజ్య రాజధాని అయిన ముంబై మహానగరంతోపాటు చెన్నై, కొచ్చి వంటి కీలక నగరాలు తీవ్రంగా నష్టపోతాయి.

చైనా: షాంఘై, నింగ్బో, తైంజో మహానగరాలతోపాటు మరో ఆరు తీరప్రాంత నగరాలకు ముప్పు పొంచి ఉన్నది.

అమెరికా: న్యూయార్క్ మహానగరంతోపాటు మియామి వంటి అనేక తీరప్రాంత నగరాలు ముంపునకు గురవుతాయి.

యూరప్: ఆమ్‌స్టర్‌డ్యామ్, వెనిస్, హంబర్గ్ వంటి ప్రఖ్యాత నగరాలు ఇప్పటికే డేంజర్ జోన్‌లో ఉన్నాయి.

> 'ఇప్పటికే తీరప్రాంతం నుంచి వలసలు మొదలయ్యాయి. అయినా ప్రభుత్వాలు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఈ సంఖ్య ఇప్పుడు తక్కువగా కనిపిస్తుండొచ్చు. కానీ.. సమీప భవిష్యత్తులో కోట్ల మంది ప్రజలు నిరాశ్రయులై వలసలు వెళ్లాల్సి వస్తుంది. ఈ ఆలోచనే నన్ను వణికిస్తున్నది'
> – బెన్ స్ట్రాస్, ఐరాస క్లైమెట్ సెంట్రల్ సీఈవో, చీఫ్ సైంటిస్ట్

-నేషనల్ డెస్క్

1.17 కోట్ల పాత నోట్ల డిపాజిట్‌కు అనుమతించండి

- తమిళనాడు వ్యాపారి పిటిషన్‌పై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు

న్యూఢిల్లీ, ఆగస్టు 30: రద్దయిన పెద్దనోట్లను డిపాజిట్ చేసేందుకు కేంద్రం, ఆర్బీఐలు అనుమతించేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ తమిళనాడుకు చెందిన ఒక వ్యాపారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. 2016 నవంబర్ ఎనిమిదో తేదీన ప్రధాని నరేంద్రమోదీ జాతినుద్దేశించి మాట్లాడుతూ రూ.1000, రూ.500 విలువైన పాతనోట్లను రద్దుచేస్తున్నట్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. పాత నోట్లను డిపాజిట్ చేసేందుకు 2016 డిసెంబర్ 30వ తేదీని తుది గడువుగా కేంద్రం నాడు నిర్ణయించింది. అయితే తమిళనాడులోని మదురైకి చెందిన కే రామన్ అనే వ్యాపారి తిరుపూర్‌లోని తమిళనాడు మర్కంటైల్ బ్యాంక్‌ను 2016 డిసెంబర్ 30న వెళ్లి తన వద్ద ఉన్న 1.17 కోట్ల నగదు డిపాజిట్ చేసుకోవాలని కోరారు. బ్యాంకు అందుకు నిరాకరించింది. నాటి నుంచి ఇప్పటి వరకు ఆర్బీఐతోపాటు సంబంధిత అధికారులకు విజ్ఞప్తులు రాసినా ప్రయోజనం లేకపోయింది. చివరకు రద్దైన నోట్లను డిపాజిట్లు చేసుకునేందుకు అనుమతించలేమని గత నెలలో ఆర్బీఐ సమాధానం ఇచ్చింది. ఇతరులకు ఇచ్చిన పలు చెక్కుల చెల్లింపుల కోసం ఈ నగదు డిపాజిట్ చేయాల్సి ఉందని రామన్ వాదించారు. చెక్‌లు బౌన్స్ కావడంతో తనపై పలు కేసులు నమోదయ్యాయని తెలిపారు.

శివకుమార్ చుట్టూ ఈడీ ఉచ్చు

- మనీలాండరింగ్ కేసులో అధికారుల ముందు హాజరు



బెంగళూరు/న్యూఢిల్లీ, ఆగస్టు 30: కర్ణాటక కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ట్రబుల్‌షూటర్, మాజీ మంత్రి డీకే శివకుమార్ చుట్టూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఉచ్చు బిగుస్తున్నది. మనీలాండరింగ్ కేసులో ఆయన శుక్రవారం ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో అధికారుల ముందు హాజరయ్యారు. అంతకు ముందు ఈడీ జారీ చేసిన సమన్లను సవాల్ చేస్తూ కర్ణాటక హైకోర్టులో శివకుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం తోసిపుచ్చింది. ఈడీ అధికారి ఒకరు మాట్లాడుతూ శివకుమార్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తామని చెప్పారు. ఈడీ కార్యాలయంలోకి ప్రవేశించడానికి ముందు శివకుమార్ విలేకరులతో మాట్లాడుతూ 'ఈడీ అధికారులు నాకు సమన్లు జారీ చేశారు. దీంతో వారి ముందు హాజరుకావడం నా విధి. నేను చట్టాన్ని గౌరవిస్తాను కాబట్టి హాజరయ్యాను. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ చట్టం (పీఎంఎల్ఏ) కింద నన్ను ఎందుకు పిలిచారో అర్థంకావడం లేదు. అయినా వారి విచారణను ఎదుర్కోవడానికి సిద్ధమే' అని చెప్పారు. అంతకు ముందు ఆయన మాట్లాడుతూ 2017లో గుజరాత్ రాజ్యసభ స్థానాల ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్‌కు చెందిన ఆ రాష్ట్ర ఎమ్మెల్యేలు బీజేపీ వలలో పడకుండా ఉండేందుకు వారిని కర్ణాటకకు తీసుకొచ్చానని, దీన్ని దృష్టిలో ఉంచుకొనే కేంద్రం కక్షసాధింపునకు దిగిందని తెలిపారు. ఇందులో భాగంగానే తనకు వ్యతిరేకంగా ఐటీ దాడులు, ఈడీ చర్యలు కొనసాగుతున్

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు
ధర్మగంట
నమస్తే తెలంగాణ, 8-2-603/1/7,8,9 రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.
Whatsapp No. 9346979997
dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.
స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.
/NTDAILYONLINE
కరీంనగర్, శనివారం 31 ఆగస్టు 2019

పట్టా భూమి అన్యాక్రాంతం

- కాస్తులో ఉన్నా భూరికార్డులు మార్చిన రెవెన్యూ అధికారులు
- పట్టా ఎలా మార్చారని అడిగితే రికార్డులు దొరుకడంలేదంటున్న సిబ్బంది
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన నల్లగొండ జిల్లా చెర్వుఅన్నారం రైతు

11.12 ఎకరాలు యజమానికి తెలియకుండా ఇతరులకు పట్టా

తండ్రి, ఇద్దరు కుమారులకు కలిపి 37.02 ఎకరాల భూమి ఉన్నది. వీరు అరవై ఏండ్లుగా కాస్తులో ఉన్నారు. ఇందుకు సంబంధించిన పాత, కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలు కూడా ఉన్నాయి. వీరి భూమిపై కన్నేసిన కొందరు అక్రమార్కులు రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై 11.12 ఎకరాలను 13- బీ ద్వారా పట్టాచేయించుకొన్నారు. పట్టా సమయంలో భూ యజమానికి సమాచారం ఇవ్వాల్సిన అధికారులు అవేవీ పట్టించుకోలేదు. భూమిని తాము విక్రయించనప్పుడు, ఇతరులకు పట్టా ఎలాచేశారని బాధిత రైతులు సమాచారం హక్కు చట్టం కింద అడిగితే.. రికార్డులు దొరుకడంలేదని సమాధానం చెప్తున్నారు. దీంతో నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన నంద్యాల నర్సిరెడ్డి 'ధర్మగంట'ను ఆశ్రయించారు.

కట్టంగూర్: నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం చెర్వుఅన్నారం గ్రామానికి చెందిన నంద్యాల నర్సిరెడ్డి అతని ఇద్దరి కుమారులకు కలిపి అయిటిపాముల గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్లు 482, 483, 485, 486, 494, 495, 478, 481లలో మొత్తం 37.02 ఎకరాల భూమి ఉన్నది. అరవై ఏండ్లుగా వీరు కాస్తులో ఉన్నారు. భూరికార్డుల ప్రక్షాళన సమయంలో రెవెన్యూ అధికారులు ఈ భూమికి సంబంధించి కొత్త పాస్‌పుస్తకాలు కూడా అందజేశారు. వీరి భూమిపై కన్నేసిన ఇదే గ్రామానికి చెందిన మేక పెదమల్లారెడ్డి, మేక చినమల్లారెడ్డి.. నర్సిరెడ్డి భూమిలో నుంచి 9.7 ఎకరాలను 13- బీ ద్వారా పట్టా చేయాలని రెవెన్యూ అధికారులకు గత ఏడాది ఫిబ్రవరి 2న దరఖాస్తు చేసుకొన్నారు. సంబంధిత రెవెన్యూ అధికారులు నర్సిరెడ్డి, అతని కుమారులకు నోటీసులు ఇవ్వకుండానే వీరి భూమిలోనుంచి కబ్జాదారులు అడిగినదానికంటే ఎక్కువగా 11.12 ఎకరాలను 13- బీ ద్వారా అక్రమంగా ఈ ఏడాది మే నెలలో పెద మల్లారెడ్డి, చినమల్లారెడ్డి పేరిట పట్టాచేశారు. విషయమం తెలుసుకొన్న బాధిత రైతు తమకు తెలియకుండా భూమిని ఇతరులకు ఎలా పట్టాచేశారని ఆర్‌ఐ, వీఆర్వోను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. కాస్తులో ఉన్న తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా 11.12 ఎకరాలను రెవెన్యూ అధికారులు డబ్బులు తీసుకొని ఇతరులకు పట్టాచేశారని ఆరోపించారు. రికార్డులు సరిచేయాలని తాసిల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా రేపు మాపు అంటూ కాలం వెల్లదీస్తున్నారని వాపోయారు. భూమిని తాము విక్రయించనప్పుడు, ఇతరులకు ఎలా పట్టాచేశారని సమాచార హక్కు చట్టం కింద వివరాలు అడిగితే.. ఎలాంటి రికార్డులు దొరుకడంలేదని సమాధానం ఇస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. రెవెన్యూ అధికారుల నిర్వాకం వల్ల రెండుసార్లు రైతుబంధు సాయం కోల్పోయానని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయంచేయాలని బాధిత రైతు నర్సిరెడ్డి కోరారు.

బాధిత రైతు నర్సిరెడ్డి

విచారణ చేస్తాం

తన భూమిని ఇతరులకు ఎలా పట్టాచేశారని, దానిని రద్దు చేయాలని కోరుతూ రైతు నర్సిరెడ్డి దరఖాస్తు చేసుకొన్నారు. తాసిల్దార్ ఆదేశాల మేరకు ఇరువురి రైతులకు నోటీసులు జారీ చేశాం. ఈ నెల 28న క్షేత్రస్థాయి విచారణకు వెళ్లాం. నర్సిరెడ్డి నోటీసులు తీసుకోకపోవడంతో విచారణను వాయిదా వేశాం. త్వరలో మళ్లీ విచారణచేస్తాం.

- సుధాకర్, కట్టంగూర్ గిర్దావర్

రికార్డుల్లో తక్కువ రాశారు

1.16 ఎకరాలు మాయం.. మహబూబాబాద్ జిల్లా రైతుల ఆవేదన

మహబూబాబాద్, నమస్తే తెలంగాణ: మోఖా మీద భూమి సరిగానే ఉన్నా పాస్‌పుస్తకాల్లో మాత్రం 1.16 ఎకరాలు మాయమయ్యాయి. రికార్డులు సవరించాలని ఎన్నిసార్లు వేడుకొన్నా.. రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదని మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్ మండలం నడివాడ గ్రామానికి చెందిన వేముల నిర్మల, రాకేశ్‌రెడ్డి వాపోయారు. బాధితుల కథనం ప్రకారం.. నడివాడ గ్రామంలో సర్వే నంబర్ 21లో వేముల రాకేశ్‌రెడ్డి 5.11 ఎకరాలు నూకల విష్ణువర్ధన్‌రెడ్డి వద్ద కొన్నారు. 26వ సర్వే నంబర్‌లో రాకేశ్‌రెడ్డి భార్య నిర్మల 5.20 ఎకరాలు నూకల దేవమ్మ వద్ద 2012లో కొన్నారు. భూరికార్డుల ప్రక్షాళన సందర్భంగా రాకేశ్‌రెడ్డికి చెందిన 21 సర్వే నంబర్‌లో పదిగుంటలు, నిర్మలకు చెందిన 26 వ సర్వే నంబర్‌లో 1.06 ఎకరాలను తక్కువ నమోదుచేశారు. ఇద్దరి పేరిట మొత్తంగా 1.16 ఎకరాల భూమి రికార్డుల్లో తగ్గింది. ఈ విషయంలో మహబూబాబాద్ కలెక్టర్, తాసిల్దార్ కార్యాలయాల్లో ఎన్నిమార్లు దరఖాస్తు చేసుకున్నా అదిగో.. ఇదిగో అంటూ అధికారులు కాలయాపనచేస్తున్నారని బాధితులు వాపోతున్నారు.

బాధితులు వేముల రాకేశ్‌రెడ్డి, నిర్మల

సర్వేచేసి సరిచేస్తాం

నడివాడ గ్రామంలో 21వ సర్వే నంబర్‌లో ఖాస్రాలో 9.21 ఎకరాల భూమి ఉన్నది. కానీ 10.35 ఎకరాలుగా నమోదై 1.14 ఎకరాలు ఎక్కువగా చూపుతున్నది. అందులో రాకేశ్‌రెడ్డి పేర 5.11 ఎకరాలు బదులు.. 5.01 ఎకరాలుగా నమోదై పదిగుంటల భూమి తక్కువగా వచ్చింది. 26 సర్వే నంబర్‌లో 18.07 ఎకరాలు ఉన్నది. కానీ, 19.13 ఎకరాలుగా నమోదైంది. 1.06 ఎకరాలు ఎక్కువగా రికార్డు అయింది. ఈ అదనపు భూమి తగ్గింపు నిర్మల రికార్డుల్లో జరిగింది. నిర్మల పేరున ఇంకా భూమి తక్కువ వస్తున్నది. ఆ విషయం ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్నది. మొత్తం సర్వే జరిపి బాధితులకు న్యాయంచేస్తాం. ప్రస్తుతం పాస్‌పుస్తకాలు లేని మాదాపురం, మల్యాల, ముడుపుగల్లు గ్రామ రైతులకు పాస్‌పుస్తకాలు జారీ చేస్తున్నాం. ఆ కార్యక్రమం పూర్తవగానే ఈ రికార్డులు సరిచేస్తాం.

- రంజిత్‌కుమార్, తాసిల్దార్

మ్యుటేషన్ కోసం ముప్పతిప్పలు

- చెప్పులరిగేలా తిరుగుతున్నా పట్టని అధికారులు
- నారాయణపేట జిల్లా నాచారంవాసి శ్రీకాంత్ ఆవేదన

కోస్గి: లక్షలు వెచ్చించి కొన్న భూమి.. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల తనకు దక్కకుండా పోతున్నదని నారాయణపేట జిల్లా కోస్గి మండలం నాచారం గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఆవేదన వ్యక్తంచేశారు. నాచారం శివారులోని సర్వే నంబర్ 276లోని పుట్ర చెన్నయ్యకు చెందిన 1.06 ఎకరాలు, పుట్ర అంజిలమ్మ వద్ద 2.34 ఎకరాల భూమిని 16 ఏప్రిల్ 2018న శ్రీకాంత్ కొన్నారు. రిజిస్ట్రేషన్ పూర్తయ్యాక మ్యుటేషన్ కోసం కోస్గి రెవెన్యూ కార్యాలయంలో ఏడాదిన్నర కిందట దరఖాస్తు చేసుకొన్నారు. నాటి నుంచి అధికారులు ఈ భూమికి సంబంధించిన అంశం కోర్టు పరిధిలో ఉందంటూ కాలయాపనచేస్తున్నారు. ఇప్పటివరకు నలుగురు తాసిల్దార్లు మారినా తన భూసమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని బాధితుడు ఆవేదన వ్యక్తంచేశారు. కోర్టు స్టే ఇచ్చిన పత్రాలను తనకు చూపించాలని ఎంత వేడుకొన్నా.. ఏ ఒక్క అధికారి చూపించడం లేదని వాపోయారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం చేపట్టిన రైతుబంధు పథకం కింద అందిస్తున్న పంట పెట్టుబడి సాయం తనకు దక్కడం లేదన్నారు. ప్రస్తుతం ఉన్న తాసిల్దార్ రాములు ఒక ప్రొసీడింగ్ ఇచ్చి చేతులు దులుపుకొన్నారని తెలిపారు. ఈ భూమికి సంబంధించిన ఏ ఒక్క వివరాలు ఆన్‌లైన్‌లో కనిపించడం లేదన్నారు. వీఆర్వో ఈశ్వరమ్మ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే తన భూమికి మ్యుటేషన్ చేయాలని బాధితుడు కోరారు.

అన్న భూమి.. తమ్ముడికి కట్టబెట్టేశారు

- మూడేండ్లుగా తిరుగుతున్నా పట్టని రెవెన్యూ అధికారులు
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన ఖమ్మం జిల్లా రైతు నాగేశ్వరరావు

నేలకొండపల్లి: తండ్రి జీవనాధారం కోసం అన్నదమ్ములిద్దరూ కలిసి చెరో అర ఎకరం కేటాయించారు. అ ఎకరం భూమి ద్వారా వచ్చే పంటను తండ్రి జీవనానికి ఉపయోగించేలా పెద్ద మనుషుల మధ్య ఒప్పందంచేసుకొన్నారు. ఈ క్రమంలో అన్న అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని ఆయనకు తెలియకుండా అరెకరం భూమిని తమ్ముడు తన పేరిట మార్చుకొన్నాడు. ఈ విషయం తెలుసుకొన్న అన్న రికార్డుల సవరణ కోసం మూడేండ్లుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నప్పటికీ న్యాయం జరుగడంలేదు. దీంతో ఆ రైతు 'ధర్మగంట'ను ఆశ్రయించారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కోరట్లగూడేనికి చెందిన గుండా వెంకయ్యకు కుమారులు నాగేశ్వరరావు, చంద్రశేఖర్ ఉన్నారు. వెంకయ్య.. ఇద్దరు కుమారులకు తొమ్మిది ఎకరాల చొప్పున భూమిని పంచి ఇచ్చారు. అధికారులు ఇద్దరికీ పాస్‌పుస్తకాలను అందజేశారు. భూమిని పంచే సమయంలో తండ్రి జీవనానికి పెద్దవాడైన నాగేశ్వరరావు 19 గుంటలు, చిన్నవాడైన చంద్రశేఖర్ 20 గుంటల భూమిని కేటాయించారు. ఎకరం భూమికి పట్టాదారులుగా ఇద్దరు కుమారులు ఉన్నప్పటికీ దానిపై వచ్చే పంటను మాత్రం తండ్రికి ఇచ్చేలా ఒప్పందంచేసుకొన్నారు. ఈ ఎకరం భూమిని చిన్న కుమారుడైన చంద్రశేఖర్‌రావు సాగుచేసుకొంటూ తండ్రిని తన వద్దే ఉంచుకొనేవాడు. ఈ క్రమంలో తన అన్న నాగేశ్వరరావుకు తెలియకుండా, అతని పేరిట ఉన్న 19 గుంటల భూమిని చంద్రశేఖర్.. వీఆర్వో సహకారంతో తన పేరిట మార్చుకొన్నాడు. ఈ విషయం తెలుసుకొన్న అన్న 2016 నుంచి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు పెడుతూనే ఉన్నారు. అయినప్పటికీ భూరికార్డుల ప్రక్షాళనతో అన్నకు చెందిన 19 గుంటలను తమ్ముడి పాస్‌పుస్తకంలో ఎక్కించారు. ఇటీవల తండ్రి చనిపోవడంతో నాగేశ్వరరావు తన 19 గుంటల భూమిని సాగుచేసుకోవడానికి ప్రయత్నించగా తమ్ముడు గొడవకు దిగాడు. భూమిని తన పేరిట మార్చాలని బాధితుడు నాగేశ్వరరావు కోరుతున్నప్పటికీ అధికారులు స్పందించడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి న్యాయంచేయాలని బాధిత రైతు కోరుతున్నారు.

బాధితుడు నాగేశ్వరరావు

వారసత్వ భూమి ఒక్కరికే పట్టా

ఖమ్మం జిల్లా కొణిజర్ల బాధితుడు వీరనరసింహాచారి ఆవేదన

కొణిజర్ల: 'నా పేరు రాళ్లబండి వీరనరసింహాచారి. మాది ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం పెద్దమునగాల. వృత్తిరీత్యా కార్పెంటర్‌గా పనిచేస్తూ హైదరాబాద్‌లో ఉంటున్నాను. మా తండ్రి భద్రయ్యకు పెద్దమునగాలలోని సర్వే నంబర్ 13/ఈలో 3.10 ఎకరాల సాగు భూమి, 14 గుంటల మామిడితోట వారసత్వంగా వచ్చింది. మేము ఐదుగురం అన్నదమ్ములం. రామబ్రహ్మం, వీరనరసింహాచారి, పురుషోత్తం, కృష్ణమాచార్యులు, శంకరాచార్యులు. మా తండ్రి 1974లో చనిపోగా, 1990 తర్వాత ఆ భూమిని మా తల్లి మంగమ్మ పేరిట మారింది. అనంతరం అన్నదమ్ములం బతుకుదెరువు కోసం ఊరు విడిచి వెళ్లగా, మా సోదరుడు రామబ్రహ్మం మొత్తం భూమిని తన పేరిట పట్టాచేసుకొన్నాడు. అందులో ఎకరం అనంతోజు రామాచారి అనే వ్యక్తికి విక్రయించి, మరో 2.10 ఎకరాలను తన కుమార్తె తంగెళ్లపల్లి వనిత పేరిట పట్టాచేయించాడు. మామిడితోటనూ విక్రయించాడు. నిబంధనల ప్రకారం వారసత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేయాలన్నా, పాస్‌పుస్తకాలు మంజూరుచేయాలన్నా అన్నదమ్ముల అందరి సంతకాలు అవసరమైనప్పటికీ ఇవేమీ పట్టని అధికారులు.. కాసులకు కక్కుర్తిపడి మొత్తం భూమిని మా అన్నకు రాసేశారు. ప్రస్తుతం మా అమ్మ కూడా చనిపోయారు. మా సోదరులందరికీ న్యాయంచేయాలని అనేకసార్లు తాసిల్దార్‌ను వేడుకొన్నా స్పందించడంలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మాకు భూమిపై హక్కు కల్పించాలని వేడుకొంటున్నాను.'

తెలంగాణ ప్రభుత్వం
ప్రాంతీయ అభికారి కార్యాలయం, పంచాయతీ రాజ్ రీజియన్, నిజామాబాద్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
NIT No: 315 to 337/2019-20 తేది: 27.08.2019
పని పేరు: PR రీజియన్ నిజామాబాద్‌లో నిజామాబాద్ & కామారెడ్డి జిల్లాలలో SCDD-SC కమ్యూనిటీ హాల్ (7) నిర్మాణం మరియు 2BHK గ్రామీణ గృహాలు (16) నిర్మాణం. మొత్తం ECV: రూ. 5267.00 లక్షలు, షెడ్యూలు తేది: 30.08.2019న ఉ. 10.30 గం|| నుండి. ఆన్‌లైన్ దాఖలుకు ఆఖరి తేది: 06.09.2019న మ. 3.00 గం|| వరకు. తదుపరి వివరాలను ఇ-మార్కెట్ ప్లేస్ https://tender.telangana.gov.inలో చూడవచ్చును. ఫోన్: 08462-239502.
సం/- ప్రాంతీయ అభికారి, PR రీజియన్, నిజామాబాద్
DIPR RO. No. 1033-DP/CL/Advt/1/2019-20, Dt: 30/08/2019

తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ
5-10-193, 2వ అంతస్తు, HACA భవన్, పబ్లిక్ గార్డెన్స్ ఎదురుగా, హైదరాబాద్-500004, ఇమెయిల్:tssdcengg@gmail.com
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన
No. SSDC/Engg/Tenders/2019-20, తేది: 30-08-2019
దిగువ పని కోసం తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, హైదరాబాద్ వారు తెలంగాణ ప్రభుత్వ ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం www.tender.telangana.gov.in ద్వారా అర్హతగల బిడ్డర్ల నుండి టెండర్లు కోరుతున్నారు. ప్రదేశం- పని పేరు- అంచనా కాంట్రాక్ట్ విలువ (రూ. లక్షలో): 1) TSSDC లిమిటెడ్, వెంకటాయపాలెం, ఖమ్మం జిల్లా-ప్రీ కాస్ట్ ప్రహరీగోడ నిర్మాణం-రూ.23.74. 2) TSSDC లిమిటెడ్, నందిపహాడ్, నల్గొండ జిల్లా- ప్రీకాస్ట్ ప్రహరీగోడ నిర్మాణం: రూ. 23.74. అర్హతగల టెండరుదారు డాక్యుమెంట్లను 31-8-2019న లేదా ఆ తర్వాత సా. 4.00గం.కు డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
సం/- మేనేజింగ్ డైరెక్టర్
DIPR RO. No. 343-PP/CL/Advt/1/2019-20, Dt: 30/08/2019

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర నీటి సరఫరా మరియు మురుగు నీటి పారుదల మండలి
O/o. చీఫ్ జనరల్ మేనేజర్ (Engg.) ట్రాన్స్‌మిషన్ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-04
ఇ-ప్రొక్యూర్‌మెంట్- టెండరు ప్రకటన

ఇ-టెండరు నం. లు మరియు తేదీ	పని పేరు	శ్రేణి (సుమారు)
e-Tender Notice EP 85/CGM(E)/TC/T1/AFB/2019-20, Dtd: 30.08.2019.	AF బెడ్స్ సెక్షన్, సబ్ డివిజన్-II, O &M డివిజన్ నం. XVII, భోజగుట్ట పరిధిలో ఆసిఫ్‌నగర్ WTP వద్ద కొత్త MS మరియు SS ఛానల్స్‌తో దెబ్బతిన్న టాప్ మరియు బాటమ్ ఛానల్ రిప్లేస్‌మెంట్ మరియు ఆంధ్రా సైట్ కోల్ వినియోగిస్తూ డ్యూయెల్ మీడియాతో ప్యాటర్‌సన్ బెడ్ నంబరు 3,4,5 మరియు 7 యొక్క ఫిల్టర్ మీడియా మార్పుచేయుట.	రూ. 157.711 లక్షలు

బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 31.08.2019న ఉ. 10.30 గం||. టెండరుదార్లు సమాచారాన్ని ప్రధానంగా 'ZIP' ఫార్మాట్‌లో అప్‌లోడ్ చేయవల్సిందిగా కోరబడుచున్నారు. తదుపరి వివరాలను www.eprocurement.gov.inలో చూడవచ్చును.
సం/- చీఫ్ జనరల్ మేనేజర్ (Engg.), ట్రాన్స్‌మిషన్ సర్కిల్, ఖైరతాబాద్, హైదరాబాద్-04.T.S.

భారత ప్రభుత్వం
(రోడ్డు రవాణా మరియు రహదార్ల మంత్రిత్వ శాఖ)
(భారత జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ)
B/1178/2017 తేదీ. 20-08-2019
బహిరంగ ప్రకటన
జాతీయ రహదారి నిర్మాణ నిమిత్తము జరిపిన భూసేకరణకు సంబంధించి నష్ట పరిహారము చెల్లింపు మరియు సేకరించిన భూమి స్వాధీనపరచు విషయము లబ్ధిదారులకు తెలియజేయుట గురించి
సంబంధిత భూ యజమానులకు తెలియజేయునది ఏమనగా ఈ దిగువ కనపరిచిన వార్తా పత్రికలలో ప్రకటించిన బహిరంగ ప్రకటనలో పొందుపరిచిన ఈ క్రింది అంశములను పరిశీలించ వలసినదిగా కోరడమైనది.
1) అవార్డు ప్రకటన
2) 60 దినములలో నష్ట పరిహారము తీసుకొనవలసినదిగా కోరబడిన విషయము
3) దిగువ సంతకము చేసిన అధికారి గారికి సేకరించిన భూమి స్వాధీన పరచవలసినదిగా భూ యజమానులను కోరిన విషయము

క్ర.సం	ప్రచురించిన దినపత్రికల వివరములు	పత్రిక తేదీ
1.	నమస్తే తెలంగాణ తెలుగు దినపత్రిక	27-06-2019
2.	దక్కన్ క్రానికల్ ఆంగ్ల దినపత్రిక	27-06-2019

నిర్ణీత 60 రోజుల సమయము 18-08-2019 తో ముగిసినది.
బ్యాంకు అకౌంటు వివరములు సమర్పించిన భూ యజమానులకు సంబంధించిన నష్ట పరిహారము వారి ఖాతాలో జమచేయబడినది. మిగతా భూ యజమానులకు కోరునది ఏమనగా వారు ఈ కార్యాలయమునకు వచ్చి వారికి సంబంధించిన నష్ట పరిహారము వెంటనే తీసుకోవలసినదిగా కోరడమైనది. వారికి సంబంధించిన నష్ట పరిహారము పంపిణీ నిమిత్తము బ్యాంకులో జమచేయబడినదని బహిరంగ ప్రకటన తేది 11-06-2019 ద్వారా ఇది వరకే తెలియపరచడమైనది. ఇప్పటికైనా నష్ట పరిహారము తీసుకొనని యెడల వారికి నష్ట పరిహారము చెల్లించినట్లుగా భావించబడును.
అందరు సంబంధిత భూ యజమానులు సేకరించబడిన వారి భూమిని వెంటనే ఈ దిగువ సంతకము చేసిన అధికారి గారికి స్వాధీన పరచవలసినదిగా కోరడమైనది. లేని యెడల జాతీయ రహదారి చట్టము 1956 లోని సెక్షన్ (3E)లోని సబ్ సెక్షన్ (2) ప్రకారము పోలీసు సహకారముతో తీసుకోబడును.
(ఎస్.వి.శ్వనాథం)
అధీకృత అధికారి (భూసేకరణ) మరియు రాజస్వ మండలాధికారి వికారాబాద్ డివిజన్

అంతర్‌జిల్లా దొంగలముఠా అరెస్ట్

- మూడు కిలోల వెండి, 33 తులాల బంగారం స్వాధీనం
- ఏడుగురి అరెస్ట్
- ప్రధాన నిందితుడు మైనర్

వివరాలు వెల్లడిస్తున్న కరీంనగర్ సీపీ కమలాసన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం: రెండేండ్లుగా కరీంనగర్, వరంగల్, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల్లో చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగల ముఠాను కరీంనగర్ సీసీఎస్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి సుమారు రూ. 23 లక్షలు విలువైన సొత్తును రికవరీ చేశారు. కరీంనగర్ సీపీ కమలాసన్‌రెడ్డి ఇందుకు సంబంధించిన వివరాలు మీడియాకు వెల్లడించారు. ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా కాకినాడకు చెందిన మైనర్ బాలుడు తాను పనిచేసిన చోట మొబైల్ పోయిందన్న అక్కసుతో హైదరాబాద్‌కు వచ్చి చోరీబాటపట్టాడు. కొన్ని కేసుల్లో పోలీసులకు పట్టుబడి జువైనల్ హోంకు వెళ్లాడు. అక్కడ హుస్నాబాద్‌కు చెందిన మురుమురి రంజిత్ (38), కందారపు సాయివర్మ (19), ఎలువాక సాయిరాం (19), విలాసాగరం రజనీకాంత్ (19), ఎనగందుల నాగరాజు (31), ముల్కనూర్‌కు చెందిన బైరి రాజు (26)తో కలిసి ముఠా ఏర్పాటు చేశాడు. వీరంతా రెండేండ్లుగా తాళం వేసిన ఇండ్లే లక్ష్యంగా చేసుకుని 31 చోట్ల దొంగతనాలకు పాల్పడ్డారు. వచ్చిన డబ్బుతో పర్యాటక ప్రాంతాలను సందర్శించేవారు. వరుస దొంగతనాల కేసులపై ప్రత్యేక దృష్టిపెట్టిన కరీంనగర్ సీసీఎస్ ప్రత్యేక బృందంగా ఏర్పడి ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐ కిరణ్ దర్యాప్తు చేపట్టారు. సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ సిబ్బంది సహకారంతో దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో నిందితులు శుక్రవారం అల్గునూర్ చౌరస్తాలో వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డారు. అదుపులోకి తీసుకొని విచారించగా నేరాలు చేసినట్టు ఒప్పుకున్నారు.

నల్లగొండ జిల్లా దేవరకొండలో శుక్రవారం కేంద్ర మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైపాల్‌రెడ్డి సంస్మరణ సభను నిర్వహించారు. మాజీ హోంమంత్రి నాయిని నరసింహారెడ్డి, ఎమ్మెల్యే రమావత్ రవింద్రకుమార్, ఎమ్మెల్సీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య తదితరులు సంస్మరణ సభకు హాజరై నివాళి అర్పించారు. - దేవరకొండ, నమస్తే తెలంగాణ

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం పాట్నాపూర్‌లోని సిద్ధేశ్వర ఆలయంలో పులాజీబాబా జయంతిని శుక్రవారం అధికారికంగా నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఎమ్మెల్సీ పురాణం సతీశ్, ఆదిలాబాద్ జెడ్పీ చైర్మన్ జనార్దన్ తదితరులు పూలాజీబాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. - జైనూర్

హత్య కేసులో నిందితుడికి పదేండ్ల జైలు

కరీంనగర్ లీగల్: ఒంటరిగా ఉన్న మహిళపై లైంగికదాడికి యత్నించగా, ఆమె ఎదురించడంతో సదరు మహిళ గొంతు నులిమి హత్య చేసిన కేసులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్షతోపాటు రూ. 35వేల జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా సెషన్స్ జడ్జి, మహిళా కోర్టు ఇంచార్జి న్యాయమూర్తి అనుమప చక్రవర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. చింతకాని గ్రామానికి చెందిన చేరాల రాజమ్మ భర్త చనిపోవడంతో కూతురికి వివాహం చేసి కూలీ పని చేస్తూ ఒంటరిగా ఉంటున్నది. ఆమె భర్త సోదరుడైన పోచయ్య 2015 డిసెంబర్ 5న రాత్రి 11 గంటలకు రాజమ్మ ఒంటిరిగా ఉన్న సమయంలో ఆమెపై లైంగికదాడికి యత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో గొంతునులిమి చంపి పారిపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తు అనంతరం సీఐ సదన్‌కుమార్ చార్జ్‌షీట్ దాఖలు చేయగా.. కోర్టు పోచయ్యకు పదేండ్లు జైలుశిక్ష, రూ. 35 వేల జరిమానా విధించింది.

పెంబిలో మెగా వైద్యశిబిరం

పెంబి: నిర్మల్ జిల్లాలోని మారుమూల మండలమైన పెంబిలో శుక్రవారం పోలీసులఆధ్వర్యంలో మెగావైద్య శిబిరం నిర్వహించారు. మండలంలో గిరిజన గ్రామాలైన శేట్‌పల్లి, యాపల్‌గూడ, ఇటిక్యాల్, తాటిగూడ, గుమ్మెన ఎంగ్లాపూర్ గ్రామాలతోపాటు పెంబి, మందపల్లి గ్రామాల నుంచి దాదాపు రెండువేల మందికిపైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. 20 మంది వైద్య నిపుణులు వైద్యసేవలు అందించారు. ఎస్పీ శశిధర్‌రాజు, డీఎంహెచ్‌వో వసంత్‌రావ్ మెగా వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవని సూచించారు. రోగాలు ముందుగానే గుర్తించి సరైన చికిత్స తీసుకోవాలని సూచించారు.

వ్యవసాయాన్ని వ్యాపారంగా చేయాలి

- అప్పుడే రైతుకు ఆదాయం
- ముగిసిన అంతర్జాతీయ వ్యవసాయ, పశుసంవర్ధక సదస్సు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రస్తుతం జీవన విధానంగా ఉన్న వ్యవసాయాన్ని వ్యాపారంగా చేసినప్పుడే రైతుల ఆదాయం పెగుతుందని, వ్యవసాయ రంగంలో మరింత సాంకేతికతను వినియోగించాలని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ దేవీప్రసాద్ జువ్వాడి తెలిపారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వ్యవసాయం, పశుసంవర్ధక రంగాల్లో సమగ్ర అభివృద్ధి, ప్రస్తుత సవాళ్ల పరిష్కారం లక్ష్యంగా జరిగిన అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ముగింపు వేడుకల్లో దేవీప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహిస్తే రైతు పంటకు లాభసాటి ధర అంది ఆదాయం పెరుగుదలకు తోడ్పడుతుందని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ఒక వ్యవసాయ ఆధారిత పరిశ్రమ ఏర్పాటు చేయాల

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం పాలాల అమావాస్య పండుగను వైభవంగా నిర్వహించారు. రైతులు ఉదయమే ఎద్దులకు స్నానాలు చేయించి, వాటిని అలంకరించారు. స్థానిక ఆలయాలకు చేరుకొని ఎద్దులతో ప్రదక్షిణలు చేయించారు. తర్వాత ఇంటికి తీసుకెళ్లి నైవేద్యాలను అందించారు. జిల్లా కేంద్రంలోని అంకుమారాజుల గుడివద్ద నిర్వహించిన వేడుకలో జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.
- ఆసిఫాబాద్, నమస్తే తెలంగాణ

ఎంబీబీఎస్ ఫస్టియర్

ఫలితాలు విడుదల

పోచమ్మమైదాన్ (వరంగల్): కాళోజీ నారాయణరావు హెల్త్‌వర్సిటీ ఎంబీబీఎస్ మొదటి ఏడాది ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. యూనివర్సిటీ అధికారులు శుక్రవారం రాత్రి ఫలితాలు ప్రకటించారు. మొదటి ఏడాది 3362 మంది పరీక్షరాయగా.. వీరిలో 2981 మంది ఉత్తీర్ణులయ్యారు. 88.67 శాతం మంది ఉత్తీర్ణత సాధించగా.. 284 మంది డిస్టింక్షన్, 1484 మంది ఫస్ట్‌క్లాసు, 1213 మంది సెకండ్‌క్లాసులో పాసయ్యారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్‌వి పిచ్చికూతలు

సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఫైర్

జగిత్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్‌వి పిచ్చి కూతలనీ, పీసీసీ చీఫ్ ఉత్తమ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలవి పచ్చి అబద్ధాలని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు. జగిత్యాలలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆశాకిరణం కాళేశ్వరం ప్రాజెక్టు అన్నారు. తెలంగాణ ఒకవైపు అభివృద్ధి

మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కొప్పుల. చిత్రంలో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

వైపు వెళ్తుంటే, కాంగ్రెస్, బీజేపీ తప్పుడు ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రాణహిత, చేవెళ్ల ప్రాజెక్టుపై కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధే లేదని ఆరోపించారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు కేంద్ర జలవనరులశాఖ అనుమతులు ఇవ్వలేదని.. మహారాష్ట్రతో వివాదాలున్నాయనీ, పర్యావరణ, అటవీశాఖ అభ్యంతరాలు చెప్పిందనీ వివరించారు. మీడియా సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జెడ్పీ అధ్యక్షురాలు దావ వసంత, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరంటోళ్ల కన్నెర్ర

ఎంపీ రేవంత్ వ్యాఖ్యలపై భగ్గుమన్న ఉద్యోగులు

తక్షణమే సీఎండీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్

సంచలనాల కోసం మాట్లాడితే సహించబోమని హెచ్చరిక

రాష్ట్రవ్యాప్తంగా మిన్నంటిన ఉద్యోగుల ఆందోళనలు

భారీ ర్యాలీలు, మహాధర్నాలతో నిరసనల హోరు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్: ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుపై ఎంపీ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధలో శుక్రవారం అన్ని యూనియన్ల నేతలంతా ఏకమై భారీర్యాలీ నిర్వహించారు. గ్రేటర్‌తోపాటు, ఎస్పీడీసీఎల్ పరిధిలోని జిల్లాల నుంచి ఉద్యోగులు, కార్మికులు పెద్దఎత్తున తరలివచ్చి ఆందోళనలో పాల్గొన్నారు. విద్యుద్‌సౌధ నుంచి గన్‌పార్క్‌కు సుమారు ఐదువేల మందితో భారీర్యాలీ నిర్వహించారు. అమరవీరుల స్తూపం వద్ద బైఠాయించి రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మింట్ కాంపౌండ్‌లోని అంబేద్కర్‌చౌరస్తాలో బహిరంగసభ నిర్వహించి రేవంత్‌రెడ్డి వ్యవహారశైలిని ఎండగట్టారు. కరంటోళ్లతో పెట్టుకున్నోళ్లంతా కాలగర్భంలో కలిసిపోయారని, విద్యుత్ ఉద్యోగుల మంతా ఏకమయ్యామని.. తమతో పెట్టుకుంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు.

పవర్ కోల్పోతావ్ జాగ్రత్త

పవర్‌తో పెట్టుకుంటే.. పవర్(అధికారం) కోల్పోక తప్పదని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ శివాజీ హెచ్చరించారు. మింట్ కాంపౌండ్ సభలో ఆయన మాట్లాడుతూ రాజకీయం పబ్బం గడుపు కోవడానికి, మీడియాలో సంచలనం కోసం నోటికొచ్చినట్టు మాట్లాడితే తిరుగబడుతామని హెచ్చరించారు. రేవంత్‌పై లోక్‌సభ స్పీకర్‌కు ఫిర్యాదుచేస్తామని చెప్పారు. రేవంత్ పత్రికాముఖంగా వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని జేఏసీ కోఆర్డినేటర్ మేడి రమేశ్, విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అంజయ్య, విద్యుత్ మహిళా అసోసియేషన్ నేత వాణి , విద్యుత్ బీసీ అసోసియేషన్ నేత కుమారస్వామి హితవుపలికారు. సభలో ప్రసంగించినవారిలో తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్నాకర్‌రావు, కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్, టీపీడీఈఏ అధ్యక్షుడు బీసీరెడ్డి, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అధ్యక్షుడు శ్యామనోహర్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ అకౌంట్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, తెలంగాణ బీసీ ఇంజినీర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు సమ్మయ్య, బీసీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్నగౌడ్, ఓసీ అసోసియేషన్ అధ్యక్షుడు భానుప్రకాశ్, విద్యుత్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నెహ్రూ, ఏఈఎస్ అసోసియేషన్ అధ్యక్షుడు వినోద్‌కుమార్, అసిస్టెంట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంజీ, మహిళా ప్రతినిధి తులసీనాగరాణి తదితరులు ఉన్నారు.

దామరచర్లలోని యాదాద్రి పవర్‌ప్లాంటు వద్ద ధర్నా చేస్తున్న విద్యుత్తు ఉద్యోగులు

వరంగల్‌లోని ఎస్పీడీసీఎల్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

వరంగల్‌లో కదం తొక్కిన విద్యుత్ ఉద్యోగులు

ఎంపీ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ వరంగల్‌లో విద్యుత్ ఉద్యోగులు కదంతొక్కారు. చీకట్లో ఉన్న రాష్ట్రానికి వెలుగులు ప్రసాదించిన ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుపై రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్‌భవన్ నుంచి ఏకశిలాపార్కు వరకు నల్లబ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. ఆందోళనకు ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎంపీ సీతారాంనాయక్ సంఘీభావం ప్రకటించారు. సీఎండీ ప్రభాకర్‌రావులపై విమర్శలు చేస్తే సహించబోమని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు హెచ్చరించారు.

నల్లబ్యాడ్జీలతో నిరసనలు

రేవంత్ క్షమాపణ కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం వద్ద మహాధర్నా నిర్వహించారు. పాల్వంచలో కేటీపీఎస్ అంబేద్కర్‌సెంటర్‌లో ఉద్యోగులు నిరసన తెలిపారు. భూపాలపల్లి జిల్లాలోని చెల్పూర్ కేటీపీపీ ఉద్యోగులు, రామగుండం బీ థర్మల్‌కేంద్రం జెన్‌కో ఇంజినీర్లు, ఉద్యోగులు, నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ జెన్‌కో యూనియన్ నాయకులు, ఉద్యోగులు భోజన విరామసమయంలో జెన్‌కో కార్యాలయం ఎదుట, దామరచర్ల యాదాద్రిపవర్‌ప్లాంట్, సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలం వజినేపల్లిలోని పులిచింతల జలవిద్యుత్ కేంద్రం ఆవరణలో 1535 ఇంజినీరింగ్ అసోసియేషన్ యూనియన్ నాయకులు, నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. నిజామాబాద్ జిల్లాలో ఎస్సారెస్పీ జల విద్యుదుత్పత్తి కేంద్రం, జిల్లా కేంద్రంలో విద్యుత్ ప్రధాన కార్యాలయం వద్ద, ఖమ్మం ఎస్పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయంలో, కరీంనగర్ సర్కిల్ కార్యాలయం ఎదుట విద్యుత్ సంఘాల వారు ఆందోళన నిర్వహించారు.

రేవంత్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

విద్యుత్ టెండర్లలో అవకతవకలు జరిగాయని నిరాధారమైన ఆరోపణలుచేస్తూ సీఎం కేసీఆర్, సీఎండీ ప్రభాకర్‌రావు, ఎస్పీడీసీఎల్ ఎండీ రఘుమారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎంపీ రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్‌లోని బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో టీఆర్ఎస్ న్యాయవాదులు ఫిర్యాదుచేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేటీపీఎస్ అంబేద్కర్ సెంటర్‌లో ఉద్యోగులు, కార్మికుల నిరసన

దేవులపల్లి ఓ గొప్ప టెక్నోక్రాట్

- ఓర్వలేకనే విషప్రచారం చేస్తున్నారు: వేణుగోపాలాచారి
- స్థాయికి తగినట్టుగా రేవంత్ ప్రవర్తించాలి: కిషన్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు ఒక గొప్ప టెక్నోక్రాట్ అని ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. గత టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలోనూ విద్యుత్‌రంగ ఉద్యోగిగా ప్రభాకర్‌రావు కీలకంగా పనిచేశారని, ఆయన ఏ పార్టీ కండువా కప్పుకోలేదని స్పష్టం చేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎండీ ప్రభాకర్‌రావుపై కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు.

మాట్లాడుతున్న వేణుగోపాలాచారి. చిత్రంలో లింగంపల్లి కిషన్‌రావు

రేవంత్‌పై నిఘా ఉంచాలి..

రేవంత్‌రెడ్డి ఏ పార్టీలో, ఏ హోదాలో ఉన్నా ఆయనది కుక్కతోక వంకర బుద్ధేనని ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులను చంపుతానంటూ తుపాకీ పట్టుకొని తిరిగిన చరిత్ర రేవంత్‌కు ఉన్నదన్నారు. ఇప్పుడేమో ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావును కాల్చి చంపాలని ప్రకటనలు చేస్తున్నారని, అందుకే రేవంత్‌పై నిఘా ఉంచాలని పోలీసులను కోరారు.

సంగారెడ్డి జిల్లా కొల్లూర్‌లో డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో హౌసింగ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ చిత్రా రామచంద్రన్ తదితరులు

కొల్లూర్‌కు వచ్చి చూస్తారా?

- డబుల్ బెడ్‌రూం ఇండ్ల విషయంలో రాద్ధాంతం తగదు
- ప్రతిపక్షాలకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి హితవు

రామచంద్రాపురం: రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం మానుకోవాలని రోడ్లు భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సూచించారు. కొల్లూర్‌కు వచ్చి నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల టౌన్‌షిప్‌ను పరిశీలించాలని సూచించారు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ గ్రామంలో ప్రభుత్వం నిర్మిస్తున్న డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్ష పార్టీల నాయకులకు నిద్రపట్టడం లేదని ఎద్దేవా చేశారు. పేదల కోసం ఒకేచోట 15,660 ఇండ్లతో అతిపెద్ద టౌన్‌షిప్ నిర్మించడం దేశంలోనే ఇది మొదటిసారని తెలిపారు. కొల్లూర్ డబుల్ బెడ్‌రూం ఇండ్లు దేశానికే ఆదర్శంగా నిలువబోతున్నట్టు చెప్పారు. ఇప్పటికే తొంభైశాతం పనులు జరిగాయని, త్వరలోనే అర్హులైన పేదలకు ఇండ్లను అందజేస్తామని తెలిపారు. మంత్రి వెంట హౌసింగ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ చిత్రారామచంద్రన్ ఉన్నారు.

ఖమ్మంలో భారీ వర్షం

లోతట్టు ప్రాంతాలు జలమయం

భద్రాద్రి, నల్లగొండ, ఆసిఫాబాద్ జిల్లాల్లో ఓ మోస్తరు వాన

నీట మునిగిన హైదరాబాద్‌లోని ఆగమయ్యకుంట

హైదరాబాద్/సిటీబ్యూరో, నమస్తేతెలంగాణ/నెట్‌వర్క్: ఉపరితల ఆవర్తన ప్రభావంతో శుక్రవారం పలుజిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఖమ్మం నగరంలో వర్షం దంచికొట్టగా రోడ్లన్నీ జలమయమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, కుమ్రంభీం ఆసిఫాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మోస్తరు వర్షంపడింది. గ్రేటర్ హైదరాబాద్‌లో గురువారం అర్ధరాత్రి తరువాత, శుక్రవారం సాయంత్రం రెండు విడుతల్లో పలుచోట్ల భారీ వర్షం కురిసింది. వచ్చే నాలుగురోజుల వరకు రాష్ట్రంలోని అనేకప్రాంతాల్లో ఓ మోస్తరు వానలు కురిసే అవకాశమున్నదని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

ఖమ్మంలో..

ఖమ్మం నగరంతోపాటు పలు మండలాల్లో శుక్రవారం సాయంత్రం భారీవర్షం కురిసింది. ఖమ్మంలో జనజీవనం స్తంభించిపోయింది. సాయంత్రంవేళ ఒక్కసారిగా గాలిదుమారంతో కూడిన వర్షం రావడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. నగరంలోని బస్టాండ్ సెంటర్, మయూరీ సెంటర్, డీఆర్‌డీఏ, ఇల్లందు క్రాస్‌రోడ్, కమాన్‌బజార్, కస్బాబజార్‌లో రోడ్లపైకి భారీగా వరద చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. నాలాలు పొంగడంతో త్రీటౌన్ ప్రాంతంలోని పీఎస్‌ఆర్ రోడ్, శివారు కాలనీల్లోకి నీరుచేరింది. ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, చింతకాని, కొణిజర్ల, కామేపల్లి, కారేపల్లి, ఏన్కూర్ తదితర మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. వర్షంతో వాణిజ్య, అపరాల పంటలకు మేలు చేకూరింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలుమండలాల్లో చిరు జల్లుల నుంచి భారీ వర్షం కురిసింది. ఇల్లెందు, టేకులపల్లి మండలాల్లో జల్లులు, కొత్తగూడెం, పాల్వంచ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, మణుగూరు, పినపాక, ఆళ్లపల్లి మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది.

నల్లగొండలో..

నల్లగొండ జిల్లావ్యాప్తంగా వర్షం కురిసింది. మునుగోడులో భారీవర్షం కురవగా పలు మండలాల్లో భారీ నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. కొన్ని మండలాల్లో జల్లులు పడ్డాయి. అత్యధికంగా మునుగోడులో 16.8 మి.మీటర్ల వర్షపాతం నమోదు కాగా జిల్లా సగటు 3.3 మి.మీ. వర్షపాతం రికార్డయింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. వర్షంమెట్ట పంటలకు ఊపిరిపోసింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాలలో అరగంటపాటు వర్షం కురిసింది.

జంపన్న వాగులో కొట్టుకుపోయి యువకుడి మృతి

ఇటీవల కురిసిన వర్షాలకు ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం బానాజీబంధం గ్రామ సమీపంలోని జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. నడుంలోతు వరకు పారుతుండగా శంకర్‌రావు(35) అనే యువకుడు వాగుదాటుతున్న క్రమంలో ఫిట్స్ రావడంతో కొట్టుకుపోయి మృతి చెందాడు.

నాలుగు రోజుల వరకు రాష్ట్రంలో వర్షాలు

నాలుగు రోజుల వరకు రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో మోస్తరు వానలు కురిసే అవకాశమున్నది. ఇంటీరియర్ ఒడిశా దాని పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. కోస్తా తమిళనాడు దాని పరిసర ప్రాంతాల్లో సముద్రమట్టానికి 7.8 కిలోమీటర్ల వరకు ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని ప్రభావంతో తెలంగాణ మీదుగా రుతుపవనాలు బలపడి ముందుకు కదులుతున్నాయి. దీని ప్రభావంతో కొన్నిచోట్ల భారీగా కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లోని కొన్నిచోట్ల భారీ వానలు కురిసే అవకాశమున్నట్టు పేర్కొన్నారు. ఈశాన్య బంగాళాఖాతం దాని పరిసర ప్రాంతాల్లో సెప్టెంబర్ 2న అల్పపీడనం ఏర్పడే అవకాశమున్నట్టు వాతావరణశాఖ అధికారులు అంచనా వేశారు.

ఖమ్మంలో భారీ వర్షం కురవడంతో చెరువును తలపిస్తున్న రోడ్లపై వాహనదారుల ఇబ్బందులు

గ్రేటర్ హైదరాబాద్‌లోనూ..

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో గురువారం అర్ధరాత్రి, శుక్రవారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం సాయంత్రం 5.30 వరకు హయత్‌నగర్‌లో 5.6 సెం.మీ., నాంపల్లిలో ఒక సెంటీమీటర్ వర్షపాతం నమోదైనట్టు వాతావరణకేంద్రం అధికారులు వెల్లడించారు. భారీవర్షానికి మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఆగమయ్యకాలనీ ఆగమైంది. ఎగువ ప్రాంతంలోని వనస్థలిపురం, సుష్మచౌరస్తా, పనామా చౌరస్తా, చింతలకుంటకు నుంచి వరద రావడంతో ఆగమయ్యకాలనీ, హకీమాబాద్‌లను ముంచెత్తింది. రోడ్లపై నడుములోతు వరకు వరద చేరడంతో సాయంత్రం పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఇండ్లకు చేరుకోవడానికి అవస్థలు పడ్డారు. వరదనీటిలో కొట్టుకుపోతున్న బైక్‌ను స్థానికులు కాపాడారు.

గ్రేటర్ హైదరాబాద్‌లోని ఆగమయ్యకాలనీలో వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఇంటికి చేరేందుకు అవస్థ పడుతున్న విద్యార్థులు

అక్కున చేర్చుకుంటే

హతమార్చాడు

కేపీహెచ్‌బీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దారుణహత్య

సతీశ్ (ఫైల్)

హైదర్‌నగర్: అభిమానంతో అక్కున చేర్చుకుంటే.. స్నేహితుడే అంతమొందించాడు. కేపీహెచ్‌బీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌ను దారుణంగా హతమార్చాడు. ఏపీలోని ప్రకాశం జిల్లా మార్టూరుకు చెందిన మైలా సతీశ్‌బాబు(35) కూకట్‌పల్లి మూసాపేటలోని ఆంజనేయనగర్‌లో కుటుంబంతో కలిసి నివాసముంటున్నాడు. కేపీహెచ్‌బీ కాలనీలో ఐటీస్టేట్ కన్సల్టెన్సీ సర్వీసెస్ పేరిట సాఫ్ట్‌వేర్ కంపెనీ నిర్వహిస్తున్నాడు. సతీశ్ కోరుకొండ పాఠశాలలో చదువుతుండగా, అతడికి భీమవరానికి చెందిన హేమంత్‌తో పరిచయమైంది. చదువులు పూర్తయ్యాక ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా ఉద్యోగాల్లో చేరారు. అనంతరం సతీశ్ సొంతంగా కంపెనీ పెట్టాడు. మిత్రుడైన హేమంత్‌కు ఉద్యోగం ఇచ్చి.. కంపెనీలో పార్ట్‌నర్‌గా చేర్చుకున్నాడు. బుధవారం (ఈ నెల 28న) రాత్రి 10 గంటలకు కంపెనీ నుంచి ఇంటికొస్తున్నట్టు కుటుంబసభ్యులకు ఫోన్‌చేసిన చెప్పిన సతీశ్.. ఇంటికిరాకపోగా, ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. హేమంత్‌పై అనుమానం ఉన్నట్టు సతీశ్ భార్య ప్రశాంతి గురువారం పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు కేపీహెచ్‌బీలోని ఏడోఫేజ్‌లో ఉన్న హేమంత్ ఇంటికి వెళ్లి.. తాళాలు పగులగొట్టగా ఇంట్లో సతీశ్ మృతదేహం కనిపించింది. మృతదేహంపై గాయాలున్నట్టు గుర్తించిన పోలీసులు.. పోస్టుమార్టం కోసం గాంధీ దవాఖానకు తరలించారు. హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణమై ఉండొచ్చన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. కొంతకాలంగా కంపెనీ ఆర్థికపరమైన అంశాల్లో స్నేహితుల మధ్య విభేదాలు ఉన్నట్టు సమాచారం. హేమంత్ ఆచూకీకోసం పోలీసులు గాలిస్తున్నారు.

కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గుండి పెద్దచెరువు ఎల్లంపల్లి జలాలతో నిండి మత్తడి దుంకుతున్నది. శుక్రవారం సాయంత్రం గుండి చెరువును సందర్శించిన ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మత్తడివద్ద పసుపు కుంకుమ, పూలతో ప్రత్యేకపూజలు నిర్వహించారు. - రామడుగు

గుండెపోటుతో ఇంటర్ విద్యార్థిని మృతి

పటాన్‌చెరు రూరల్: నారాయణ జూనియర్ కాలేజీలో ఇంటర్ ద్వితీయసంవత్సరం చదువుతున్న విద్యార్థిని గుండెపోటుతో మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా బీడీఎల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకున్నది. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరికి చెందిన కీర్తన(17) రామచంద్రాపురం మండలం వెలిమలలోని నారాయణ జూనియర్ కాలేజీలో ఎంపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటుంది. గురువారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో యాజమాన్యం ఓ ప్రైవేటు దవాఖానకు తీసుకెళ్లింది. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు వచ్చి శుక్రవారం మరో ప్రైవేటు దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మరణించింది.

తెలంగాణలో 'ఉపాధి' భేష్

- ఒడిశా బృందం కితాబు

సిరిసిల్ల రూరల్/ఇల్లంతకుంట: రాష్ట్రంలో ఉపాధిహామీ పథకం పనుల నిర్వహణ అద్భుతంగా ఉన్నదని ఒడిశా రాష్ట్ర అధికారుల బృందం కొనియాడింది. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి, ఇల్లంతకుంట మండలాల్లోని జిల్లెల్ల, సారంపల్లి, బద్దెనపల్లి, బాలమల్లుపల్లె, తిప్పాపూర్, ముస్కానిపేట, రహీంఖాన్ పేట గ్రామాల్లో ఒడిశాకు చెందిన 8 మంది అధికారుల బృందం శుక్రవారం పర్యటించింది. ఆయాగ్రామాల్లో చేపట్టిన ఇంకుడు గుంతలు, నర్సరీ పెంపకాలు, నీటి నిల్వకుంటలు, బోరుబావి రీచార్జి గుంతలు తదితర పనులను పరిశీలించింది.

రాజన్న సిరిసిల్ల జిల్లా సారంపల్లిలో ఒడిశా బృందసభ్యులతో స్థానిక ప్రజాప్రతినిధులు

మన గ్రామీణ మహిళలు.. మంచినీటి వ్యాపారవేత్తలు!

స్వీడన్‌లోని స్టాక్‌హోమ్‌లో వరల్డ్ వాటర్‌వీక్ సందర్భంగా సేఫ్ నెట్‌వర్క్ ఎన్జీవో నివేదిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

తెలంగాణలోని గ్రామీణ మహిళలు మంచినీటి బిందెలను మోసే స్థాయి నుంచి మంచినీటి వ్యాపారవేత్తలుగా రూపాంతరం చెందుతున్నారని సేఫ్ నెట్‌వర్క్ ఎన్జీవో సంస్థ విడుదలచేసిన తాజా నివేదికలో వెల్లడించింది. స్వీడన్‌లోని స్టాక్‌హోమ్‌లో శుక్రవారం జరిగిన వరల్డ్ వాటర్‌వీక్ కార్యక్రమంలో ఈ నివేదికను విడుదల చేశారు. ఈ సందర్భంగా సేఫ్ నెట్‌వర్క్ హెడ్ పూజ సర్వోత్తం మాట్లాడుతూ.. 'ఐజల్' కార్యక్రమాన్ని ఆవిష్కరించడంతో మెదక్ జిల్లాలోని 170 మంది మహిళలు మంచినీటి వ్యాపారవేత్తలుగా మారారని వివరించారు. లక్షన్నర మందికి సులువుగా సురక్షితమైన తాగునీటిని అందిస్తున్నామని, ఈ కార్యక్రమంతో తెలంగాణ, మహారాష్ట్రలో దాదాపు ఐదున్నర లక్షల మందికి సురక్షిత తాగునీరు లభిస్తున్నదని చెప్పారు.

epaper.ntnews.com

సాయి ప్రణీత్‌కు సన్మానం

హైదరాబాద్‌లో శుక్రవారం బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్ కాంస్య పతక విజేత సాయి ప్రణీత్‌ను సన్మానిస్తున్న రాష్ట్ర గవర్నర్ నరసింహన్. చిత్రంలో భారత బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్ తదితరులు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: ఇటీవలి బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకంతో చరిత్ర సృష్టించిన తెలుగు యువ షట్లర్ సాయి ప్రణీత్ ప్రతిభకు గుర్తింపు దక్కింది. అర్జున అవార్డు స్వీకరించి హైదరాబాద్ చేరుకున్న ప్రణీత్‌కు శుక్రవారం సాయంత్రం రాజ్‌భవన్ దర్బార్‌హాల్‌లో ఘనంగా సన్మానం జరిగింది. గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ దంపతులు ప్రణీత్‌కు శాలువా కప్పి జ్ఞాపికతో సత్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ 36 ఏండ్ల తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు కాంస్యం అందించిన ప్రణీత్.. రానున్న ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించాలని ఆకాంక్షించారు. దిగ్గజ షట్లర్ ప్రకాశ్ పదుకొనే స్థాయికి ప్రణీత్ ఎదుగుతాడని గవర్నర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రణీత్‌కు సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన గవర్నర్‌కు కోచ్ పుల్లెల గోపీచంద్ కృతజ్ఞతలు తెలిపారు. టోక్యో ఒలింపిక్స్‌లో పతకం సాధించి రాజ్‌భవన్‌లో సాయి తిరిగి అడుగుపెడుతాడని గోపీ అన్నాడు. ప్రణీత్ మాట్లాడుతూ విశ్వక్రీడల్లో పతకం అందుకుని దేశ ప్రతిష్ఠను నిలబెడుతానన్నాడు. ఈ కార్యక్రమంలో గవర్నర్ సలహాదారులు ఏపీవీఎన్ శర్మ, ఏకే మహంతి, కార్యదర్శి సురేంద్ర మోహన్, సంయుక్త కార్యదర్శి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకాక్ వేదికగా జరిగిన 34వ కింగ్స్ కప్ సెపక్‌తక్రా చాంపియన్‌షిప్‌లో భారత్ విజేతగా నిలిచింది. ఫైనల్లో 21-7, 21-19 తేడాతో చైనీస్ తైపీపై గెలిచిన భారత జట్టుతో జాతీయ సెపక్‌తక్రా అధ్యక్షుడు ఎస్ఆర్ ప్రేమ్‌రాజ్, కార్యదర్శి దహియా తదితరులు

ఆశలన్నీ ఇద్దరి పైనే!

మయాంక్ హాఫ్ సెంచరీ.. నిప్పులు చెరిగిన హోల్డర్, రోచ్

మయాంక్ (55)

పరీక్ష పెడుతున్న పిచ్‌పై యువ ఓపెనర్ మయాంక్ అగర్వాల్ పట్టుదల కనబరిచి శుభారంభాన్నిస్తే.. ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించే బాధ్యత సారథులు భుజానెత్తుకున్నారు. పచ్చికతో కూడిన వికెట్‌పై పేసర్లు విజృంభిస్తున్నా.. కెప్టెన్ కోహ్లీ, వైస్ కెప్టెన్ రహానే ఎలాంటి తడబాటు లేకుండా నిదానంగా ఇన్నింగ్స్‌ను నిర్మించారు. మరోవైపు అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన మహాబలుడు రాకీమ్ కార్న్‌వాల్ తొలి మ్యాచ్‌లోనే ఆకట్టుకున్నాడు. రెండు క్యాచ్‌లు పట్టడంతో పాటు ఓ వికెట్ పడగొట్టి ఔరా అనిపించాడు.

కింగ్‌స్టన్: వెస్టిండీస్ పర్యటనను ఓటమి ఎరుగకుండా ముగించాలనుకుంటున్న భారత్ చివరిదైన రెండో టెస్టులో మెరుగైన స్కోరు దిశగా పయనిస్తున్నది. తొలి టెస్టులో విదేశాల్లోనే అతిపెద్ద విజయం నమోదు చేసుకొని సిరీస్‌లో 1-0తో ముందంజ వేసిన టీమ్‌ఇండియా శుక్రవారం ఇక్కడ ప్రారంభమైన రెండో టెస్టులో టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగింది. ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ మయాంక్ అగర్వాల్ (127 బంతుల్లో 55; 7 ఫోర్లు) అర్ధసెంచరీకి తోడు కెప్టెన్ విరాట్ కోహ్లీ (41) రాణించడంతో కడపటి వార్తలందేసరికి భారత్ 50 ఓవర్లలో 3 వికెట్లకు 136 పరుగులు చేసింది. కెప్టెన్‌తో పాటు వైస్ కెప్టెన్ అజింక్యా రహానే (10) క్రీజులో ఉన్నారు. ప్రత్యర్థి బౌలర్లలో హోల్డర్‌కు 2 వికెట్లు దక్కాయి.

తొలి సెషన్ విండీస్‌దే..

టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన కోహ్లీ సేనకు ఆశించిన ఆరంభం లభించలేదు. రెండు బౌండ్రీలు కొట్టి టచ్‌లో కనిపించిన లోకేశ్ రాహుల్ (13) ఏడో ఓవర్‌లో ఔటయ్యాడు. తొలి వికెట్‌కు 32 పరుగులు జోడించాక హోల్డర్ బంతికి స్లిప్‌లో క్యాచ్ ఇచ్చి పెవిలియన్ బాటపట్టాడు. ఆదుకుంటాడనుకున్న చతేశ్వర్ పుజారా (6) ఉసూరుమనిపించాడు. ఒక ఎండ్‌లో మయాంక్ అగర్వాల్ ఆచితూచి ఆడుతుంటే.. ఖాతా తెరిచేందుకు 16 బంతులు తీసుకున్న పుజారా చివరకు చెత్త షాట్ ఆడి డగౌట్ చేరాడు. ఎదుర్కొన్న 16 బంతికి తొలి పరుగు తీసిన కోహ్లీ.. లంచ్ సమయానికి 30 బంతుల్లో 5 రన్స్ చేశాడు. చాన్నాళ్ల తర్వాత తొలి సెషన్‌లో 30 ఓవర్ల ఆట సాధ్యం కాగా.. భారత్ 72/2తో లంచ్ విరామానికి వెళ్లింది.

మయాంక్ ఫిఫ్టీ

రెండో సెషన్ ఆరంభంలో కోహ్లీ కాస్త దూకుడు పెంచడంతో స్కోరు వేగం పుంజుకుంది. అప్పటివరకు పరుగులు చేసేందుకు ఇబ్బందిపడ్డ కెప్టెన్.. బ్యాట్‌కు పనిచెప్పడం ప్రారంభించాడు. మరో ఎండ్‌లో రోచ్ ఓవర్‌లో రెండు ఫోర్లు కొట్టిన మయాంక్ అగర్వాల్ 117 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. మూడో వికెట్‌కు 69 పరుగులు జోడించి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దుతున్న సమయంలో విండీస్ కెప్టెన్ హోల్డర్ మరోసారి దెబ్బ కొట్టాడు. క్రీజులో కుదురుకున్న మయాంక్‌ను ఔట్ చేశాడు. ఈ దశలో కెప్టెన్ విరాట్ కోహ్లీ, వైస్ కెప్టెన్ అజింక్యా రహానే చక్కటి సమన్వయంతో ఇన్నింగ్స్‌ను నడిపించారు.

స్కోర్లు సంక్షిప్తం: **భారత్ తొలి ఇన్నింగ్స్:** రాహుల్ (సి) కార్న్‌వాల్ (బి) హోల్డర్ 13, మయాంక్ (సి) కార్న్‌వాల్ (బి) హోల్డర్ 55, పుజారా (సి) బ్రూక్స్ (బి) కార్న్‌వాల్ 6, కోహ్లీ (నాటౌట్) 41, రహానే (నాటౌట్) 10, **ఎక్స్‌ట్రాలు:** 11, **మొత్తం:** 50 ఓవర్లలో 136/3. **వికెట్ల పతనం:** 1-32, 2-46, 3-115, **బౌలింగ్:** రోచ్ 11-4-22-0, గాబ్రియల్ 6-0-31-0, హోల్డర్ 14-5-26-2, కార్న్‌వాల్ 16-5-40-1, చేజ్ 3-1-6-0.

విండీస్ మహాబలుడు

కార్న్‌వాల్ (1/40)

ఈ మ్యాచ్‌తో వెస్టిండీస్ తరఫున రాకీమ్ కార్న్‌వాల్ అరంగేట్రం చేశాడు. ఈ సిరీస్‌తో తొలిసారి టెస్టు జట్టుకు ఎంపికైన 26 ఏండ్ల కార్న్‌వాల్‌కు రెండో టెస్టులో బరిలో దిగే అవకాశం దక్కింది. ఆరున్నర అడుగుల ఎత్తు, 140 కేజీల బరువుతో ప్రత్యర్థిని తన ఆకారంతోనే భయపెట్టగల ఈ సింహబలుడు ఆడిన తొలి అంతర్జాతీయ మ్యాచ్‌లోనే తన ఆఫ్‌స్పిన్‌తోనూ ఆకట్టుకున్నాడు. భారత ఇన్నింగ్స్‌లో పడ్డ తొలి మూడు వికెట్లలో కార్న్‌వాల్ హస్తం ఉండటం విశేషం. రాహుల్ ఇచ్చిన సులభతరమైన క్యాచ్‌ను స్లిప్‌లో ఒడిసిపట్టిన ఈ 'జంబో'.. డిఫెన్స్‌కు మారుపేరైన పుజారా వికెట్‌తో టెస్టు ఖాతా తెరిచాడు. రెండో సెషన్‌లో మయాంక్ ఇచ్చిన క్యాచ్‌ను కూడా అతడే అందుకున్నాడు. తొలి టెస్ట్ ఆడిన పేసర్ కమిన్స్ స్థానంలో కార్న్‌వాల్‌కు జట్టులో చోటు దక్కగా.. వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ షై హోప్ గాయపడటంతో అతడి స్థానంలో జామర్ హామిల్టన్ అరంగేట్రం చేశాడు.

ఫారుఖ్ అలీ అస్తమయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి: మాజీ జాతీయ చెస్ చాంపియన్ హైదరాబాదీ ఫారుఖ్ అలీ శుక్రవారం కన్నుమూశారు. చెస్ వర్గాల్లో ఖలీఫాగా పేరొందిన అలీ..బండ్లగూడలోని తన స్వగృహంలో స్వర్గస్తులయ్యారు. 1960-70 దశకాల్లో హైదరాబాద్ చెస్ రంగానికి అలీ ఆయువుపట్టులా నిలిచారు. నసీరుద్దీన్ గాలిబ్, మహ్మద్ హసన్, నవ్రోజ్ వాచాతో కలిసి ఫారుఖ్ అలీ చెస్ క్రీడలో ఏకఛత్రాధిపత్యం వహించారు. ప్రత్యర్థుల ఎత్తులకు అనుగుణంగా దీటుగా స్పందించి వ్యూహాలు రచించడంలో అలీది అందేవేసిన చేయి.

గురి అదిరింది

వర్మకు స్వర్ణం, సౌరభ్‌కు కాంస్యం

రియో డీ జనిరో(బ్రెజిల్): ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ టోర్నీలో భారత షూటర్లు సత్తా చాటారు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో స్టార్ షూటర్ అభిషేక్ వర్మ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా.. సౌరభ్ చౌదరి కాంస్యాన్ని సాధించాడు. శుక్రవారమిక్కడ జరిగిన ఫైనల్లో అభిషేక్ 244.2 పాయింట్లతో అగ్రస్థానంలో నిలువగా.. 221.9 పాయింట్లతో సౌరభ్ మూడోస్థానంతో సరిపెట్టుకున్నాడు. టర్కీకి చెందిన ఇస్మాయిల్ కెలెస్ 243.1పాయింట్లతో రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. మొత్తంగా టోర్నీలో నాలుగు పతకాలతో భారత్ అగ్రస్థానంలో నిలిచింది. స్వర్ణంతో ఎలావెనిల్ వలరివాన్ గురువారమే భారత ఖాతాను తెరువగా.. సంజీవ్ రాజ్‌పుత్ రజతాన్ని గెలిచిన విషయం తెలిసిందే.

సెలక్టర్లకే సమయమిచ్చిన ధోనీ

న్యూఢిల్లీ: మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీని దక్షిణాఫ్రికాతో పరిమిత ఓవర్ల సిరీస్ కోసం ఎంపిక చేయలేదన్న ప్రశ్నే తప్పని.. వచ్చే ఏడాది జరుగనున్న టీ20 ప్రపంచకప్‌నకు జట్టును నిర్మించుకునేందుకు మహీయే తమకు సమయం ఇచ్చాడని సెలక్షన్ కమిటీ సభ్యుడు ఒకరు వెల్లడించాడు. సఫారీలతో సిరీస్‌కు ధోనీని ఎంపిక చేయకపోవడంతో.. కావాలనే మహీని పక్కనపెడుతున్నారనే వార్తలు వినిపించాయి. దీనిపై సెలెక్షన్ కమిటీ సభ్యుడు మాట్లాడుతూ.. 'ధోనీని విస్మరించారన్న ప్రశ్నే ఉత్పన్నం కాదు. పొట్టి ప్రపంచ కప్ (2020) కోసం ప్రణాళికలు రూపొందించుకునేందుకు.. పటిష్ఠమైన జట్టును తయారు చేసేందుకు అతడే మాకు సమయం ఇచ్చాడు. పంత్ గాయపడితే అతడి స్థానాన్ని భర్తీచేసే మరొక ఆటగాడు లేడని ధోనీ కూడా భావిస్తున్నాడు. అందుకే అతడు ఆగిపోయాడు. భవిష్యత్తు ప్రణాళిక గురించి మేము అతడితో చర్చించాల్సి ఉంది. రిజర్వ్ ఆటగాళ్లను సిద్ధం చేసుకునేందుకు అతడు మాకు సమయం ఇచ్చాడు. ఒకవేళ పంత్ గాయపడి టీ20 ప్రపంచకప్ మిస్సయితే అప్పుడు ధోనీ లేకుంటే పరిస్థితి ఏంటన్నది చూడాల్సి ఉంది' అని చెప్పుకొచ్చాడు.

మెరిసిన నాయర్

బెంగళూరు: దులీప్ ట్రోఫీలో కరుణ్ నాయర్ (77 బ్యాటింగ్) జోరు కొనసాగిస్తున్నాడు. గత మ్యాచ్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ భారీ స్కోర్లు చేసిన నాయర్ తాజాగా ఇండియా 'గ్రీన్'తో మ్యాచ్‌లో చక్కటి ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోవడంతో ఇండియా 'రెడ్' శుక్రవారం ఆట ముగిసే సమయానికి 45 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 140 పరుగులు చేసింది. చేతిలో 8 వికెట్లు ఉన్న రెడ్ తొలి ఇన్నింగ్స్‌లో ఇంకా 300 పరుగులు వెనుకబడి ఉంది. నాయర్‌తో పాటు లామ్రర్ (22) క్రీజులో ఉన్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 308/4తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఇండియా 'గ్రీన్' చివరకు 131.3 ఓవర్లలో 440 పరుగులకు ఆలౌటైంది. హైదరాబాద్ రంజీ ఆటగాడు అక్షత్ రెడ్డి (146; 17 ఫోర్లు, 3 సిక్సర్లు) శతకంతో ఆకట్టుకోగా.. సిద్ధేశ్ లాడ్ (64), ప్రియమ్ గార్గ్ (53) హాఫ్ సెంచరీలు చేశారు. రెడ్ బౌలర్లలో అక్షయ్‌కు 5 వికెట్లు దక్కాయి.

యాషెస్ నుంచి ఆండర్సన్ ఔట్

డెర్బీ: మూడో టెస్టులో పోరాడి గెలిచి యాషెస్ సిరీస్ ఆశలను కాపాడుకున్న ఇంగ్లండ్‌కు భారీ షాక్ తగిలింది. గాయం కారణంగా గత రెండు మ్యాచ్‌లు ఆడని ఆ జట్టు స్టార్ పేసర్ జేమ్స్ ఆండర్సన్ మిగిలిన రెండు టెస్టులకు దూరమయ్యాడు. తొలి మ్యాచ్‌లో జేమ్స్ తుదిజట్టులో ఉన్నా.. కేవలం నాలుగు బంతులు మాత్రమే వేసి మైదానాన్ని వీడిన విషయం తెలిసిందే. నాలుగో టెస్టుకు ఎలాగైనా జట్టులోకి రావాలని అండర్సన్ భావించినా ఫిట్‌నెస్ సాధించలేకపోయాడు. మరోవైపు స్టీవ్ స్మిత్ నుంచి గాయం నుంచి కోలుకోవడంతో ఆస్ట్రేలియా ఊపిరి పీల్చుకుంది. రెండో టెస్టులో జోఫ్రా ఆర్చర్ బౌన్సర్‌కు స్మిత్ కుప్పకూలిన విషయం తెలిసిందే. సిరీస్ తొలి మ్యాచ్‌లో ఆసీస్ 251 పరుగుల తేడాతో గెలువగా.. రెండోది డ్రాగా ముగిసింది. మూడో మ్యాచ్‌లో స్టోక్స్ చిరస్మణీయ ఇన్నింగ్స్ కారణంగా ఇంగ్లండ్ సిరీస్‌ను సమం చేయగలిగింది. ఇక నాలుగో టెస్టు ఓల్డ్‌ట్రఫోర్డ్ వేదికగా సెప్టెంబర్ 4న ప్రారంభం కానుంది.

రిచర్డ్స్‌కు అస్వస్థత

వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం సర్ వీవియన్ రిచర్డ్స్ అస్వస్థతకు గురయ్యాడు. భారత్, వెస్టిండీస్ మధ్య టెస్ట్ సిరీస్‌కు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న రిచర్డ్స్ శుక్రవారం మ్యాచ్‌కు ముందు ఒంట్లో నలతగా ఉందని చెప్పాడు. వెంటనే వాలంటీర్ల సహాయంతో స్ట్రెచర్‌పై రిచర్డ్స్‌ను తరలించి ప్రాథమికి చికిత్స అందించారు. తీవ్ర ఉక్కపోత ఉండటంతో ఈ 67 ఏండ్ల కరీబియన్ లెజెండ్ డీహైడ్రేషన్‌కు గురైనట్లు తెలిసింది. ముందస్తు జాగ్రత్తగా దవాఖానకు తరలించగా కోలుకున్న రిచర్డ్స్ రెండో సెషన్‌లో సహచర వ్యాఖ్యాతలతో కలిసిపోయాడు. 'ప్రపంచవ్యాప్తంగా అభిమానులందరికీ మనవి నేను కోలుకున్నాను. కామెంటరీకీ తిరిగి వచ్చాను. ప్రపంచంలో ఏ బౌలర్ నన్ను భయపెట్టలేదు కానీ ఆ పని ప్రకృతి చేసింది. ఏది ఏమైనా మనం ప్రకృతిని గౌరవించాల్సిందే' అని రిచర్డ్స్ అన్నాడు.

భావోద్వేగానికి గురయ్యా

కింగ్‌స్టన్(జమైకా): వెస్టిండీస్‌తో అంటిగ్వా వేదికగా జరిగిన తొలి టెస్టులో అద్భుతంగా బ్యాటింగ్ చేసి టీమ్‌ఇండియా గెలుపులో అంజిక్య రహానే(81, 125) కీలకపాత్ర పోషించిన విషయం తెలిసిందే. అయితే, సుదీర్ఘ ఫార్మాట్‌లో రెండేండ్ల నిరీక్షణ తర్వాత శతకం చేయడంతో ఆ సమయంలో భావోద్వేగానికి గురయ్యాయని రహానే శుక్రవారం చెప్పాడు. 'పదో శతకం నాకు చాలా ప్రత్యేకం. సెంచరీ సంబురాలు ఇలా చేసుకోవాలని అని ఏం ఆలోచించుకోలేదు. అలా బయటికొచ్చేసింది. కాస్త భావోద్వేగానికి లోనయ్యా' అని రహానే చెప్పాడు. తొలి ఇన్నింగ్స్‌లో 25 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయిన స్థితిలో క్రీజులోకి వచ్చినప్పుడు కాస్త ఒత్తిడికి లోనయ్యానని చెప్పాడు. అయితే జట్టు కోసం సత్తా చాటేందుకు ఇదే సమయమని, భారీ భాగస్వామ్యాలను నెలకొల్పాలని నిశ్చయించుకున్నట్టు చెప్పాడు. హనుమ విహారి కూడా అద్భుతంగా ఆడాడని ప్రశంసించాడు.

రహానే

టైటాన్స్‌కు ఆరో ఓటమి

న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో తెలుగు టైటాన్స్ ఆరో ఓటమి మూటగట్టుకుంది. గత నాలుగు మ్యాచ్‌ల్లో చక్కటి ప్రదర్శనతో పరాజయం ఎరుగకుండా ముందుకు సాగుతున్న టైటాన్స్‌కు పుణేరీ పల్టన్ బ్రేకులు వేసింది. శుక్రవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో టైటాన్స్ 27-34తో పుణేరీ పల్టన్ చేతిలో ఓటమి పాలైంది. ట్యాక్లింగ్‌లో సత్తా చాటినా.. కీలక సమయాల్లో రైడర్లు చేతులెత్తేయడంతో తెలుగు జట్టుకు ఓటమి తప్పలేదు. స్టార్ రైడర్ సిద్ధార్థ్ దేశాయ్ 12 రైడ్లలో 7 పాయింట్లు సాధించగా.. ట్యాక్లింగ్‌లో అరుణ్ (6 పాయింట్లు), విశాల్ (5 పాయింట్లు) రాణించారు. పల్టన్స్ తరఫున మన్‌జీత్ (9 పాయింట్లు), నితిన్ తోమర్ (8 పాయింట్లు) ఆకట్టుకున్నారు.

మ్యాచ్ తొలి రెండు నిమిషాల్లోనే టైటాన్స్ 0-5తో వెనుకబడింది. నితిన్ తోమర్‌ను పట్టేందుకు చేసిన ప్రయత్నం విఫలం కావడంతో పాటు సిద్ధార్థ్ దేశాయ్ ప్రత్యర్థి కోర్టులో ఔట్ కావడంతో ప్రత్యర్థికి లీడ్ లభించింది. కాసేపటికి అరుణ్ సూపర్ ట్యాకిల్‌తో పోటీలోకివచ్చిన తెలుగు జట్టు ఒక దశలో 12-8తో ఆధిక్యంలో నిలిచింది. ఇక అక్కడి నుంచి ఇరు జట్లు హోరాహోరీగా పోరాడటంతో హాఫ్‌టైమ్ సమయానికి టైటాన్స్ 14-17తో నిలిచింది. రెండో సగంలో పుణేరీ ప్లేయర్ మన్‌జీత్ ఒకే రైడ్‌లో విశాల్, ఫర్హాద్, అరుణ్‌లను ఔట్ చేయడంతో టైటాన్స్ కోలుకోలేకపోయింది. ఇక అక్కడి నుంచి ఆధిక్యాన్ని కొనసాగించుకుంటూ వచ్చిన పల్టన్ చివరకు 34-27తో మ్యాచ్‌ను తమ ఖాతాలో వేసుకుంది. మరో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 38-35తో పాట్నా పైరేట్స్‌పై గెలిచింది.

'టోక్యోకు అర్హత సాధిస్తుంది'

ముంబై: వచ్చే ఏడాది జరిగే టోక్యో(2020) ఒలింపిక్స్‌కు భారత హాకీ జట్టు అర్హత సాధిస్తుందని మాజీ కెప్టెన్ ధన్‌రాజ్ పిళ్లై అన్నాడు. 'ప్రస్తుతం పటిష్ఠ జట్లుగా కొనసాగుతున్న ఆస్ట్రేలియా, జర్మనీ, హాలెండ్, అర్జెంటీనా, బెల్జియంకు భారత్ దీటైన పోటీ నిచ్చే స్థితిలో ఉంది. డ్రా రూపంలో ఏ జట్టు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొవాలి' అని పిళ్లై అన్నాడు.

అర్జునతో మరింత ప్రేరణ

న్యూఢిల్లీ: క్రికెట్ మైదానంలో దేశం గెలుపు కోసం అత్యుత్తమ ప్రదర్శన చేసేందుకు అర్జున అవార్డు నిరంతరం తనకు మరింత ప్రేరణ కలిగిస్తుందని టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా శుక్రవారం అన్నాడు. తనను పురస్కారంతో గౌరవించిన ప్రభుత్వానికి బీసీసీఐ ట్విట్టర్ ఖాతా వేదికగా కృతజ్ఞతలు తెలిపాడు. తాను ఎప్పుడు ఆడినా టీమ్‌ఇండియా, దేశం ప్రతిష్ఠను పెంచడానికి శాయశక్తులా కృషి చేస్తానని జడేజా చెప్పాడు. ప్రస్తుతం వెస్టిండీస్ పర్యటనలో ఉన్న కారణంగా అవార్డుల ప్రదానోత్సవానికి అతడు గైర్హాజరైన విషయం సంగతి తెలిసిందే. అర్జున అవార్డు సాధించిన జడేజా, మహిళా క్రికెటర్ పూనమ్ యాదవ్‌కు బీసీసీఐ శుభాకాంక్షలు తెలిపింది.

హాలెప్ ఔట్

రెండో రౌండ్‌లోనే నాలుగో సీడ్‌కు షాక్

ప్రిక్వార్టర్స్ చేరిన ఫెదరర్, ప్లిస్కోవా

న్యూయార్క్: వింబుల్డన్ విజేత, నాలుగో సీడ్ సిమోనా హలెప్(రొమేనియా) యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ రెండో రౌండ్‌లోనే కంగుతింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో హలెప్ 6-2, 3-6, 6-7(4-7)తో చివరి దాకా ఉత్కంఠగా సాగిన పోరులో 116వ ర్యాంకు క్రీడాకారిణి టేలర్ టౌన్‌సెండ్(అమెరికా) చేతిలో పరాజయం పాలైంది. 2గంటల 4నిమిషాల పాటు సాగిన ఆ మ్యాచ్‌లో ఇద్దరూ ఒక్క ఏస్ కూడా సంధించలేకపోవడం విశేషం. మూడో రౌండ్ పోటీలో మూడో సీడ్ కరోలినా ప్లిస్కోవా(చెక్‌రిపబ్లిక్) 6-1, 4-6, 6-4 తేడాతో ఓన్స్ జాబెర్(టునీసియా)పై గెలిచి ప్రిక్వార్టర్స్‌కు చేరింది. రెండో రౌండ్ పోటీలో అమెరికా 15ఏళ్ల సంచనలం కోరీ గాఫ్ 6-2, 4-6, 6-4 తేడాతో టిమా బాబోస్(హంగేరీపై) గెలిచి... 32ఏళ్లలో యూఎస్ ఓపెన్ మూడో రౌండ్‌కు చేరిన పిన్నవయస్కురాలిగా రికార్డు సృష్టించింది. ఆరోసీడ్ క్విటోవా(చెక్ రిపబ్లిక్) 4-6, 4-6 తేడాతో అన్‌సీడెడ్ పెట్కోవిక్(జర్మనీ)పై ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది.

ప్రిక్వార్టర్స్‌లో ఫెదరర్

పురుషుల సింగిల్స్ మూడో రౌండ్‌లో స్విస్ దిగ్గజం మూడో సీడ్ రోజర్ ఫెదరర్ 6-2, 6-2, 6-1తేడాతో డేనియల్ ఎవాన్(బ్రిటన్)పై సునాయాసంగా గెలిచి ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశించాడు. గంటా19 నిమిషాల్లోనే ప్రత్యర్థిని చిత్తుచేసి టోర్నీలో తొలిసారి స్థాయికి తగ్గ ప్రదర్శన చేశాడు. ఫెదరర్ మొత్తంగా 10 ఏస్‌లు, 48 విన్నర్లు, 7 బ్రేక్ పాయింట్లతో విజృంభిస్తే.. ఎవాన్ కనీసం ఒక్క ఏస్ కూడా కొట్టలేకపోయాడు. రెండో రౌండ్‌లో ప్రత్యర్థి కొకినాకిస్(ఆస్ట్రేలియా) పోటీ నుంచి వైదొలగడంతో రెండో సీడ్, స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ నేరుగా తదుపరి రౌండ్‌లో ప్రవేశించాడు. ఆరో సీడ్ జ్వెరెవ్(జర్మనీ) 6-3, 3-6, 6-2, 2-6, 6-3 తేడాతో ఫ్రాన్సిన్ టియాఫీ(అమెరికా)పై ఐదు సెట్ల పాటు చెమటోడ్చి విజయం సాధించాడు. 3గంటల 9నిమిషాల పాటు మ్యాచ్ సాగగా, జ్వెరెవ్ ఏకంగా 22ఏస్‌లు, 63 విన్నర్లు సాధించి ఆధిపత్యం చూపాడు.

శరణ్ జోడీ నిష్క్రమణ

యూఎస్ ఓపెన్ పురుషుల డబుల్స్ భారత ఆటగాడు దివీజ్ శరణ్ పోరు ముగిసింది. మోనాకో ఆటగాడు హుగో నిస్‌తో కలిసి బరిలోకి దిగిన శరణ్ 4-6, 4-6తేడాతో కార్బెలాస్ బీనా(స్పెయిన్)-డెల్‌బోనీస్(అర్జెంటీనా) జోడీపై ఓడియాడు. గంటా 12నిమిషాల్లోనే మ్యాచ్ ముగిసింది.

స్టార్టప్‌లకోసం ప్రత్యేక సెల్

న్యూఢిల్లీ, ఆగస్టు 30: యాంజిల్ పన్ను, ఇతర పన్నులకు సంబంధించి స్టార్టప్‌లకు ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించడానికి కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ)..ఐదుగురు సభ్యులతో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేసింది. ఆదాయం పన్ను సీనియర్ అధికారులు నాయకత్వం వహించనున్న ఈ ప్రత్యేక సెల్.. ఆదాయం పన్ను చట్టం 1961 ప్రకారం స్టార్టప్‌లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించనున్నది.

బ్యాంకుల మెగా విలీనం

పీఎన్‌బీలో ఓబీసీ, యునైటెడ్ బ్యాంకుల మెర్జ్ ■ కెనరా బ్యాంక్‌లో సిండికేట్ బ్యాంక్ కలయిక

యూబీఐలో ఆంధ్రాబ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్ ■ ఇండియన్ బ్యాంక్‌లో అలహాబాద్ బ్యాంక్ విలీనం

2017 27 ప్రభుత్వ బ్యాంకుల సంఖ్య → 2019 12

27 నుంచి 12కి తగ్గనున్న ప్రభుత్వ బ్యాంకులు

న్యూఢిల్లీ, ఆగస్టు 30:

బ్యాంకింగ్ రంగంలో మరోమారు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది కేంద్ర ప్రభుత్వం. గతేడాది బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడాలో పలు బ్యాంకులను విలీనం చేసిన కేంద్ర ప్రభుత్వం...ఈసారి ఏకంగా పది బ్యాంకులను విలీనం చేసి నాలుగు అతి పెద్ద బ్యాంకులను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ రంగ బ్యాంకులకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి, బ్యాంకుల ఆర్థిక పరిస్థితులను బలోపేతం చేయడంలో భాగంగా ఈ విలీనం చేస్తున్నట్లు ప్రకటించింది. దేశ ఆర్థిక వృద్ధిరేటు ఆరేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన రోజే బ్యాంకింగ్ రంగంలో భారీ సంస్కరణలు తీసుకోస్తున్నట్లు కేంద్రం ప్రకటించడం విశేషం. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గతవారంలో మూడు ఉద్దీపన ప్యాకేజీలు ఉంటాయని ప్రకటనకు ఈ నిర్ణయం ఆజ్యంపోస్తున్నది. ఆసియాలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కలిగిన భారత వృద్ధిరేటు ఆరేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయిన కొన్ని గంటల ముందు ఈ నిర్ణయం తీసుకోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయంతో బ్యాంకుల సంఖ్య 12కి తగ్గనున్నది. 2017లో 27గా ఉన్నాయి. ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, యునైటెడ్ బ్యాంకులను పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో విలీనం కానుండటంతో దేశంలో రెండో అతిపెద్ద బ్యాంక్‌గా అవతరించనున్నది. విలీనం తర్వాత ఏర్పడనున్న బ్యాంక్ రూ.17.95 లక్షల కోట్ల వ్యాపారంతో 11,437 శాఖలు కలిగివుండనున్నది. ప్రస్తుతం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) రూ.52 లక్షల కోట్లతో తొలి స్థానంలో కొనసాగుతున్నది. వీటితోపాటు కెనరా బ్యాంక్‌లో సిండికేట్ బ్యాంక్ విలీనమవనుండగా, ఆంధ్రాబ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్‌లు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలోనూ, అలహాబాద్ బ్యాంక్-ఇండియన్ బ్యాంక్‌లో కలిపివేయనున్నది.

పది బ్యాంకులకు రూ.52 వేల కోట్ల నిధులు

ఈ పది బ్యాంకులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి రూ.52,250 కోట్ల నిధులను వెచ్చించనున్నట్లు కేంద్రం తాజాగా ప్రకటించింది. మొండి బకాయిలతో సతమతమవుతున్న పీఎస్‌బీలను ఆర్థికంగా ఆదుకోవడంలో భాగంగా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. ఈ విలీనం వల్ల ఉద్యోగులకు ఎలాంటి నష్టంవాటిల్లదని ఆర్థిక కార్యదర్శి రాజీవ్ కుమార్ తెలిపారు. 2017లో ఎస్బీఐలో తన అనుబంధ ఐదు బ్యాంకులను విలీనం చేయగా, ఆ తర్వాతి క్రమంలో దేనా, విజయా బ్యాంకులను బీవోబీలో కలిపివేసింది.

నేడు బ్యాంకు ఉద్యోగుల ఆందోళన

విలీనంపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బ్యాంకు ఉద్యోగులు ఆందోళన బాటపట్టారు. శనివారం దేశవ్యాప్తంగా ఉన్న అన్ని శాఖల ముందు ఆందోళన చేపట్టనున్నట్లు బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(బీఈఎఫ్ఐ) జనరల్ సెక్రటరీ దేబాసిస్ బసు చౌదరీ తెలిపారు. ఈ నిర్ణయం బ్యాంకింగ్ రంగాన్ని నిర్వీర్యం చేయనున్నదని, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్‌కు వ్యతిరేకంగా పోరాడుతామని ఆయన హెచ్చరించారు. ఈ ఆందోళనలో దేశవ్యాప్తంగా ఉన్న తొమ్మిది యూనియన్లకు సంబంధించిన ఉద్యోగులు పాల్గొననున్నారని చెప్పారు. గతంలో విలీనం చేయడంతో ఎన్నో శాఖలు మూతపడ్డాయని, భారీగా ఉద్యోగాలు కోల్పోయారని ఆయన విమర్శించారు.

రూ.7.9 లక్షల కోట్లకు తగ్గిన ఎన్‌పీఏలు

మొండి బకాయిలను తగ్గించుకోవడానికి ప్రభుత్వరంగ బ్యాంకులు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ప్రభుత్వరంగ బ్యాంకుల నిరర్థక ఆస్తులు రూ.7.9 లక్షల కోట్లకు తగ్గాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. డిసెంబర్ 2018 నాటికి ఇవి రూ.8.65 లక్షల కోట్లుగా ఉన్నాయి. నిధుల లభ్యతలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బ్యాంకింగేతర ఆర్థిక సేవలు సంస్థలు, గృహ రుణా కంపెనీల సమస్యలను తీర్చినట్లు చెప్పారు. ఇప్పటికే వీటికోసం రూ.3,300 కోట్ల నిధులను చొప్పించగా, మరో రూ.30 వేల కోట్లు సిద్ధంగా ఉన్నట్లు ఆమె ప్రకటించారు. బ్యాంకింగ్ రంగంలో అనేక సంస్కరణలను చేపడుతున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. రుణాల నిర్వహణలో బ్యాంకుల్లో ప్రభుత్వం జోక్యం చేసుకోబోదని ఆమె స్పష్టంచేశారు. సుపరిపాలన దిశగా బ్యాంకులు తమ సేవలను విస్తృత పరుచుకోవాలని, ముఖ్యంగా ఎన్‌పీఏలను తగ్గించుకోవడానికి పలు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.

కన్నడవాసుల ఆవేదన..

బెంగళూరు, ఆగస్టు 30: ఒకప్పుడు నర్సులు, నన్స్, నట్స్‌కు ప్రసిద్ధి చెందిన దక్షిణ కర్ణాటక, పలు జాతీయ బ్యాంకులకు పుట్టినిల్లు కూడా. ప్రభుత్వ రంగానికి చెందిన కెనరా బ్యాంకు, కార్పొరేషన్ బ్యాంకు, విజయ బ్యాంకు, సిండికేట్ బ్యాంకులు కర్ణాటకు చెందినవే. ఈ బ్యాంకులు ప్రధానంగా ఉడిపి జిల్లా నుంచి ఆవిర్భవించడం మరో విశేషం. 1906 మార్చి 12న దక్షిణ కర్ణాటక జిల్లాలో ఏర్పాటైన తొలి బ్యాంకు 'కార్పొరేషన్ బ్యాంకు'. ప్రముఖ ఆలయ నగరమైన ఉడిపిలో ఖాన్ బహదూర్ హాజీ అబ్దుల్లా హాజి ఖాసిం బహదూర్ సాహెబ్ దీన్ని నెలకొల్పగా 1980లో జాతీయకరణ జరిగింది. 1906 జూలైలో దక్షిణ కర్ణాటకలోని మరో నగరమైన మంగళూరులో అమ్మెంబల్ సుబ్బారావు కెనరా బ్యాంకును ఏర్పాటు చేయగా 1969లో దీన్ని జాతీయం చేశారు. 1925లో ఉడిపికి చెందిన ముగ్గురు సామాజికవేత్తలు ఏర్పాటు చేసిన కెనరా ఇండస్ట్రియల్ అండ్ బ్యాంకింగ్ సిండికేట్ లిమిటెడ్ 1954లో సిండికేట్ బ్యాంకుగా రూపాంతరం చెంది 1969లో జాతీయకరణ చెందింది. 1930 నాటి ఆర్థిక మాంద్యం పరిస్థితుల్లో రైతుల ప్రయోజనం కోసం స్థానిక రైతు ఏబీ శెట్టి విజయా బ్యాంకును ఏర్పాటు చేయగా 1980లో జాతీయకరణ జరిగింది. బ్యాంకుల మెగా విలీనం నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన నాలుగు జాతీయ బ్యాంకులు ఉనికిని కోల్పోవడంపై కన్నడ వాసులు విలవిలలాడుతున్నారు. తమ ఆవేదనను సామాజిక మాధ్యమాల్లో వెళ్లగక్కుతున్నారు. 'కర్ణాటక బ్యాంకు' ప్రైవేటు రంగానికి చెందడంతో మెగా విలీనానికి దూరంగా ఉండడం వారికి ఊరటనిస్తున్నది.

జీడీపీ ధమాల్

- ఆరేండ్ల కనిష్ఠానికి పతనం
- ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 5 శాతంగా నమోదు
- చైనా కంటే దిగజారిన భారత ఆర్థిక వృద్ధిరేటు

న్యూఢిల్లీ, ఆగస్టు 30:

భారత ఆర్థిక వృద్ధిరేటు గణనీయంగా దిగజారింది. దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) ఆరేండ్ల కనిష్ఠానికి పడిపోయింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలోని ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధిరేటు 5 శాతంగా నమోదైంది. తయారీ రంగంలో క్షీణిత, వ్యవసాయ రంగంలో స్తబ్ధత, ప్రైవేటు రంగంలో పెట్టుబడులు మందగించడం, వినియోగదారుల కొనుగోలు శక్తి తగ్గడం వంటి కారణాలతో గతంలో 5.8 శాతంగా ఉన్న జీడీపీ ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 5 శాతానికి దిగజారినట్లు జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్ఎస్వో) శుక్రవారం వెల్లడించింది. తయారీ రంగంలో గ్రాస్ వ్యాల్యూ యాడెడ్ (జీవీఏ) గత ఆర్థిక సంవత్సరంలో 12.1 శాతం ఉండగా ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 0.6 శాతానికి పడిపోయింది. అలాగే వ్యవసాయ రంగంలోని జీవీఏ 5.1 శాతం నుంచి 2 శాతానికి దిగజారింది. నిర్మాణ రంగ జీవీఏ వృద్ధి రేటు కూడా మందగించింది. గతంలో నమోదైన 9.6 శాతం నుంచి 5.7 శాతానికి పడిపోయింది. ఒక్క మైనింగ్ రంగం మాత్రమే ఆశాజనకంగా ఉన్నది. జీవీఏ వృద్ధిరేటు గతంలో నమోదైన 0.4 శాతం నుంచి తాజాగా 2.7 శాతానికి పెరిగింది. 2012-13 ఆర్థిక సంవత్సరంలోని చివరి త్రైమాసకమైన జనవరి-మార్చిలో జీడీపీ అత్యంత కనిష్ఠంగా 4.3 శాతం నమోదైంది. అయితే 2018-19లో ఆర్థిక వృద్ధి 8 శాతంగా ఉన్నది. మరోవైపు దేశ స్థూల జాతీయోత్పత్తి వృద్ధిరేటు తగ్గవచ్చని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఇటీవల పేర్కొన్నది. 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జీడీపీ అంచనాలను 7 నుంచి 6.9 శాతానికి సవరించింది. తొలి అర్ధభాగంలో 5.8 నుంచి 6.6 శాతం మధ్య, ద్వితియార్థంలో 7.3 నుంచి 7.5 శాతం మధ్య జీడీపీ నమోదు కావచ్చని తెలిపింది. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ అన్న ట్యాగ్‌ను భారత్ ఈ ఏడాది కోల్పోయింది. అలాగే చైనా జీడీపీతో పోల్చితే భారత్ మరింత వెనుకబడింది. 2019-20 ఆర్థిక సంవత్సరంలోని తొలి త్రైమాసికమైన ఏప్రిల్-జూన్ మధ్య ఆ దేశ జీడీపీ 6.2 శాతంగా నమోదైంది. కాగా 27 ఏండ్లతో పోల్చితే చైనా జీడీపీలో ఇదే అత్యంత బలహీన సూచి కావడం గమనార్హం.

దారుణమైన స్థితిలో దేశ వృద్ధిరేటు

- **ట్విట్టర్ వేదికగా టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందన**

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రస్తుత పరిస్థితుల్లో దేశ వృద్ధి రేటు దారుణమైన స్థితికి చేరిందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అభిప్రాయపడ్డారు. జాతీయ జీడీపీ తగ్గిన నేపథ్యంలో ఆయన శుక్రవారం ట్విట్టర్ వేదికగా స్పందించారు. 'నేను పెద్ద ఆర్థికవేత్తను కాదు. కానీ, గతంలో 5.8 శాతం ఉన్న జీడీపీ ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 5 శాతానికి పడిపోయింది. గత ఆరేండ్లలో ఇదే అత్యంత అధ్వాన్న ప్రదర్శన. ఒకవేళ ఈ పరిస్థితి ఆర్థిక మాంద్యానికి దారితీయకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం వద్ద పరిష్కార మార్గాలుంటే అది ప్రతీ ఒక్కరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది' అని పేర్కొన్నారు.

దేశీయ, అంతర్జాతీయ కారణాల వల్లే జీడీపీ దిగజారింది: సుబ్రమణియన్

దేశీయ, అంతర్జాతీయ కారణాల వల్ల దేశ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ) దిగజారిందని ప్రధాన ఆర్థిక సలహాదారుడు కేవీ సుబ్రమణియన్ శుక్రవారం తెలిపారు. దేశంతోపాటు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మందగమనంతో జీడీపీ పడిపోయినట్లు ఆయన చెప్పారు. అయితే దేశ ఆర్థిక వృద్ధిని పెంపొందించేందుకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతున్నదని ఆయన వివరించారు.

ఐటీ రిటర్నుల గడువు నేడే

స్పష్టంచేసిన ఆదాయం పన్ను శాఖ

న్యూఢిల్లీ, ఆగస్టు 30: ఆదాయం పన్ను రిటర్నుల దాఖలు గడువును పెంచుతున్నట్లు సోషల్ మీడియాల్లో వచ్చిన వార్తల్ని ఐటీ శాఖ ఖండించింది. అవన్నీ తప్పుడు వార్తలేనని స్పష్టంచేసింది. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను ఐటీ రిటర్నుల గడువు శనివారం వరకే ఉన్నదని స్పష్టంచేసింది. కేంద్ర ప్రభుత్వం ఐటీ రిటర్నుల దాఖలు చేసేందుకు మరింత గడువు ఇచ్చిందని..రిటర్నుల దాఖలు చేసేందుకు మరో నెల రోజులు(సెప్టెంబర్ 30) వరకు పొడిగిస్తూ కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు(సీబీడీటీ) ఉత్తర్వులు జారీ చేసినట్లు సామాజిక మాధ్యమాలైన వాట్సప్, ట్విట్టర్‌లలో వార్త చక్కర్లు కొడుతున్నది. దీంతో అప్రమత్తమైన ఐటీ ..ఇవన్నీ తప్పుడు వార్తలేనని కొట్టిపారేసింది. సాధారణంగా గతేడాదికిగాను సంబంధించి ఐటీ రిటర్నుల సమర్పించడానికి జూలై 31 వరకు ఉండేది..

ఊగిసలాటలో కొనుగోళ్లు

చివరి గంటలో 264 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్.. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లకు డిమాండ్

ముంబై, ఆగస్టు 30: ప్రారంభం నుంచి తీవ్ర ఊగిసలాటలో కొనసాగిన దేశీయ మార్కెట్లు చివరకు లాభాల్లో ముగిశాయి. మందగిస్తున్న వృద్ధిని ఉత్తేజపరుచడానికి కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్లు వచ్చిన వార్తలతో మదుపరులు బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ, మెటల్ రంగాలకు చెందిన షేర్లను కొనుగోలు చేయడానికి ఎగబడడంతో చివరి గంటలో అనూహ్యంగా లాభాల్లోకి మళ్లాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలకు తోడు రూపాయి మరింత బలపడటం మార్కెట్లలో జోష్ పెంచింది. 568 పాయింట్ల స్థాయిలో కదలాడిన సెన్సెక్స్ వారాంతం ట్రేడింగ్ ముగిసే సమయానికి 263.86 పాయింట్ల లాభంతో 37,332.79 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ మరో 74.95 పాయింట్లు అందుకొని 11,023.25కి చేరుకున్నది. ఈ వారం మొత్తానికి సెన్సెక్స్ 631.63 పాయింట్లు (1.72%), నిఫ్టీ 193.90 పాయింట్లు (1.79%) లాభపడ్డాయి. యెస్ బ్యాంక్, సన్ ఫార్మా, ఇండస్ఇండ్ బ్యాంక్, టాటా స్టీల్,

హెచ్‌యూఎల్, వేదాంతా, టాటా మోటర్స్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, బజాజ్ ఆటోల షేర్లు 3.75 శాతం బలపడ్డాయి. ఇదే సమయంలో ఓఎన్‌జీసీ, పవర్ గ్రిడ్, హెచ్‌సీఎల్ టెక్, కొటక్ బ్యాంక్, ఎల్ అండ్ టీ, ఎన్‌టీపీసీ, ఎస్బీఐ, ఏషియన్ పెయింట్స్‌ల షేర్లు రెండు శాతానికి పైగా పతనం చెందాయి. ప్రారంభంలో భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్లు చివరకు లాభాల్లోకి వచ్చాయి..కేంద్రం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్బీఐలు వృద్ధికి ఊతమివ్వడానికి పలు కీలక చర్యలు తీసుకునే అవకాశం ఉన్నదన్న వార్తలు గుప్పుమనడంతో మార్కెట్లలో జోష్ పెంచిందని విశ్లేషకులు వెల్లడించారు. మార్కెట్ ముగిసిన తర్వాత వెలువడిన దేశ వృద్ధిరేటు ఏడేండ్ల కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో సోమవారం మార్కెట్లపై ప్రభావం చూపనున్నదని వెల్లడించారు. రంగాలవారీగా చూస్తే మెటల్, ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్, రియల్టీ, ఫైనాన్స్, టెక్, ఐటీ రంగ షేర్లు 1.77 శాతం వరకు లాభపడగా, విద్యుత్, క్యాపిటల్ బ్యాంక్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగ షేర్లు మదుపరులను ఆకట్టుకోలేకపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌ల సూచీలు లాభాల్లో ముగిశాయి.

రెండువారాల గరిష్ఠానికి రూపాయి

గత కొన్ని రోజులుగా భారీగా పతనాన్ని మూటగట్టుకుంటున్న రూపాయి విలువ ఎట్టకేలకు కోలుకున్నది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌ను విక్రయించడానికి దిగుమతిదారులు, బ్యాంకర్లు మొగ్గుచూపడంతో దేశీయ కరెన్సీకి అనూహ్యంగా మద్దతు లభించింది. దీంతో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 38 పైసలు పెరిగి రెండు వారాల గరిష్ఠ స్థాయి 71.42కి చేరుకున్నది.

15 లక్షల కోట్లు ఫట్

న్యూఢిల్లీ, ఆగస్టు 30: పెట్టుబడిదారులపై సర్చార్జి రూపంలో అధిక ఆదాయం పొందవచ్చని ఆశించిన కేంద్ర ప్రభుత్వానికి చుక్కెదురైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంపన్నవర్గాలపై సర్చార్జి విధించడం ద్వారా రూ.1,400 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలని చూసిన కేంద్రానికి స్టాక్ మార్కెట్ల పతనం రూపంలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జూలై 5 నుంచి ఆగస్టు 23 వరకు మార్కెట్ల భారీ పతనంతో మదుపరులు ఏకంగా రూ.15 లక్షల కోట్ల సంపదను కోల్పోయారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో సంపన్నవర్గాలు, విదేశీ పెట్టుబడిదారులు షేర్ మార్కెట్‌లో పొందే లాభాలపై 7 శాతం సర్చార్జి విధించిన విషయం తెలిసిందే. ఈ నిర్ణయంతో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను అత్యంత వేగంగా ఉపసంహరించుకున్నారు. బడ్జెట్ నాటి నుంచి సుమారు రూ. 2,250 కోట్ల నిధులను ఈక్విటీ మార్కెట్ల నుంచి తరలించుకుపోయారు. ఈ నిర్ణయం రూపాయి పతనాన్ని కూడా శాసించింది. దీంతో రంగంలోకి దిగిన కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టింది. బడ్జెట్‌లో ప్రకటించిన సర్చార్జిని ఎత్తివేస్తున్నట్లు ఈ నెల 23న నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అయితే అప్పటికే జరుగాల్సిన నష్టం జరిగిపోయిందని ఆర్థిక నిపుణులు పెదవి విరుస్తున్నారు.



రికార్డు స్థాయి నుంచి పసిడి వెనక్కి

- రూ.500 తగ్గిన తులం ధర

న్యూఢిల్లీ, ఆగస్టు 30: రికార్డుల మీద రికార్డులు బద్దలు కొడుతున్న బంగారం ధరల స్పీడ్‌కు కాస్త బ్రేక్‌పడింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.500 తగ్గి రూ.39,720 వద్దకు పడిపోయినట్లు ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. అమెరికా-చైనా దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు కొలిక్కి వచ్చే అవకాశం ఉండటంతో పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్లను బంగారం నుంచి ఈక్విటీ మార్కెట్లకు తరలించడంతో ధరలు దిగువముఖం పట్టాయి. గురువారం రూ.250 అధికమై చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.40,220కి చేరుకున్న విషయం తెలిసిందే. బంగారంతోపాటు వెండి మరింత పతనమైంది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల కొనుగోళ్ళకు మొగ్గు

చూపకపోవడంతో కిలో వెండి ధర రూ.450 పతనం చెంది రూ.48,600 వద్దకు జారుకున్నది. ఆభరణాల వర్తకుల నుంచి డిమాండ్ తగ్గుముఖం పట్టడం, విదేశాల్లో అంతంత మాత్రంగానే ఉండటంతో ధరలు దిగువ ముఖం పట్టాయని బంగారం వ్యాపారి ఒకరు వెల్లడించారు. మరోవైపు స్టాక్ మార్కెట్లు పుంజుకోవడం, రూపాయి బలపడటం బంగారం ధరల స్పీడ్‌కు బ్రేక్‌వేసిందని చెప్పారు. న్యూయార్క్ బులియన్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 1,526.80 డాలర్ల వద్ద కొనసాగగా, వెండి 18.52 డాలర్ల వద్ద ఉన్నది.

సీఎం కేసీఆర్‌కు 'ఉజ్వల ప్రస్థానం, బంగారుబాట' పుస్తకాలు అందజేస్తున్న రచయిత గటిక విజయ్‌కుమార్

పుస్తకాలు బాగున్నాయి..అభినందనలు

రచయిత విజయ్‌కు సీఎం కేసీఆర్ ప్రశంసలు

సీఎంకు ఉజ్వల ప్రస్థానం, బంగారుబాట పుస్తకాలు అందజేత

హైదరాబాద్,నమస్తే తెలంగాణ: 'ఉజ్వల ప్రస్థానం', 'బంగారుబాట' పుస్తకాల రచయిత గటిక విజయ్‌కుమార్‌ను ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రగతిభవన్‌లో ప్రత్యేకంగా అభినందించారు. విజయ్‌కుమార్ ఈ పుస్తకాల ప్రతులను శుక్రవారం సీఎం కేసీఆర్‌కు అందించారు. తెలంగాణ చరిత్రకు సంబంధించిన క్రమపద్ధతిని, తెలంగాణ ఉద్యమ ఘట్టాలను, తెలంగాణ రాష్ట్రం వివిధ రంగాల్లో సాధించిన ప్రగతిని 'ఉజ్వల ప్రస్థానం'లో చక్కగా వివరించారని సీఎం పేర్కొన్నారు. 'పుస్తకావిష్కరణ చాలా బాగా జరిగింది. పుస్తకాలు బాగా వచ్చాయి, అభినందనలు' అని సీఎం కేసీఆర్ కొనియాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజయ్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నూతన సీజేగా జేకే మహేశ్వరి

కేంద్రానికి సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కొలీజియం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ జేకే మహేశ్వరి పేరును సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. జస్టిస్ జేకే మహేశ్వరి ప్రస్తుతం మధ్యప్రదేశ్ హైకోర్టులో సీనియర్ న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన సీనియార్టీని పరిగణనలోకి తీసుకున్న కొలీజియం.. ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ బాధ్యతలకు అన్ని విధాలుగా సరిపోతారని కేంద్రానికి సిఫారసు చేసింది. ప్రస్తుతం ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ప్రవీణ్‌కుమార్ కొనసాగుతున్నారు. కొలీజియం సిఫార్సులను కేంద్రం ఆమోదిస్తే జస్టిస్ మహేశ్వరి ఏజీ హైకోర్టు సీజేగా నియామకమవుతారు.

శుక్రవారం అమీర్‌పేట మెట్రో రైల్వేస్టేషన్‌లో తెలంగాణ స్నాక్స్ ఫెస్టివల్‌ను ప్రారంభించిన సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, చిత్రంలో మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, తదితరులు

ఆక్వాలో తొలిస్థానంలో నిలుద్దాం

- ఆక్వా ఉత్పాదక సామర్థ్యాన్ని పూర్తి వినియోగంలోకి తేవాలి
- చేపలతో పౌష్టికాహార లోపానికి పరిష్కారం
- తెలంగాణలో పశుసంవర్ధకం భేషుగ్గా ఉన్నది
- ఆక్వా ఆక్వేరియా ఇండియా ప్రారంభోత్సవంలో ఉప రాష్ట్రపతి వెంకయ్య
- హాజరైన తెలంగాణ మంత్రి తలసాని, ఏపీ మంత్రి మోపిదేవి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఆక్వారంగంలో ఉత్పాదక సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగంలోకి తీసుకురావడం ద్వారా ప్రపంచంలో ఆక్వా ఉత్పత్తుల్లో మన దేశం తొలి స్థానానికి చేరేందుకు కృషిజరుగాలని ఉప రాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. దేశంలో ఉన్న 40 శాతం జలవనరులనే ఆక్వాకల్చర్‌కు వినియోగించుకొంటున్నామని చెప్పారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల అభివృద్ధి సంస్థ (ఎంపీఈడీఏ) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ ఐటెక్స్‌లో ఏర్పాటైన ఆక్వా ఆక్వేరియా ఇండియా-2019 ప్రదర్శనను ప్రారంభించిన అనంతరం ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ.. ఆక్వా ఉత్పాదకతను పెంచేందుకు కూడా ఎంపీఈడీఏ వంటి సంస్థలతోపాటు వివిధ పరిశోధనా సంస్థలు కృషిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఆక్వా రైతుల సంక్షేమం కోసం చర్యలు చేపట్టాలని అన్నారు. దేశంలో ఆహార సమృద్ధి ఉన్నప్పటికీ, ప్రొటీన్ సహిత పోషకాహారంలో సముద్ర ఉత్పత్తులను మించినవి మరొకటిలేవని చెప్పారు. సాంప్రదాయ ఆహారపద్ధతులే సరైనవని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించిన 'ఫిట్ ఇండియా' కార్యక్రమం ఉద్యమంగా మారాలని పిలుపునిచ్చారు. భౌతికంగా ఫిట్‌గా ఉన్నప్పుడే మానసికంగా దృఢంగా ఉంటామని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం పశుసంవర్ధకరంగం అభివృద్ధికి చేపట్టిన చర్యలు అభినందనీయమని ప్రశంసించారు.

ఆక్వా ఆక్వేరియా ఇండియా ప్రదర్శనను తిలకిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, తదితరులు

కేసీఆర్ వల్లనే మత్స్యకారుల్లో సంతోషం

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మత్స్యరంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నందు వల్లనే మత్స్యకార్మికులు సంతోషంగా ఉన్నారని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మత్స్యకారులకు 70-90 శాతం రాయితీతో పరికరాలు సమకూరుస్తున్నామని తెలిపారు గత మూడేండ్లలో 128 కోట్ల చేపపిల్లలు పంపిణీ చేశామని, నాలుగు కోట్లకు పైగా రొయ్య సీడ్‌ను జలాశయాల్లో వదిలినట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆక్వారంగంలో విశేష కృషిచేసిన 10 మంది ఆక్వా రైతులకు ఉప రాష్ట్రపతి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ మంత్రి మోపిదేవి వెంకటరమణ, ఎంపీలు బండా ప్రకాశ్, రంజిత్‌రెడ్డితోపాటు ఎంపీఈడీఏ అధ్యక్షుడు శ్రీనివాస్, సముద్ర ఆహార ఉత్పత్తుల సంఘం అధ్యక్షుడు పద్మనాభం, మత్స్యశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, కమిషనర్ డాక్టర్ సువర్ణ, వివిధ దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వీఆర్ హెడ్‌సెట్‌లో తిలకిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, చిత్రంలో మంత్రి తలసాని

పౌరసరఫరాలకు 'స్కోచ్'ల పంట

ఓపీఎంఎస్, టీ రేషన్ యాప్, టీ వ్యాలెట్‌కు అవార్డులు

హర్షం వ్యక్తంచేసిన కమిషనర్ అకున్ సబర్వాల్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పౌరసరఫరాలశాఖకు స్కోచ్ అవార్డుల పంట పండింది. అత్యాధునిక సమాచార, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవటంలో జాతీయస్థాయి గుర్తింపు లభించింది. రైతులకు, రేషన్ లబ్ధిదారులకు మరింత ప్రయోజనం చేకూరేలా పౌరసరఫరాలశాఖ అమలుచేస్తున్న ఆన్‌లైన్ ప్రొక్యూర్‌మెంట్ మేనేజ్‌మెంట్ సిస్టం (ఓపీఎంఎస్), టీ రేషన్ యాప్, టీ వ్యాలెట్‌ను స్కోచ్ అవార్డులు వరించాయి. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో స్కోచ్ సంస్థ అధిపతి పన్నీర్ కొచ్చర్ నుంచి తెలంగాణ పౌరసరఫరాల సంస్థ జనరల్ మేనేజర్ (మార్కెటింగ్) జీ నాగేందర్‌రెడ్డి మూడు పురస్కారాలను అందుకున్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ.. ధాన్యం కొనుగోలు, కనీస మద్దతు ధర చెల్లింపులకు సంబంధించి ఓపీఎంఎస్ సాఫ్ట్‌వేర్‌ను అందుబాటులోకి తెచ్చింది. సీజన్ ప్రారంభంకాగానే ధాన్యం కొనుగోలు కేంద్రాల సమాచారాన్ని రైతుల సెల్‌ఫోన్లకు అందించే ఏర్పాట్లుచేసింది. ఓపీఎంఎస్ ద్వారా ఈ ఏడాది వానకాలం, యాసంగికి సంబంధించి రూ.13,675 కోట్లను నేరుగా రైతుల ఖాతాలో జమచేసింది. సామాన్యులు సైతం రేషన్ సమాచారం ప్రత్యక్షంగా తెలుసుకొనేలా 13 అప్లికేషన్స్‌తో టీ-రేషన్ మొబైల్ యాప్‌ను రూపొందించింది. సరుకుల సరఫరా నుంచి పంపిణీ వరకు అన్ని వివరాలను ఇందులో పొందుపరిచింది. పౌరసరఫరాల శాఖ.. టీ-వ్యాలెట్ ద్వారా చౌకధర దుకాణాల్లో ప్రజలకు డిజిటల్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. మూడు స్కోచ్ అవార్డులు రావటంపై ఆ శాఖ కమిషనర్ అకున్ సబర్వాల్ హర్షం వ్యక్తంచేశారు.

ఢిల్లీలో స్కోచ్ సంస్థ అధిపతి పన్నీర్ కొచ్చర్ నుంచి అవార్డు అందుకుంటున్న పౌరసరఫరాల సంస్థ జీఎం జీ నాగేందర్‌రెడ్డి

తుదిదశకు బీసీ కమిషన్ ఇంటింటి సర్వే

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని గుర్తింపులేని పలు కులాలను బీసీ జాబితాలో చేర్చే అంశంపై రాష్ట్ర బీసీ కమిషన్ చేస్తున్న అధ్యయనం తుది దశకు చేరింది. ఆయా బీసీ కులాలకు సంబంధించి ఇంటింటి సర్వేపై గణాంకాధికారులకు బీసీ కమిషన్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. బీసీ కమిషన్ కార్యాలయంలో శుక్రవారం అన్ని జిల్లాల గణాంకాధికారులతో బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయగౌడ్, సభ్య కార్యదర్శి అనితారాజేంద్ర, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు. సర్వే చేపట్టే సమయంలో ప్రశ్నావళిని పూరించే అంశాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. బాగోతుల, బైలి కమ్మర, ఏనోటి, గంజికూటివారు, గౌడజెట్టి, గవులి, కాకిపడగల, కుల్లకడిగి, మాసయ్యలు/పటంవారు, ఓడ్, అద్దపువారు, అహీర్ యాదవ్, అరవకోమటి, సారోళ్లు సన్నాయిల, క్షత్రియ రామజోగి, తెరచీరల, తోలుబొమ్మలాట, బొప్పల కులాలకు సంబంధించి సర్వే చేపట్టాలని సూచించింది.

శుక్రవారం గణాంకాధికారులతో సమావేశమైన రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యులు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, ఆంజనేయగౌడ్, సభ్య కార్యదర్శి అనితారాజేంద్ర

విత్తనరంగంలో తెలంగాణ ఆదర్శం

- యూపీ మంత్రి సూర్యప్రతాప్ సాహి ప్రశంసలు
- ఈ స్ఫూర్తితో ఉత్తరప్రదేశ్‌లో విత్తనపార్కు ఏర్పాటుచేస్తామని వెల్లడి
- కాళేశ్వరంతో 40 లక్షల ఎకరాలకు సాగునీరు అభినందనీయం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

విత్తనరంగంలో తెలంగాణ ప్రగతి సాధించి ఆదర్శంగా నిలుస్తున్నదని ఉత్తర్‌ప్రదేశ్ వ్యవసాయశాఖ మంత్రి సూర్యప్రతాప్ సాహి ప్రశంసించారు. తెలంగాణను స్ఫూర్తిగా తీసుకొని యూపీలో కూడా విత్తనపార్క్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ ద్వారా 40 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం ఎంతో గొప్ప విషయమని అభినందించారు. రైతుబంధు పథకం దేశంలో అన్నిరాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న విత్తనపార్కు గురించి అధ్యయనం చేసేందుకు వచ్చిన యూపీ మంత్రి ఆధ్వర్యంలోని బృందం.. శుక్రవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితో భేటీ అయింది. నిరంజన్‌రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని విత్తన ధ్రువీకరణ సంస్థ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నది. అనంతరం యూపీ మంత్రి సూర్యప్రతాప్ సాహి మాట్లాడుతూ.. గత ఏడాది ఓఈసీడీ విత్తన ధ్రువీకరణ గురించి అధ్యయనం చేయడానికి వచ్చామని, తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పథకాలను చూసి టీఆర్ఎస్ ప్రభుత్వమే రెండోసారి కూడా అధికారంలోకి వస్తుందని భావించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ వ్యవసాయరంగం అభివృద్ధికి అన్ని రాష్ట్రాల వ్యవసాయశాఖ మంత్రులు, శాఖ కార్యదర్శులు, డైరెక్టర్లతో యూపీలో ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటుచేయాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం విత్తనరంగ అభివృద్ధికి అన్ని చర్యలు చేపడుతున్నదని, ఇతర రాష్ట్రాలతోపాటు విదేశాలకు కూడా విత్తనాలను అందిస్తున్నదని పేర్కొన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించాలని యూపీ మంత్రిని నిరంజన్‌రెడ్డి కోరారు. త్వరలోనే అన్ని రాష్ట్రాల విత్తన కార్పొరేషన్ అధికారులతో సమావేశం ఏర్పాటుచేయనున్నట్టు వెల్లడించారు. విత్తన పురోగతి ప్రణాళికలు, దాని ఉపయోగాల గురించి విత్తన ధ్రువీకరణ సంస్థ డైరెక్టర్ డాక్టర్ కేశవులు వివరించారు.

శుక్రవారం హైదరాబాద్‌లోని విత్తన ధ్రువీకరణ సంస్థ కార్యాలయంలో మాట్లాడుతున్న యూపీ మంత్రి సూర్యప్రతాప్ సాహి. చిత్రంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి ఉన్నారు.

• మేఘమై నేను వచ్చాను!

కొన్నిరోజులుగా చినుకు జాడ లేక ఉక్కపోతతో ఇబ్బందిపడుతున్నక్రమంలో శుక్రవారం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఓవైపు చిరుజల్లులు, మరోవైపు ఆకాశం మేఘావృతమై ఆహ్లాదాన్ని పంచింది. అగ్నిపర్వతం బద్ధలై లావా ఎగిసిపడ్డట్టుగా మేఘాలు కుమ్ముకున్న దృశ్యం శుక్రవారం మహబూబాబాద్ జిల్లాకేంద్రంలో ఆవిష్కృతమైంది.

- నాళ్కం రఘుపతి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్.

పూర్తికావొచ్చిన సచివాలయ తరలింపు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రస్తుత సచివాలయ తరలింపు పక్రియ దాదాపుగా పూర్తికావొచ్చింది. ఇప్పటికే మెజార్టీశాఖలు సచివాలయం నుంచి ఖాళీచేసి తాత్కాలిక సచివాలయమైన బీఆర్కేభవన్‌కు తరలివెళ్లాయి. మిగిలిన ఒకట్రెండు శాఖల ఫైళ్లు కూడా ప్యాక్‌చేసి తరలించడానికి సిద్ధంచేశారు. సోమవారంనాటికి తరలింపు ప్రక్రియ పూర్తికానున్నది. మంగళవారం నుంచి సచివాలయంలో ఖాళీచేసిన కార్యాలయాలన్నింటికీ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. మరోవైపు ఇప్పటికే బీఆర్కేభవన్‌లో సచివాలయ కార్యాకలాపాలు మొదలయ్యాయి. జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అదర్‌సిన్హా బీఆర్కేభవన్‌లో ఉండి ప్రత్యక్షంగా పరిశీలిస్తూ కార్యాలయాల ఏర్పాట్లను వేగవంతం చేయిస్తున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కేజోషితోపాటు దాదాపు అన్ని శాఖల కార్యదర్శులు ఇక్కడి నుంచే కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. 28న ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కేజోషి బీఆర్కేభవన్‌లోనే ఆడోబ్‌సిస్టమ్స్ ఇండియాలిమిటెడ్ ప్రతినిధులతో భేటీ కూడా అయ్యారు.

ఐటీ నెట్‌వర్క్ తరలింపులో ఆలస్యం!

బీఆర్కేభవన్‌కు ఐటీ నెట్‌వర్క్ తరలింపులో కాస్త ఆలస్యమయ్యే అవకాశం కనిపిస్తున్నది. కీలకమైన ఐటీ నెట్‌వర్క్ తరలింపునకు వరుసగా మూడురోజుల సెలవులు అవసరమని తెలిసింది. పనిదినాల్లో సాంకేతిక ఇబ్బందులు రాకుండా ఉండాలంటే సెలవుదినాల్లోనే తరలింపు మేలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం సచివాలయంలో ఐటీశాఖ ఆధీనంలో లోకల్ ఏరియా నెట్‌వర్క్, సెక్రటేరియట్ ఏరియా నెట్‌వర్క్(స్కాన్), స్టేట్‌వైడ్ ఏరియా నెట్‌వర్క్(స్వాన్) ఉన్నది. ఈ మూడు నెట్‌వర్క్‌లు ఉంటేనే వీడియోకాన్ఫరెన్స్ సహా ఇతర కార్యాకలాపాలన్నీ సాఫీగా సాగుతాయి. వీటికి విస్తృతమైన సామాగ్రి, కేబులింగ్ ఉంటుంది. మొత్తం వ్యవస్థను బీఆర్కేభవన్‌కు తరలించడంతోపాటు తిరిగి పునరుద్ధరించడానికి వారంరోజుల సమయం పడుతుందని అధికారులు తెలిపారు.

తాసిల్దార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాములు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ తాసిల్దార్ల సంఘం (టీజీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎస్ రాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వీ లచ్చిరెడ్డి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవీ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని టీజీటీఏ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో అధ్యక్షునితోపాటు రాష్ట్ర సహఅధ్యక్షులుగా డీ శ్రీనివాస్‌కుమార్, ఆర్పీ జ్యోతి, కోశాధికారిగా శకుంతలను ఎన్నుకున్నట్టు పేర్కొన్నారు.

డైట్, బీఎడ్ కాలేజీల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులను నియమించాలి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ప్రభుత్వ డైట్, బీఎడ్, ఎస్సీఈఆర్టీ తదితర కళాశాలల్లో ఖాళీపోస్టుల్లో అర్హత కలిగిన ప్రభుత్వ ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై నియమించాలని ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముద్దసాని వెంకటరమణారెడ్డి, ఎం వీరాచారి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం పై పోస్టులను లోకల్ క్యాడర్ పోస్టులుగా గుర్తించినందున వాటికి ప్రభుత్వ ఉపాధ్యాయులు మాత్రమే అర్హులని తెలిపారు.

ఎన్ఎండీసీ వార్షిక లాభం 4,642 కోట్లు

- సీఎండీ బైజేంద్రకుమార్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: జాతీయ ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండీసీ) వార్షిక మైనింగ్ సామర్థ్యాన్ని 34 మెట్రిక్ టన్నుల నుంచి 67 మెట్రిక్ టన్నులకు పెంచేందుకు కృషిచేస్తున్నామని సీఎండీ ఎన్ బైజేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఎన్ఎండీసీ వార్షిక సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థతో జాయింట్ వెంచర్‌ను ఏర్పాటుచేసుకుని వచ్చే నాలుగైదేండ్లలో ఏడాదికి 10 మెట్రిక్ టన్నుల ఖనిజ సామర్థ్యాన్ని పెంచుకోనున్నట్టు ధీమా వ్యక్తంచేశారు. ఇందుకోసం ప్రత్యేకంగా మైనింగ్ డెవలపర్‌ను నియమించినట్టు తెలిపారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.4,642 కోట్ల లాభాన్ని ఆర్జించామని, 2019 మార్చి 31 నాటికి సంస్థ నికర విలువ రూ.25,952 కోట్లుగా నమోదయిందని వెల్లడించారు. ఎన్ఎండీసీ విదేశాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యాపార కార్యకలాపాలను నిర్వహిస్తున్నదని సీఎండీ చెప్పారు. టాంజానియా, ఆస్ట్రేలియా, మొజాంబిక్‌లో వివిధ పద్ధతుల్లో మైనింగ్ కార్యకలాపాల్ని చేపడుతున్నామని తెలిపారు. 2018-19లో 32.4 మెట్రిక్ టన్నుల ఇనుమును ఉత్పత్తి చేసిన అతిపెద్ద సంస్థగా నిలిచామని, మర్చంట్ మైనింగ్‌లో ఎన్ఎండీసీ సుమారు 24శాతం వాటా కలిగి ఉన్నదని వెల్లడించారు. ఇది దేశీయ ఉత్పత్తిలో పదిహేను శాతంగా పేర్కొన్నారు. మొత్తానికి, సుస్థిరమైన అభివృద్ధిని అందుకునే దిశగా ముందుకెళుతున్నదన్నారు.

జస్టిస్ సంజయ్‌కుమార్ సాధారణ జడ్జీగా బదిలీ

ఖండించిన బార్ కార్యవర్గం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ హైకోర్టులో రెండో అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సంజయ్‌కుమార్‌ను సర్వీస్‌లో తక్కువస్థాయి జడ్జీగా బదిలీ చేయడంపై వివాదం నెలకొన్నది. ఈ అంశంపై శుక్రవారం సమావేశమైన హైకోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గం.. చీఫ్ జస్టిస్‌గా కాకుండా సాధారణ జడ్జీగా బదిలీ చేయడాన్ని ఖండిస్తూ తీర్మానం చేసింది. జస్టిస్ సంజయ్‌కుమార్‌ను సీజేగా నియమించాల్సి ఉన్నదని పేర్కొన్నది. సెప్టెంబర్ 3న సర్వసభ్య సమావేశంలో చర్చించనున్నట్టు హైకోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గం తెలిపింది.

'పీఆర్టీయూ తెలంగాణ'తో హర్షవర్ధన్‌రెడ్డికి సంబంధం లేదు

సంఘం పేరు దుర్వినియోగం చేసినవారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటాం: అధ్యక్ష, కార్యదర్శులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉపాధ్యాయ వృత్తితో సంబంధం లేకుండా.. ఒక రాజకీయ పార్టీలో బాధ్యతలు నిర్వహిస్తూ 'పీఆర్టీయూ తెలంగాణ' పేరును దుర్వినియోగం చేయాలని చూస్తున్న బీ హర్షవర్ధన్‌రెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారెడ్డి అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చెన్నయ్య తెలిపారు. సంఘంతో హర్షవర్ధన్‌రెడ్డికి సంబంధం లేదని, సంఘంపై చట్టపరమైన హక్కులు తామే కలిగి ఉన్నామని తెలిపారు. సంఘానికి సంబంధించిన జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. సంఘం వ్యవస్థాపకులుగా మాజీ ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి కొనసాగుతున్నారని, సంఘం హక్కులపై న్యాయపోరాటం చేస్తామని ప్రకటించారు.

వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

- హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రోడ్డు భద్రతపై జస్టిస్ రాధాకృష్ణ కమిటీ, కేంద్ర హైవేలు, రోడ్డు రవాణా మంత్రిత్వశాఖ చేసిన మార్గదర్శకాలు అమలుకావడంలేదని 'ది రైట్ సొసైటీ' అనే సంస్థ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యాం దాఖలు చేసింది. వాహనాల్లో వేగ నియంత్రణ పరికరాలు ఏర్పాటుచేయకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పిటిషనర్ తరపు న్యాయవాది పేర్కొన్నారు. దీనిపై పూర్తివివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్‌కు హైకోర్టు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను రెండువారాలపాటు హైకోర్టు వాయిదా వేసింది.

బ్రాహ్మణ పరిషత్ దరఖాస్తులకు 20 వరకు గడువు: కేవీ రమణాచారి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా విద్యార్థులకు ఉపకారవేతనాలు, నిరుద్యోగులకు ఉపాధి కల్పనకు దరఖాస్తుల స్వీకరణ గడువును సెప్టెంబర్ 20 వరకు పొడిగించినట్టు పరిషత్ చైర్మన్ కేవీ రమణాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారుల నుంచి వచ్చిన అభ్యర్థనల మేరకు ఆగస్టు 31తో ముగిసిన దరఖాస్తు గడువును సెప్టెంబర్ 20 వరకు పెంచినట్టు చెప్పారు. వివేకానంద విదేశీ విద్యా పథకం కింద విదేశాల్లో ఉన్నత విద్యకు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు, రామానుజ ఫీరీయింబర్స్‌మెంట్ పథకం కింద తెలంగాణలో వివిధ కోర్సులు చదువుతున్న విద్యార్థులు దరఖాస్తుచేసుకునేందుకు అవకాశం కల్పించినట్టు తెలిపారు. బ్రాహణుల్లో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం కల్పించే ఉద్దేశంతో అమలుచేస్తున్న బెస్ట్ పథకం కింద లబ్ధికి సెప్టెంబర్ 20 వరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా చైర్మన్ సూచించారు.

నమస్తే తెలంగాణ
జిందగీ
శనివారం 31 ఆగస్టు 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

ఈత రావాలంటే కచ్చితంగా నీళ్లలోకి దిగాల్సిందే. అప్పుడే భయం పోతుంది. నీళ్ల లోతు తెలుస్తుంది. ఎలా ఈదాలో అవగాహన వస్తుంది. మరీ.. ఇంగ్లీష్ మాట్లాడడం రావాలంటే? ఈ ప్రశ్నకు కూడా ఈత సూత్రమే వర్తిస్తుందని అంటున్నారు ఆషారాణి టీచర్. పదాల అర్థం తెలిసినా, తెలియకపోయినా.. ముందు ఇంగ్లీష్‌లో మాట్లాడాలి. అప్పుడే భయం పోయి, ఎలా మాట్లాడాలో తెలుస్తుందని చెబుతున్నారు. పిల్లల కోసం పద 'ప్రయోగాలు' చేసి, వారికి అర్థమయ్యేలా చెప్పేందుకు 'పరిశోధనలు' చేసి విజయవంతమయ్యారు ఆషారాణి టీచర్. అందుకే భాషా విభాగంలో తెలుగు రాష్ట్రాల నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు అందుకోబోతున్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయిని!

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇన్నాళ్లూ.. ప్రయోగాలు, పరిశోధనలు చేసిన ఉపాధ్యాయులకే ఇచ్చేవారు. సైన్స్, మ్యాథ్స్, సోషల్ విభాగాల్లోనే అవార్డులు ఎక్కువగా వస్తుండేవి. ఆ ట్రెండ్‌కు బ్రేక్ వేశారు మన ఆషారాణి టీచర్. భాషా విభాగంలో తెలుగు రాష్ట్రాల నుంచి తొలిసారిగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయనిగా ఎంపికయ్యారు. 'ఫలితం ఆశించకుండా అంకితభావంతో పనిచేస్తే.. ఆలస్యంగానైనా ప్రతిఫలం దక్కుతుంది' అనడానికి మన ఆషారాణి టీచర్ ఓ ఉదాహరణ. ఆంగ్లభాష పట్ల పిల్లలకున్న భయాన్ని పోగొడుతూ, వినూత్న పద్ధతిలో విద్యార్థులకు పాఠాలు చెబుతున్నారు. మరోవైపు సామాజిక బాధ్యతతో ఎంతో మంది విద్యార్థులకు సాయమందిస్తున్నారు. ఇలా నిస్వార్థంగా తన విధులు నిర్వర్తిస్తున్నారు కాబట్టే జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కింది. దేశవ్యాప్తంగా ప్రకటించిన 45 మంది ఉత్తమ జాతీయ ఉపాధ్యాయుల్లో ఆషారాణి ఒకరు. సెప్టెంబర్ 5న ఢిల్లీలో రాష్ట్రపతి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారాన్ని అందుకోనున్నారు. తెలంగాణ నుంచి ఆషారాణి టీచర్ ఒక్కరే ఈ యేడాది ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపికయ్యారు.

ఆట పాటలతో బోధన

ప్రభుత్వ పాఠశాల అనగానే చాలామందికి చిన్నచూపు ఉంటుంది. కారణం.. ఇంగ్లిష్ సహా ఇతర సబ్జెక్టులు సరిగా బోధించరని. ఆ అపోహను తొలగిస్తూ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా జీడిమెట్ల ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దారు. ఈ బడిలో ఇంగ్లిష్ చెప్పే ఉపాధ్యాయినిగా ఆషారాణి తనదైన ముద్రవేశారు. ఒక్కమాటలో చెప్పాలంటే 'ఇంగ్లిష్' భయాన్ని పిల్లల మనసుల్లోంచి పారదోలారు. ఇందుకు ఎన్నో ప్రయోగాలు, పరిశోధనలు చేసి సఫలీకృతమయ్యారు. అంత్యాక్షరీ ద్వారా సులువుగా స్పెల్లింగ్స్ నేర్పిస్తారు. apple అనే పదంతో 'a'ఒకరు మొదలు పెడితే.. మరొకరు ఆ పదంలోని చివరి అక్షరం 'e' తో ప్రారంభమయ్యే పదాన్ని చెప్పాల్సి ఉంటుంది. పాఠ్యాంశాలను ఉదాహరణగా తీసుకొని, సంబంధిత కథలోని పాత్రతో విద్యార్థులను పోల్చుతూ, వారికి అర్థమయ్యేలా పాఠాలు చెబుతున్నారు. మైదానంలో పిల్లలకు బంతి విసురుతూ ఒక్కో ఇంగ్లీష్ పదాన్ని నేర్పిస్తున్నారు. ఎవరైనా ఇంగ్లీష్‌లో ప్రశ్నిస్తే.. తిరిగి 'ఎలా సమాధానం ఇవ్వాలి' అనే సందర్భాలను కల్పించి, చిన్న పాత్రలు సృష్టించి విద్యార్థులతో 'రోల్ ప్లే' చేయిస్తూ ఇంగ్లీష్‌లో మాట్లాడించడం వంటివి చేస్తున్నారు. ఇలా వినూత్నంగా పాఠాలు చెప్పడం వల్ల ఆషారాణి టీచర్ చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటున్నారు విద్యార్థులు. ఆమె తరగతి గదిలోని విద్యార్థులంతా ఇంగ్లీష్‌లోనే మాట్లాడుతున్నారు. ఆషారాణి చెప్పే పాఠాలు ఆసక్తిగా ఉండడంతో ఆమె క్లాస్ మిస్ అయ్యే విద్యార్థులే ఉండరంటే అతిశయోక్తి కాదు.

పలు అంశాలపై అవగాహన

విద్యార్థులకు పాఠాలతో పాటు పలు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు ఆషారాణి టీచర్. ముఖ్యంగా విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, రుతుచక్ర సమస్యలపై సలహాలు, సూచనలు ఇస్తున్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వివరిస్తూ వారిని చైతన్య పరుస్తున్నారు. దాతల సహాయంతో స్కూల్‌లో సానిటరీ నాప్‌కిన్ మిషన్‌ను ఏర్పాటు చేయించి, పిల్లల ఆరోగ్య సంరక్షణ కోసం కృషి చేస్తున్నారు ఆషారాణి. 'విద్యార్థి దశలో సరైన బీజాలు పడితేనే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుంది' అని అంటున్నారు. వ్యక్తిత్వ వికాసం–అభివృద్ధి, సామాజిక, రాజకీయ, ఆర్థిక అంశాలపై ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తున్నారు ఆషారాణి. దీంతోపాటు విద్యార్థులు చెప్పుకోలేని సమస్యలు, ప్రశ్నలు పరిష్కరించేందుకు ఓ బాక్సు ఏర్పాటు చేశారు. దానిద్వారా వారి సమస్యలకు పరిష్కారాలు చూపించి, వారికి ఓదార్పునిస్తున్నారు ఆషారాణి టీచర్.

పేద విద్యార్థులకు చేయూత

తరగతిలో తక్కువ మార్కులతో పాసైన విద్యార్థులకు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నారు ఆషారాణి. పదో తరగతి పాసైనా చదువుకోలేని పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఇందుకోసం ఆషారాణి, తోటి ఉపాధ్యాయులతో కలిసి 'పీఎల్ఎన్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ' ని ప్రారంభించారు. దాతల ఆర్థిక ప్రోత్సాహంతో ఈ సొసైటీ ద్వారా ఖరీదైన పుస్తకాలు, వస్తువులు విద్యార్థులకు అందిస్తున్నారు. ఇలా దాతలు, కొన్ని స్వచ్ఛంద సంస్థల సహకారంతో జీడిమెట్ల ప్రభుత్వ పాఠశాలలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో 2 వేలకుపైగా పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. గ్రంథాలయ నిర్వహణ విద్యార్థులే చేపట్టేలా వారికి తర్ఫీదు ఇచ్చారు ఆషారాణి టీచర్.

వాట్సప్ గ్రూపుల్లోనూ బోధన

తెలుగు రాష్ట్రాల నుంచి భాషా విభాగంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయినిగా ఆషారాణి ఎంపికవ్వడం విశేషం. ఉపాధ్యాయ వృత్తిలో ఆషారాణికి 24 యేండ్ల అనుభవం ఉన్నది. ఇంగ్లిష్, పొలిటికల్ సైన్సుల్లో డబుల్ పోస్ట్‌గ్రాడ్యుయేషన్ చేశారు. పుట్టింది శ్రీకాకుళం జిల్లాలో అయినా.. తెలంగాణలో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ఆషారాణి చిన్నప్పుడు ఆంగ్లంలో మాట్లాడాలంటే భయపడేవారు. పరీక్షల్లో మాత్రం వందకు 90 మార్కులు వచ్చేవి. ఇంగ్లీష్ రాయడంలో ముందున్నా, మాట్లాడాలంటే వెనుకాడేవారు. ఇప్పుడు ఆంగ్లభాషలో అనర్గళంగా మాట్లాడడమేకాదు.. పలు వర్క్‌షాపులు నిర్వహిస్తూ ఇతర ఉపాధ్యాయులకు సైతం ఇంగ్లీష్‌లో మాట్లాడడం నేర్పిస్తున్నారు. అంతేకాదు ఇతర పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు వాట్సాప్ గ్రూపుల ద్వారా ఇంగ్లీష్ మాట్లాడడం నేర్పిస్తున్నారు.

నా బాధ్యత పెరిగింది

నాకు గతంలో టీచింగ్ ఎక్స్‌లెన్స్ అండ్ అచీవ్‌మెంట్ (టీఇఏ) ప్రోగ్రాంలో భాగంగా అమెరికా విద్యావ్యవస్థపై పరిశోధన చేసే అవకాశం వచ్చింది. 2017లో ఇండియా నుంచి ఎంపికైన ఇద్దరిలో నేనూ ఉన్నా. అక్కడి విద్యావ్యవస్థ తీరుతెన్నులు తెలుసుకోవడానికి 6 వారాలు అధ్యయనం చేశా. నాకు జాతీయస్థాయిలో అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలలంటే చులకన భావం పోగొట్టాలి. అందుకే సర్కారు బడులను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మార్చే ప్రయత్నం చేస్తున్నా. ఈ జాతీయ అవార్డు నా బాధ్యతను మరింత పెంచింది.

-బి.ఆషారాణి,
జాతీయ ఉత్తమ ఉపాధ్యాయిని

...✍ పసుపులేటి వెంకటేశ్వరరావు
📷 విద్యాసాగర్

శబ్దానికి పాడాలి చరమగీతం!

నగరమేదైనా శబ్దకాలుష్యం మాత్రం సహజం. దీని నివారణకు ఎన్ని చట్టాలున్నా కొందరికి అవగాహన లేదు. ఇలాంటి శబ్దకాలుష్యానికి చరమగీతం పాడాలంటూ వారణాసి నుంచి పుణే వరకు ప్రజలలో అవగాహన కల్పిస్తున్నదో మహిళ.

ముంబైకి చెందిన సుమైరా అబ్దులాలి స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబానికి చెందింది. భారతదేశం అంతటా పట్టిపీడిస్తున్న శబ్దకాలుష్యాన్ని అరికట్టడమే లక్ష్యంగా పెట్టుకుంది సుమైరా. మాజీ చైర్మన్ అయిన సాద్ అలీతో చేరి శబ్దానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్నది. పండుగలప్పుడు శబ్ద కాలుష్యం రెట్టింపవుతుంది. దీంతో 2003లో బీగ్ (బాంబే ఎన్విరాన్‌మెంట్ యాక్షన్ గ్రూప్)తో కలిసి శబ్దకాలుష్య నియమాల అమలుపై మొదటి పిల్ దాఖలు చేసింది. దానివల్ల ఏడాది తర్వాత ప్రభుత్వం కోర్టు, హాస్పిటల్, విద్యాసంస్థలు, ప్రార్థనా స్థలాలకు 100 మీ. పరిధి వరకు లౌడ్‌స్పీకర్లను నిషేధించినట్లు కోర్టు ఆర్డరు వేసింది. దీంతో అనేక నగరాలు నిశ్శబ్ద ప్రాంతాలుగా మారాయి. 2006లో పిల్‌లను దాఖలు చేయడానికి, కోర్టు సందర్శనల్లో మరింత నిర్మాణాత్మకంగా వ్యవహరించడానికి ఆమె ప్రజా ట్రస్ట్ 'ఆవాజ్ ఫౌండేషన్'ను ఏర్పాటు చేసింది. కుటుంబ సభ్యులతో సహా కొంతమంది వలంటీర్లను నియమించి వారణాసి నుంచి బెంగళూరు, పుణే వరకు శబ్ద కాలుష్యం మీద ప్రచారం కొనసాగిస్తున్నది. ప్రస్తుతం సుమైరా సీఎస్ఐఆర్–నేషనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, ఎంపీసీబీలతో కలిసి రాష్ట్రంలోని 27 నగరాల్లో శబ్ద స్థాయిలను గుర్తించడానికి కృషి చేస్తున్నది. దీంతోపాటు ఆవాజ్ ఫౌండేషన్ ద్వారా అక్రమ ఇసుక తవ్వకాలు, సముద్ర కాలుష్యం, చమురు, చెట్ల సంరక్షణకు చురుకుగా పనిచేస్తున్నది.

విద్యుత్ రైస్ కుక్కర్ వాడుతున్నారా?

ఇటీవల ఎక్కువమంది ఎలక్ట్రికల్ రైస్ కుక్కర్‌లోనే అన్నం వండుతున్నారు. ఒకప్పుడు పట్టణంలో ఉన్న ఈ అలవాటు ఇప్పుడు పల్లెలకు కూడా తాకింది. అయితే ఎలక్ట్రికల్ రైస్‌కుక్కర్‌లో వండిన ఆహారం తింటే అనర్థాలు చోటు చేసుకుంటాయని వైద్యులు చెబుతున్నారు.

- వంటల్లో అల్యూమినియం పాత్రలు వాడకపోవడమే మంచిది. ముఖ్యంగా ఎలక్ట్రికల్ రైస్ కుక్కర్‌లో వండిన అన్నం తినడం వల్ల అతి చిన్న వయసులోనే కాళ్లనొప్పులు, కీళ్ల నొప్పులు, నడుం నొప్పి వస్తుందని వైద్యులు చెబుతున్నారు.
- ఎలక్ట్రికల్ రైస్ కుక్కర్ పాత్ర టాక్సిన్ మెటల్‌తో తయారవుతుంది. ఇందులో అన్నం ఉడికించడం వల్ల అందులోని పోషకాలు కనుమరుగవుతాయి. నాన్ స్టిక్ కోటింగ్ ఉన్న రైస్ కుక్కర్లను అస్సలు వాడొద్దని వైద్య నిపుణులు చెడుతున్నారు.
- నాన్ స్టిక్ వస్తువులను వినియోగించి వంట చేసే సమయంలో అందులోంచి ప్రమాదకరమైన కెమికల్స్ విడుదలవుతాయి. ఇవి క్యాన్సర్‌కు దారి తీస్తాయి. సాధ్యమైనంత వరకు ఎలక్ట్రికల్ రైస్ కుక్కర్లను వాడకపోవడం మంచిది.
- రాగి సంకటి, రాగి జావ, జొన్న రొట్టెలు, కొర్రలతో అల్పాహారం చేసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేయాలి. అన్నం త్వరగా వండాలనుకున్నప్పుడు ప్రెజర్ కుక్కర్‌లో వండితే ఆరోగ్యానికి మేలు. కరెంట్ ఆధారంగా ఉడికిన ఆహారం తీసుకోకపోవడమే మంచిది.
- మట్టిపాత్రలు, లేదా స్టీల్ పాత్రల్లో అన్నం ఉడికించుకుని తీసుకోవడం మేలు. మట్టిపాత్రల్లో అన్నం ఉడికించడం వల్ల మట్టిలోని పోషకాలు ఆహారానికి మరింత రుచిని ఇస్తాయి. ప్రెజర్ కుక్కర్‌లో అన్నం ఉడికించడం వల్ల పోషకాలు ఆవిరి రూపంలో కరిగిపోకుండా ఉంటాయి.

సర్పాల సంరక్షకురాలు!

పామును చూస్తే చాలా మంది భయంతో పరుగులు తీస్తారు. లేదా దాని మీద దాడి చేస్తారు. కానీ ఈ అరవై ఏండ్ల విద్యారాజు అలా చేయదు. రక్షణ లేని పాములను చేరదీసి, సంరక్షిస్తున్నది.

అరవై ఏండ్లు వచ్చినా ఆమెకు అలసట అనేది లేదు. పాములను సంరక్షించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నది. ఇప్పటి వరకూ వేల పాములను, సరీసృపాలను రక్షించింది. ఇలా పాములను రక్షించడం వెనుక ఓ కారణం ఉంది. చిన్నప్పుడు ఆమె కండ్ల ముందటే చాలా మంది పాములను చంపడాన్ని చూసింది. ఆమె ఎదుగుతున్న కొద్ది పాముల స్వభావం, పర్యావరణంలో పాముల ఆవశ్యకతను తెలుసుకుంది. అప్పుడే అనుకుంది పాములను రక్షించాలని. కేరళకి చెందిన విద్యారాజు.. 2002లో భర్త ఉద్యోగ రీత్యా గోవా వెళ్లాల్సి వచ్చింది. అక్కడ వరల్డ్ వైల్డ్‌లైఫ్ ఫండ్ ఆర్గనైజేషన్‌లో చేరింది. అక్కడ నుంచి మొదలైన ఆమె ప్రయాణం ఇప్పటి వరకూ కొనసాగుతూనే ఉంది. మళ్లీ కేరళకు తిరిగి వచ్చిన తర్వాత కూడా పాములను సంరక్షించడం ఆపలేదు. దీని కోసం వ్యక్తిగత శిక్షణ తీసుకుంది. అట్లాగే కేరళలో వరదల సమయంలో ఇండ్లలోకి పాములు వచ్చిప్పుడు వాటిని పట్టుకుంది. దానికోసం ఆమె చేసిన సాహసం అంతాఇంతా కాదు. 'నిజానికి పాములు ఎలాంటి హానీ చేయవు, మనుషుల నుంచి వాటికి హానీ ఉందని తెలిస్తేనే తిరగబడతాయి' అని విద్య అంటున్నది.

పొట్టపై చారికలు పోవాలంటే..

డెలివరీ తర్వాత మహిళలకు పెద్ద తలనొప్పి పొట్టపై చారికలు. ఇవి ఒక సారి వచ్చాయంటే దాదాపు పోవు. చర్మం బాగా సాగి మళ్లీ మామూలుగా అయ్యే క్రమంలో పడే ఈ గీతల్ని పోగొట్టుకోవడానికి మహిళలు నానా తంటాలు పడుతుంటారు. ఈ చిన్న చిట్కాలు పాటిస్తే పొట్టపై ఉన్న ఎంతటి స్ట్రెచ్ మార్క్స్ అయినా తొలగిపోతాయి.

- స్ట్రెచ్ మార్క్స్ పోగొట్టడంలో కోడిగుడ్డు మంచి ఎక్స్‌పర్ట్. దీనిలో ఉండే విటమిన్ ఎ, ప్రొటీన్స్, అమైనో యాసిడ్స్ చర్మ కణాల ఏర్పాటులో ముఖ్య పాత్ర పోషిస్తాయి. చర్మాన్ని కాంతివంతం చేస్తాయి. అందుకే మార్క్స్ ఉన్న చోట కోడిగుడ్డు సొనతో తరచూ రుద్దుకుంటూ ఉంటే మంచి ఫలితం ఉంటుంది.
- అలోవెరా జెల్‌లో ఉండే అలోసిన్ కూడా మంచి ఫలితాన్ని ఇస్తుంది. ఈ జెల్‌లో కొద్దిగా ఆలివ్ ఆయిల్ కలిపి రోజూ పడుకోబోయే ముందు రాసుకుంటే కొన్నాళ్లకు సమస్య తీరిపోతుంది. నిమ్మచెక్కతో తరచూ రుద్దుకున్నా మంచిదే..
- ఆలివ్ ఆయిల్, బాదం ఆయిల్ మసాజ్‌లు కూడా స్ట్రెచ్ మార్క్స్‌ని పోగొట్టి, చర్మం ఎప్పటిలాగే అయ్యేందుకు దోహదపడుతాయి. బంగాళాదుంపని బాగా గ్రైండ్ చేసి రసాన్ని తీయాలి. ఈ రసంతో మార్క్స్ ఉన్న చోట బాగా రుద్దాలి. రోజూ ఇలా చేస్తే అతి తక్కువ సమయంలోనే తొలగిపోతాయి.
- పంచదారలో కొంచెం నిమ్మరసం కానీ కాస్తంత బాదం నూనె కానీ కలిపి రుద్దితే మంచి ఫలితం ఉంటుంది. కొద్దిగా రోజ్ వాటర్ తీసుకుని అందులో కాస్తంత తేనె, నిమ్మరసం వేసి కలిపి పొట్టపై వారం రోజులు రోజుకో రెండు నిమిషాలు మసాజ్ చేస్తే మార్క్స్ తొలగిపోతాయి.

చెత్త వస్తువులు ఇవే!

బాత్‌రూమ్‌లోనే కాకుండా ఇంట్లోని పలు ప్రదేశాల్లో కూడా హానికర బ్యాక్టీరియా ఉంటుంది. మనం జాగ్రత్తగా లేకపోతే అది మనలోకి చొరబడే ప్రమాదం ఉంది. ఆపై ఆనారోగ్యాలూ వస్తాయి. ఇంట్లో ఉండే బ్యాక్టీరియాను శుభ్రతతో ఎదుర్కోవచ్చు. దానికోసమే ఈ జాగ్రత్తలు.

- పిల్లలు ఎక్కువగా టాయ్స్‌తో ఆడుకుంటారు. వాటికి దుమ్ము, ధూళి అంటుకుంటుంది. కాబట్టి ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలి. లేందంటే పిల్లలు అనారోగ్యానికి గురవుతారు.
- చాలామంది టూత్‌బ్రష్ హోల్డర్ బాత్రూంలోనే పెట్టుకుంటారు. దీనిలో అనేక క్రిములు చేరుతాయి. దాన్ని శుభ్రం చేయడం ద్వారా అనారోగ్యానికి దూరంగా ఉండొచ్చు.
- బాత్రూం డోర్ దగ్గర మ్యాట్ ఎక్కువ తడిగా ఉంటుంది. ఇది త్వరగా ఆరకపోతే క్రిములు వృద్ధి చెందుతాయి. పూర్తిగా ఆరిన తర్వాత బేకింగ్ సోడా చల్లి 30 నిమిషాల తర్వాత నీటితో శుభ్రరుచాలి.
- టాయిలెట్ కంటే కిచెన్ సింక్‌లోనే ఎక్కువ బాక్టీరియా నివాసముంటుంది. సింక్‌ను ఆలస్యంగా శుభ్రం చేయడం వల్ల క్రిములు విస్తృతంగా వ్యాప్తి చెందుతాయి. కాబట్టి ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి.
- అన్నింకంటే ప్రమాదకరమైంది ఇంట్లోని చెత్తబుట్ట. పాడయిన ఆహారం, ఇతర చెత్తనంతా బుట్టలో పడేస్తుంటారు. మూడు రోజులపాటు అలానే ఉంచడంతో అందులో వేల క్రిములు చేరుతాయి. దీన్ని ముట్టుకున్న ప్రతీసారి చేతులు శుభ్రంగా కడుక్కోవాలి.
- సెల్‌ఫోన్ విషయానికి వస్తే ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఎక్కడబడితే అక్కడ పడేస్తారు. చేతులు ఎలా ఉన్నా పట్టుకుంటారు.ఆఫోన్ పట్టుకొని చేతులను నోట్లో పెట్టుకుంటుంటారు. సాల్మొనెల్లా వంటి బ్యాక్టీరియా సెల్‌ఫోన్‌లో చేరుతుంది. కాబట్టి పిల్లలకు మొబైల్‌ను వీలైనంత దూరంగా ఉంచాలి.

రారండోయ్.. ఫామ్ ప్లాట్లను చూద్దాం

సొంతంగా ఓ ఫామ్ హౌజ్ కొనుక్కోవాలని చాలామందికి ఉంటుంది. కాకపోతే, నిర్వహణ కష్టమని వెనకడుగు వేస్తారు. ఇలాంటి వారందరిని దృష్టిలో పెట్టుకుని, జనప్రియ ఇంజినీర్స్ కొత్తగా 'అర్బన్ ఫామ్స్'కు శ్రీకారం చుట్టింది.

ప్రాజెక్టు పరిచయం

హైదరాబాద్‌లో అందుబాటు గృహాలకు సరికొత్త నిర్వచనం చెప్పిన జనప్రియ ఇంజినీర్స్.. తాజాగా ఫామ్ కమ్యూనిటీని ప్రారంభించింది. సుమారు 36 ఎకరాల కమ్యూనిటీలో నాలుగు రకాల ప్లాట్లను విక్రయిస్తున్నది. ఒక్కో ప్లాటు అర ఎకరం నుంచి ఎకరం విస్తీర్ణంలో డిజైన్ చేశారు. కుటుంబంతో కలిసి వారాంతాల్లో సరదాగా గడపాలన్నా.. ఇంటి సభ్యులతో కలిసి ఆహ్లాదంగా గడపాలని భావించే వారికిది చక్కగా నప్పుతుందని జనప్రియ సంస్థ చెబుతోంది. పరిగి- మన్నెగూడ రోడ్డులో ఫామ్ కమ్యూనిటీని అభివృద్ధి చేస్తోంది. టీఎస్‌పీఏ జంక్షన్ నుంచి అరవై నిమిషాలు ప్రయాణిస్తే చాలు.. అర్బన్ ఫామ్స్‌కు చేరుకోవచ్చు. ఇందులో ప్లాటు కొనుక్కునేవారికి రెండేండ్ల పాటు నిర్వహణ కూడా ఉచితంగానే చేస్తామని సంస్థ చెబుతున్నది. ఒక్కో ప్లాటు ధర రూ.45 లక్షల నుంచి ఆరంభమవుతున్నదని జనప్రియ అంటున్నది. పైగా, అర్బన్ ఫామ్ కమ్యూనిటీలో గెస్ట్ హౌజుతో పాటు స్విమ్మింగ్ పూల్, పార్టీ డెక్, అతి పెద్ద లాన్లు వంటివి సంస్థ అభివృద్ధి చేసింది.

● జనప్రియ అర్బన్ ఫామ్స్‌కు సులువుగా రాకపోకల్ని సాగించొచ్చు. మీరు ఎప్పుడు కావాలంటే అప్పుడు ఇందులోని గెస్ట్ హౌసును బుక్ చేసుకోవచ్చు. పైగా, ఫామ్ స్థలం ఉండటం వల్ల కలిగే ప్రయోజనం గురించి అందరికీ తెలిసిందే. వ్యవసాయం ద్వారా వచ్చే ఆదాయం మీద ఎలాంటి పన్ను కట్టక్కర్లేదు. కొంత కాలం తర్వాత ప్లాటును విక్రయించినా, క్యాపిటల్ గెయిన్లు కట్టాల్సిన అవసరం లేదు. ఇందులో ఫామ్ ప్లాటు కొన్న ఎనిమిది నెలల తర్వాత అందులో సదుపాయాల్ని అభివృద్ధి చేసిస్తామని జనప్రియ చెబుతున్నది. ఇందులో ప్లాటు కొన్నవారు ఎంచక్కా మామిడి పండ్లను ఆస్వాదించొచ్చు. ఇందులో పార్టీ డెక్‌తో 20 మీటర్ల స్విమ్మింగ్ పూల్‌ను అభివృద్ధి చేస్తున్నారు. పైగా, బీచ్ వాలీబాల్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు.

పంచాయతీ ప్లాట్ల క్రమబద్ధీకరణ?

పంచాయతీ ప్లాట్లను కొనుక్కుని మోసపోయేవారి సంఖ్య తక్కువేం కాదు. కొన్నేండ్ల నుంచి ఈ అక్రమ తంతు యథేచ్ఛగా జరుగుతూనే ఉంది. అయినప్పటికీ, రియల్టర్లు అక్రమ లేఅవుట్లు వేస్తూనే ఉన్నారు. అందులో కొన్నవారు మోసపోతూనే ఉన్నారు. మరి, ఈ అక్రమ తంతుకు చరమగీతం పాడే అవకాశమే లేదా?



ధర తక్కువని.. ఏదో ఒకటుంటే చాలని.. ఇప్పుడు కాకున్నా, భవిష్యత్తులో అయినా ఉపయోగపడుతుందని.. చాలామంది పంచాయతీ ప్లాట్లను కొంటుంటారు. కొన్ని ఆర్థిక సంస్థలు అలాంటి వాటికి రుణాల్ని కూడా మంజూరు చేస్తున్నాయి. అందుకే, వెనకా ముందు చూడకుండా అధిక శాతం మంది మధ్యతరగతి ప్రజానీకం వాటిని కొనుగోలు చేసి దారుణంగా మోసపోతున్నారు. ఇలాంటి వాటిలో ప్లాటు కొంటే, ఇల్లు కట్టుకోవడానికి అనుమతి కూడా లభించదు. ఒకవేళ, అడ్డదారుల్లో ఇల్లు కట్టుకున్నా.. విద్యుత్తు, మంచి నీరు, డ్రైనేజీ వంటి కనెక్షన్లు మంజూరు చేయరు. అది కూడా అక్రమ మార్గాల్లో తెచ్చుకున్నా ప్రశాంతంగా నిద్రపోలేరు. కారణం, అది అక్రమ కట్టడం కావడమే. స్థానిక సంస్థల అధికారులు ఎప్పుడొచ్చి కూలగొడతారో తెలియదు. ఒకవేళ అదే జరిగితే, అప్పటివరకూ ఆనందంగా ఉన్న కుటుంబమంతా చెల్లాచెదురవ్వక తప్పదు. మరి, అలాంటి ఇబ్బందులు కొని తెచ్చుకోకూడదంటే.. పంచాయతీ లేఅవుట్లలో ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయకూడదు. లేకపోతే, అదిలాబాద్ జిల్లాలో జరిగిందే మీకూ ఎదురు కావొచ్చు.

ఎలా క్రమబద్ధీకరిస్తారు?

- డీటీసీపీ నుంచి అనుమతి లేకుండా పంచాయతీ లేఅవుట్ వేసి, అభివృద్ధి పనులన్నీ చేసిన రియల్టర్ల సంఖ్య తక్కువేం కాదు. ఇలాంటి లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేసుకోవాలంటే.. ఆయా భూమి విలువలో పదిరెట్లు మొత్తాన్ని పంచాయతీకి చెల్లిస్తే క్రమబద్ధీకరణ చేస్తారు.
- కొందరు రియల్టర్లు లేఅవుట్లు వేశాక, అందులో అభివృద్ధి పనులు చేయకుండా వదిలేస్తుంటారు. నిజానికి, రియల్టర్లు వెంచర్‌లో ప్రాథమిక సౌకర్యాలన్నీ ఏర్పాటు చేయాలి. అందులో అమ్ముడు కాని ప్లాట్ల నుంచి స్థలం తీసుకుని మౌలిక సదుపాయాల్ని కల్పించాలి. ఒకవేళ, స్థలం లేకపోతే ఆయా భూమి విలువలో పదిరెట్లు సొమ్మును గ్రామ పంచాయతీకి చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవాలి.
- స్థానిక సంస్థ నుంచి అనుమతి లేకుండా లేఅవుట్లను అభివృద్ధి నిలిపివేసిన వెంచర్లను రెగ్యులరైజ్ చేయరని గుర్తుంచుకోండి.

అక్రమ లేఅవుట్లపై ఉక్కుపాదం..

అదిలాబాద్ జిల్లాలో అక్రమార్కులు నిబంధనల్ని పాటించకుండా.. పంచాయతీల నుంచి అనుమతి తీసుకుని.. యథేచ్ఛగా అక్రమ లేఅవుట్లను అభివృద్ధి చేస్తున్నారు. అక్రమ లేఅవుట్లను అరికట్టాలన్న ప్రభుత్వ ఆదేశాల్ని అందుకున్న జిల్లా కలెక్టర్ దివ్య దేవరాజన్ రంగంలోకి దిగారు. ఆదిలాబాద్‌లో ఏకకాలంలో సుమారు 135 అక్రమ లేఅవుట్లను ధ్వంసం చేశారు. అంతేనా? అవి అక్రమ లేఅవుట్లు అని, అందులో ఎవరూ కొనకూడదని బోర్డులు పాతిపెట్టారు. దీంతో, రియల్టర్లకు ఏం చేయాలో అర్థం కాలేదు. తమవారిని కలెక్టర్ మీద ఉసిగొలిపే ప్రయత్నం చేస్తున్నారు. అయినా, ఆమె వాటన్నింటినీ బేఖాతరు చేస్తూ ముందుకెళ్లడంతో అక్కడి ప్రజలు జిల్లా కలెక్టర్ అంటే ఇలాగుండాలని ప్రశంసిస్తున్నారు.

పరిష్కారం ఎలా?

రియల్టర్లు వేసిన అక్రమ లేఅవుట్లలో.. తెలిసో తెలియకో ప్లాట్లు కొన్నవారు ఇబ్బందులు పడాల్సిందేనా? మరి, వారి కష్టార్జితం బూడిదలో పోసిన పన్నీరు కావాల్సిందేనా? రియల్టరేమో లేఅవుటు వేసి వెళ్లిపోతే, అందులో కొన్నవారి పరిస్థితి ఏం కావాలి? ఇలాంటి అంశాల్లో సాయం చేయడానికి ఒక చక్కటి అవకాశమున్నదనే విషయం మనలో చాలామందికి తెలియదు. సదరు రియల్టర్లు లేఅవుట్లను క్రమబద్ధీకరణ చేసుకునే అవకాశాన్ని మన కొత్త పంచాయతీ రాజ్ చట్టం కల్పిస్తున్నది. సాధారణ లేఅవుట్లకు అనుమతి తీసుకున్నట్లే, క్రమబద్ధీకరణను కోరుతూ రియల్టర్లు పంచాయతీలకు దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. ఆయా వెంచర్‌లో ఎన్ని ప్లాట్లు విక్రయించారు? ఎన్ని అమ్ముడుపోలేదు? వెంచర్‌లో రోడ్ల వెడల్పు ఎంతుంది? నిబంధనల ప్రకారం ఖాళీ స్థలాలేమైనా వదిలేశారా? వంటివి పొందుపర్చాల్సి ఉంటుంది. లేఅవుట్లలో జరిమానా ఎలా లెక్కిస్తారనే విషయాన్ని పంచాయతీ రాజ్ చట్టంలో స్పష్టంగా రాసి ఉన్నది. దాని ప్రకారం జరిమానా కడితే సరిపోతుంది. వెంచర్ క్రమబద్ధీకరణ పూర్తవుతుంది. ఫలితంగా, అందులో ప్లాట్లు కొనుక్కున్నవారికి భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురు కానే కావు. ఇది కేవలం పంచాయతీ పరిధిలోని లేఅవుట్లకు మాత్రమే వర్తిస్తుంది. పట్టణాభివృద్ధి సంస్థలు, మున్సిపాలిటీల పరిధిలో అక్రమ లేఅవుట్లకు ఇది వర్తించదని గుర్తుంచుకోండి.

అమ్ముకుని వెళ్లిపోయారా?

కొందరు రియల్టర్లు ఎప్పుడో వెంచర్లను అభివృద్ధి చేసి వెళ్లిపోయి ఉంటారు. వారు ఎక్కడున్నారో ఎవరికీ తెలియకపోవచ్చు. ఈ నేపథ్యంలో ఆయా వెంచర్‌ను క్రమబద్ధీకరించాలంటే ఎలా? ఇలాంటి సందర్భాల్లో లే అవుట్‌లో ప్లాట్లు కొన్నవారందరూ కలిసి కట్టుగా క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకుంటే సరిపోతుంది.

– కింగ్ జాన్సన్ కొయ్యడ

ప్రాజెక్టు డిజైనింగ్‌లో ప్రత్యేక శ్రద్ధ

ప్రెస్టన్ డెవలపర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ డి.రణ్‌భీర్‌రెడ్డి

దేశవ్యాప్తంగా నిర్మాణ రంగంలో గడ్డు పరిస్థితులు నెలకొంటే.. ఇందుకు భిన్నంగా హైదరాబాద్ అభివృద్ధిలో దూసుకెళుతున్నది. ఈ అంశాన్ని గుర్తించి నగరంలో మల్టీప్లెక్స్ థియేటర్లు, లగ్జరీ విల్లాల నిర్మాణాల్ని చేపడుతున్నామని ప్రెస్టన్ డెవలపర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ డి.రణ్‌భీర్‌రెడ్డి తెలిపారు. గచ్చిబౌలిలో ప్రెస్టన్ ప్రైమ్ మాల్, మల్టీప్లెక్స్ ఆరంభించిన సందర్భంగా 'సంపద'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. సారాంశం ఆయన మాటల్లోనే..

''నిర్మాణ రంగం గణనీయంగా అభివృద్ధి చెందుతున్న భాగ్యనగరంలో నాణ్యమైన కట్టడాల్ని చేపట్టాలన్నదే మా లక్ష్యం. అందుకే ప్రాజెక్టు ప్రారంభం నుంచి ప్రత్యేక చర్యల్ని తీసుకుంటున్నాం. డిజైనింగ్, ఎలివేషన్లు కాస్త విభిన్నంగా ఉండేలా ప్రణాళికలు రచిస్తున్నాం. ఈ క్రమంలో.. ప్రజలకు వినోదం, ఆహ్లాదాన్ని పంచే మాళ్లు, మల్టీప్లెక్సులకు గిరాకీ మెరుగ్గా ఉంటుందని మా అధ్యయనంలో తేలింది. అందుకే, గచ్చిబౌలి ప్రధాన రహదారిలో మూడు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ప్రెస్టన్ ప్రైమ్ మాల్, మల్టీప్లెక్స్‌ను ప్రారంభించాం. ఇందులో నాలుగు అల్ట్రా లగ్జరీ మల్టీప్లెక్స్ థియేటర్లు, వెయ్యి సీట్ల సామర్థ్యం గల ఫుడ్ కోర్టు, గేమింగ్ జోన్, బ్రాండెడ్ రిటైల్ షాపులకు స్థానం కల్పించాం. అత్యుత్తమ నాణ్యతను కోరుకునే వినియోగదారులకు అన్నిరకాలుగా నప్పేలా ఈ ప్రాజెక్టును ప్రారంభించాం. కర్మాన్‌ఘాట్‌లో సుమారు ఏడు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మల్టీప్లెక్స్, మాల్ మొదలెట్టాం. టీఎన్ఆర్ ప్రెస్టన్ గా నామకరణం చేసిన ఈ మాల్, మల్టీప్లెక్సులో 2700 సీట్ల సామర్థ్యం గల 11 స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నాం.

● మాదాపూర్ గుట్టలబేగంపేట్‌లో 89 అల్ట్రా లగ్జరీ విల్లాల్ని నిర్మిస్తున్నాం. 'ప్రెస్టన్ ఐవీ' అని నామకరణం చేసిన ఈ ప్రాజెక్టులో ఇప్పటికే అమ్మకాలూ పూర్తయ్యాయి. కొల్లూరులో 'ప్రెస్టన్ అమరీ' ప్రాజెక్టును ప్రారంభించాం. ఇందులో దాదాపు 178 లగ్జరీ విల్లాలను చేపడుతున్నాం. ఈ నిర్మాణం అమ్మకాలు అనుకున్న దానికంటే యమ జోరుగా పూర్తి కావడం విశేషం. అక్కడే ప్రెస్టన్ గ్రీన్‌విల్లే అనే ఆధునిక గేటెడ్ కమ్యూనిటీ ప్లాట్లను అభివృద్ధి చేశాం. ఇందులో ప్లాట్లు కొన్నవారు అతితక్కువ కాలంలోనే చక్కటి అప్రిసియేషన్‌ని అందుకున్నారు. ఇప్పటివరకూ దాదాపు పది లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో వాణిజ్య భవనాల్ని నిర్మించాం. ప్రస్తుతం 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో కడుతున్నాం. ఇవి కాకుండా, ప్రణాళికా దశలో మరో పది లక్షల చ. అడుగుల్లో నిర్మాణాల్ని చేపడుతున్నాం.''

ప్లాటు.. రేటు?

హైదరాబాద్ నగరంలో స్థలం కొనుక్కొని ఇల్లు కట్టుకోవాలంటే ఖర్చుతో కూడుకున్నపనే. అందుకే, మనలో చాలామంది ఎక్కువగా అపార్టుమెంట్లలో ఫ్లాట్లను కొనడానికి మొగ్గు చూపుతారు. కాకపోతే, ఏ ప్రాంతంలో ఎంతెంత రేటు ఉందో ఎవరికీ తెలియకపోవచ్చు. ఇలాంటి ప్రాథమిక అంశంపై అవగాహన కల్పించేందుకు 'సంపద' నడుం బిగించింది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఫ్లాట్ల రేట్లను ప్రత్యేకంగా అందజేస్తున్నది.

ప్రాంతం	కనీస ధర(చ.అ)	గరిష్ట ధర(చ.అ)
అల్కాపూర్ టౌన్‌షిప్	3900	5200
అప్పా జంక్షన్	4200	5900
బాచుపల్లి	2700	4000
బండ్లగూడ జాగీర్	3500	5200
బంజారాహిల్స్	5500	9000
బీరంగూడ	2700	3900
బేగంపేట	4400	6600
బొల్లారం	2900	3900
చందానగర్	4000	6000
ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్	5300	7500
గచ్చిబౌలి	5200	7800
గాజులరామారం	3200	4500
హఫీజ్‌పేట	4400	6100
హిమాయత్‌నగర్	4800	7800
హైటెక్‌సిటీ	5600	8500
జూబ్లీహిల్స్	8200	14000
ఖాజాగూడ	5200	7900
కోకాపేట	4300	6000
కొల్లూరు	2800	4000
కొంపల్లి	3200	4700
కొండాపూర్	5000	7400
కూకట్‌పల్లి	4700	7300
కేపీహెచ్‌బీ	5000	7900
మాదాపూర్	5400	8700
మదీనాగూడ	4000	6000
మల్లంపేట	2800	3600
మణికొండ	3700	5800
మియాపూర్	3800	5700
నాచారం	3300	5500
నాగోల్	3500	5000
నల్లగండ్ల	4700	6500
నానక్‌రాంగూడ	5400	7500
నార్సింగి	4400	6600
నిజాంపేట	3000	4600
రాజేంద్రనగర్	4400	6500
సుచిత్ర సర్కిల్	3500	4600

గమనిక: కేవలం అవగాహన కోసమే ఈ ధరలు. ప్రాజెక్టులను బట్టి రేట్లు మారుతాయి.

సొసైటీ మీద పోలీసు కేసు

- మెయింటనెన్స్ మెరుగ్గా ఉండటం లేదా?
- నిధులను సొసైటీ దుర్వినియోగం చేస్తున్నదా?
- తోటి సభ్యులతో కలిసి పోరాటం చేయవచ్చు

హైదరాబాద్లో దాదాపు యాభై శాతానికి పైగా గేటెడ్ కమ్యూనిటీల మెయింటనెన్స్ మెరుగ్గా లేకపోవడం వల్ల అందులోని నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు సొమ్మెక్కువ చెల్లించి.. మరోవైపు నాసిరకమైన సేవలతో నిత్యం నరకం అనుభవిస్తున్నారు. బయటికి చెప్పుకుంటే ఎక్కడ పరువు పోతుందోననే భయంతో బహిరంగంగా మాట్లాడటానికి జంకుతున్నారు. ఈమధ్య కాలంలో సహజంగా మారిన ఇలాంటి సమస్యలకు పరిష్కారమే లేదా?

రాజస్థాన్ నుంచి రాజీవ్ నగర్‌కు విచ్చేసిన రాజీవ్ శర్మ.. మాదాపూర్‌లో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పని చేస్తున్నాడు. మూడేండ్ల నుంచి కుటుంబంతో కలిసి ఒక చిన్న అపార్టుమెంట్‌లో నివసిస్తున్నాడు. ఎప్పటికైనా లగ్జరీ గేటెడ్ కమ్యూనిటీలో నివసించాలన్నది అతని కోరిక. స్విమ్మింగ్ పూల్, ఆధునిక క్లబ్‌హౌజ్, చిన్న పిల్లలకు ఆటస్థలాలు, క్రీడాస్థలాలు వంటివి ఉన్న గేటెడ్ కమ్యూనిటీల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలని కలలు కనేవాడు. ఆయన ఆశించినట్టే పశ్చిమ హైదరాబాద్‌లో ఒక గేటెడ్ కమ్యూనిటీలో ఫ్లాట్ వచ్చింది. దీంతో, ఎగిరి గంతేశాడు. ప్రస్తుతమున్న ఫ్లాట్‌ను ఎలాగోలా విక్రయించేసి.. కుటుంబంతో కలిసి దర్జాగా గేటెడ్ కమ్యూనిటీలోకి అడుగుపెట్టాడు. ఇక, అతని ఆనందానికి అవధుల్లేవు. బంధుమిత్రుల సమక్షంలో ఎంచక్కా గృహప్రవేశం కూడా చేసేశాడు. మిత్రులకు ఖరీదైన పార్టీ కూడా ఇచ్చేశాడు. వర్షలు కురవడం ప్రారంభం కావడంతో నెమ్మదిగా బాత్‌రూములో నుంచి నీరు కారడం మొదలైంది. మొత్తం కిచెన్ క్యాబినెట్ అంతా పాడైంది. మెయింటనెన్స్ ఆఫీసును సంప్రదించినా పట్టించుకోలేదు. ఏం చేయాలో అర్థం కాక తలపట్టుకున్నాడు రాజీవ్‌శర్మ.

రెరా ఏం చెబుతోంది?

రెరా చట్టం సెక్షన్ 11(4) ప్రకారం.. అపార్టుమెంట్‌ను నివాసితుల సంఘానికి అప్పగించేంత వరకూ అందులోని ప్రాథమిక సౌకర్యాలన్నీ ప్రమోటరే నిర్వహించాలి. అంతేకాదు, ఐదేండ్ల పాటు ఆయా అపార్టుమెంట్‌లోని స్ట్రక్చరల్ బాధ్యతల్ని ప్రమోటరే చేపట్టాలి. కాకపోతే, కొందరు ప్రమోటర్లు కొనుగోలుదారులకు అపార్టుమెంట్లను అప్పగించడంలో ఆలస్యం చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. అయితే, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వచ్చాకే కొనుగోలుదారులు అపార్టుమెంట్‌లోకి ప్రవేశించాలని గుర్తుంచుకోండి.

మెయింటనెన్స్ ఛార్జీ ఎంత?

ప్రతి అపార్టుమెంటులోని నివాసితుల సంఘం మెయింటనెన్స్ ఛార్జీలను నిర్ణయిస్తుంది. ఇది చదరపు అడుక్కీ రూ.1.50 నుంచి 3 దాకా ఉంటుంది. కొన్ని లగ్జరీ ప్రాజెక్టుల్లో రేటు కాస్త అటుఇటుగా ఉండొచ్చు. నెలకు రూ.7,500 కంటే ఎక్కువ మెయింటనెన్స్ చెల్లించే నిర్మాణాల నుంచి అదనంగా 18% జీఎస్టీని నివాసితుల సంఘం వసూలు చేయాల్సి ఉంటుంది. అపార్టుమెంట్‌ను బిల్డర్ కొనుగోలుదారులకు అప్పగించిన తర్వాత.. ఆయా కమిటీ మెయింటనెన్స్ ఛార్జీల గురించి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అలా వసూలు చేసే సొమ్ముకు సంబంధించిన వివరాల్ని ఎప్పటికప్పుడు తెలుసుకునే అధికారం నివాసితులకు ఉంటుంది. ఇందుకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా ప్రమోటర్ లేదా అసోసియేషన్‌ని అడిగి నివృత్తి చేసుకోవచ్చు.

మెయింటనెన్స్ విషయంలో ప్రమోటర్లు ఇబ్బంది పెడుతున్నారా? మీ అసోసియేషన్ అపార్టుమెంట్‌ను సక్రమంగా నిర్వహించడం లేదా? ఎలాంటి సమస్యలున్నా మాకు రాయండి. నిపుణులు మీకు సమాధానాలిస్తారు. ప్రశ్నలు పంపాల్సిన చిరునామా..

నమస్తే సంపద

8-2-3/7/8/9, క్రిష్ణాపురం. రోడ్ నెం.10, నమస్తే తెలంగాణ, మొదటి అంతస్తు, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
nt.sampada@gmail.com

ఫిర్యాదు ఎవరికి?

ప్రమోటర్ లేదా నివాసితుల సంఘం.. అపార్టుమెంట్ నిర్వహణను మెరుగ్గా నిర్వహించకున్నా.. నివాసితుల ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించకున్నా.. సమస్య గురించి వినకపోయినా.. జిల్లా వినియోగదారుల ఫోరంలో కేసు దాఖలు చేయవచ్చు. మెయింటనెన్స్ సొమ్మును నివాసితుల సంఘం దుర్వినియోగం చేస్తున్నట్లు భావిస్తే.. పోలీసు కేసు కూడా పెట్టొచ్చని నిపుణులు అంటున్నారు. క్రమం తప్పకుండా మెయింటనెన్స్ సొమ్ము కడుతున్నప్పటికీ, ప్రమోటర్ లేదా నివాసితుల సంఘం నుంచి నాసిరకమైన సేవలను అందుతున్నట్లయితే రాజీపడాల్సిన అవసరమే లేదు. మీతో పాటు కొందరిని కలుపుకుని ఒక బృందంగా ఏర్పడి పోరాటం చేయాల్సిందే. మీరు చేసే ఫిర్యాదు విలువ రూ.కోటి కంటే అధికంగా ఉంటే, నేరుగా జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కేంద్రానికి (ఎన్‌సీడీఆర్‌సీ)కి ఫిర్యాదు చేయవచ్చు. 2017 జనవరి 1 తర్వాత అనుమతి తీసుకుని కట్టిన అపార్టుమెంట్‌లో సమస్య ఉన్నట్లయితే తెలంగాణ రెరా అథారిటీకి ఫిర్యాదు చేస్తే సరిపోతుంది.

ప్రభుత్వ అధికారులపై చర్యలు?

నిబంధనల్ని పాటించని ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకుంటామని ఓ రెరా అథారిటీ ఛైర్మన్ అభిప్రాయపడటం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఇండ్ల కొనుగోలుదారులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలిస్తూ.. ఎక్స్‌టర్నల్ డెవలప్‌మెంట్ ఛార్జీలను వినియోగించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. 2003లో రెరా ఆరంభమైనప్పట్నుంచి నేటివరకూ ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎవరూ ప్రకటించలేదు.

ప్రస్తుతం రెరా చట్టంలో కొన్ని లొసుగులున్నాయి.. అందుకే మొత్తం నిర్మాణ రంగాన్ని సంస్కరించాల్సిందే. బ్యాంకులు, బీమా సంస్థలు వంటి వాటిని రెరా పరిధిలోకి తేవాల్సిందే. నిధుల మళ్లింపు, అసలైన లేఅవుటును మార్చివేయడం, ఆలస్యంగా ఫ్లాట్లను కొనుగోలుదారులకు అప్పగించడం వంటి మూడు సమస్యలు నెలకొన్నాయి. మొదటి సమస్యకు పరిష్కారం లభించగా.. మిగతా ఇబ్బందులు అతిత్వరలో పరిష్కరించే వీలున్నది. ఫ్లాట్ల అప్పగింత ఆలస్యమైతే ప్రమోటర్లపై జరిమానా విధించాల్సిందే. అయితే, ప్రమోటర్, కొనుగోలుదారుల మధ్య ఒప్పందం కుదిరిన నాటి నుంచి జరిమానాను లెక్కించాల్సి ఉంటుంది.

JACKPOT
NOW OR NEVER
@ KONGARAKALAN
Near New Collector Office
HMDA L.P.No. 166/2018
8099 831 831

ప్రగతి రిసార్ట్స్
మెగా రెసిడెన్షియల్ వెంచర్
ప్రగతి యాదబుషి టౌన్‌షిప్
@ మల్లాపూర్, యాదాద్రి ప్లాట్లు అమ్మకానికి కలవు
YTDA LAYOUT
01/2016/YTDA
ప్రగతి రిసార్ట్స్ చిలుకూరులో ఉచిత సభ్యత్వం
9100073539 | 7661033339

LAUNCHING OFFER
జనగాం బైపాస్‌కు అతి దగ్గరలో 100 ఎకరాలలో
DTCP Layout
INDIPENDENT HOUSES:
Rs. 19,99,999/- & Open Plots for Sq. 4,999/-
1 Year EMI Available
Cell: 9346735338 8074368308

జీన్స్, టీ-షర్టులు వాడొద్దు

సచివాలయ సిబ్బందికి బీహార్ సర్కార్ ఆదేశం

పాట్నా, ఆగస్టు 30: సచివాలయ ఉద్యోగులు డ్రెస్ కోడ్ పాటించాలని బీహార్ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. జీన్స్, టీ-షర్టులు ధరించడంపై ఆంక్షలు విధించింది. ఆఫీసు మర్యాదలు పాటించాలని సూచించింది. సాధారణంగా, సౌకర్యవంతంగా, తేలికపాటి రంగులు గల దుస్తులు ధరించాలని పేర్కొంది. ఉద్యోగుల హోదాలతో నిమిత్తం లేకుండా ఈ ఆదేశాలు అందరికీ వర్తిస్తాయని తెలిపింది. ఇటీవలి కాలంలో ఉద్యోగులంతా జీన్స్, టీ-షర్టులు ధరించి వస్తున్నారని, ఇది ఆఫీసు సంస్కృతికి విరుద్ధమని, అందువల్లే ఆంక్షలు విధించామని ప్రభుత్వం పేర్కొంది.

కశ్మీర్‌లో మా అత్తామామలెలా ఉన్నారో..?

ఊర్మిళా మతోండ్కర్ ఆవేదన

నాందేడ్, ఆగస్టు 30: జమ్ముకశ్మీర్‌లోని తన అత్తామామల ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో తెలియటం లేదని బాలీవుడ్ కథానాయిక ఊర్మిళా మతోండ్కర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నెల ఆరంభంలో జమ్ముకశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణాన్ని రద్దుచేసినప్పటి నుంచి కశ్మీర్‌లోయలో కేంద్రం ఆంక్షలు విధించింది. కమ్యూనికేషన్ల వ్యవస్థపైనా నిషేధాజ్ఞలు అమలులో ఉన్నాయి. 22 రోజులుగా తన భర్త.. కశ్మీర్‌లో ఉన్న ఆయన తల్లిదండ్రులతో మాట్లాడలేదని ఆమె చెప్పారు. వారిద్దరు మధుమేహంతోనూ, అధికరక్తపోటుతోనూ బాధపడుతున్నారని చెప్పారు. 22 రోజులుగా తాను గానీ, తన భర్త గానీ వారితో మాట్లాడలేకపోయామన్నారు. వారి వద్ద సరిపడా ఔషధాలు ఉన్నాయా? లేదా? అన్న సమాచారం లేదని ఊర్మిళ ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం అమానవీయ పద్ధతుల్లో 370 అధికరణాన్ని రద్దు చేసిందని, జమ్ముకశ్మీర్, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాలుగా ప్రకటించిందని ఆమె ఆరోపించారు.

మోదీ పేరు ఎత్తగానే షాక్

పాక్ మంత్రికి వింత అనుభవం

న్యూఢిల్లీ, ఆగస్టు 30: పాకిస్థాన్ రైల్వే మంత్రి షేక్ రషీద్ ఇటీవల ఓ సభలో భారత ప్రధాని మోదీ గురించి మాట్లాడుతుండగా ఆయనకు షాక్ కొట్టింది. మోదీ పేరును ప్రస్తావించగానే ఆయన చేతుల్లో ఉన్న మైక్రోఫోన్ ద్వారా షాక్ తగిలి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దీంతో అక్కడ నవ్వులు విరబూశాయి. ఇందుకు సంబంధించిన వీడియోను ఒక పాక్ జర్నలిస్టు ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. 'రషీద్! మైక్రోఫోన్‌లోకి మోదీ కరెంట్ పంపారు' అని వ్యాఖ్య రాశారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని ఇటీవల కేంద్రం రద్దు చేసిన విషయం తెలిసిందే. దీంతో భారత్, పాక్ మధ్య మాటల యుద్ధం నడుస్తున్న నేపథ్యంలో రషీద్ ప్రధాని మోదీ పేరును ప్రస్తావించడం.. ఆయనకు షాక్ తగలడంతో నెటిజన్లు పలు కామెంట్లు చేస్తున్నారు.

సభలో మాట్లాడుతున్నపుడు - మైక్రోఫోన్‌తో షాక్ తగిలిన తర్వాత

మరో మూడు రోజుల కస్టడీ

- చిదంబరం నిర్బంధాన్ని పొడిగించిన సీబీఐ ప్రత్యేక కోర్టు
- ఇప్పటివరకు 55 గంటలు విచారించిన అధికారులు
- వరుసగా కస్టడీ పొడిగింపు కోరడంపై జడ్జి అసహనం

ఢిల్లీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు నుంచి బయటకు వస్తున్న కేంద్ర మాజీ మంత్రి పీ చిదంబరం

న్యూఢిల్లీ, ఆగస్టు 30: ఐఎన్ఎక్స్ మీడియా కుంభకోణం కేసులో కేంద్ర మాజీ మంత్రి పీ చిదంబరానికి సీబీఐ కస్టడీని కోర్టు మరో మూడు రోజులు పొడిగించింది. ఆయనను శనివారం ఢిల్లీలోని సీబీఐ ప్రత్యేక కోర్టులో జస్టిస్ అజయ్‌కుమార్ కుహర్ ముందు హాజరుపరిచారు. మరో ఐదు రోజుల కస్టడీ కావాలని సీబీఐ అధికారులు న్యాయస్థానాన్ని కోరారు. ఇప్పటివరకు తమ వద్ద ఉన్న రికార్డులు, సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా చిదంబరాన్ని విచారించామన్నారు. అయితే ఆయన అధికారులతో సహకరించడంలేదని, అస్పష్టంగా సమాధానాలు ఇస్తున్నారని చెప్పారు. పూర్తివివరాలు రాబట్టేందుకు ఆయన కస్టడీని పొడిగించాలని విన్నవించారు. వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి సోమవారం వరకు కస్టడీని పొడిగించారు. చిదంబరంను ఈ నెల 21న అరెస్ట్ చేయగా ఎనిమిది రోజులుగా సీబీఐ కస్టడీలో ఉన్న విషయం తెలిసిందే. విచారణ సందర్భంగా సీబీఐ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్జీ) కేఎం నటరాజ్ వాదనలు వినిపించారు. చిదంబరంను ఇప్పటివరకు పాక్షికంగా విచారించామని, మరికొన్ని పత్రాల విషయంలో ఆయన వాంగ్మూలం తీసుకోవాల్సి ఉన్నదని చెప్పారు. జడ్జి స్పందిస్తూ ఐదు రోజుల కస్టడీని ఎందుకు కోరుతున్నారని ప్రశ్నించగా.. కేసుకు సంబంధించి అనేక పత్రాలు ఉన్నాయని, వాటన్నింటిపై విచారణ జరుపాల్సి ఉన్నదని చెప్పారు. దీనిపై న్యాయమూర్తి కొంత అసహనం వ్యక్తం చేశారు. 'ఎన్ని పత్రాలు ఉన్నాయో మీకు తెలిసి ఉండాలి. మొదటిసారి వచ్చినప్పుడు ఐదురోజుల కస్టడీ అడిగారు, ఇప్పుడు మరో ఐదు రోజులు అడుగుతున్నారు. ఎందుకు ఇలా చేస్తున్నారు? మొదటిరోజే 15 రోజులు అడుగాల్సింది' అని పేర్కొన్నారు. దీనికి ఏఎస్జీ స్పందిస్తూ అధికారులకు చిదంబరం సహకరించడంపైనే అంతా ఆధారపడి ఉన్నదని చెప్పారు. రోజుకు 8-10 గంటలపాటు ప్రశ్నిస్తున్నామని, అయినా ఆయన సూటిగా సమాధానాలు చెప్పడం లేదన్నారు. అందుకే ఆయన కస్టడీని పొడిగించాలని కోరుతున్నట్టు తెలిపారు. సోమవారం వరకు సీబీఐ కస్టడీ పొడిగించినా తనకు అభ్యంతరం లేదని చిదంబరం స్వయంగా సుప్రీంకోర్టులో చెప్పారని గుర్తుచేశారు. దీంతో న్యాయమూర్తి 'ఎన్ని రోజులు కస్టడీ కావాలో ద్యాన్ కృష్ణన్(చిదంబరం తరపు న్యాయవాది), సీబీఐ కలిసి చర్చించుకోండి. ఇక ఈ కోర్టుతో అవసరం ఏముంది?' అని మరోసారి అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణన్ వాదనలు వినిపిస్తూ అధికారులు ఇప్పటివరకు చిదంబరాన్ని 55 గంటలపాటు విచారించారని చెప్పారు. విచారణ పారదర్శకంగా జరుగడం లేదని, మూడు ఫైళ్లనే చిదంబరానికి 20 సార్లు చూపించారని, అందులో మనీలాండరింగ్‌కు సంబంధించి ఒక్క పత్రం కూడా లేదన్నారు. అధికారులు అడిగిన ప్రతి ప్రశ్నకు ఆయన పూర్తిగా సమాధానం ఇచ్చారని వెల్లడించారు. ఈ వాదనలను ఏఎస్జీ తోసిపుచ్చారు. మనీలాండరింగ్ విషయాల్లో సీబీఐ జోక్యం చేసుకోదని గుర్తుచేశారు. చివరగా సీబీఐ కస్టడీ పొడిగించడంలో మీకేమైనా అభ్యంతరాలు ఉన్నాయా?.. అంటూ న్యాయమూర్తి చిదంబరం తరపు లాయర్‌ను ప్రశ్నించారు. ఈ విషయం ఇప్పటికే సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నందున సోమవారం వరకు సీబీఐ కస్టడీకి వెళ్లడానికి అభ్యంతరం లేదని చెప్పారు. దీంతో చిదంబరం కస్టడీని న్యాయమూర్తి మరో మూడు రోజులు పొడిగించారు.

కేంద్రానివి అబద్ధాలు

క్షేత్రస్థాయిలో పరిస్థితులు విరుద్ధంగా ఉన్నాయి
కశ్మీరీలను కలువడానికి అనుమతించలేదు
పర్యటన అనంతరం ఢిల్లీలో సీతారాం ఏచూరి వ్యాఖ్యలు

న్యూఢిల్లీ/శ్రీనగర్, ఆగస్టు 30: జమ్ముకశ్మీర్‌లో నెలకొన్న పరిస్థితులపై ప్రభుత్వం చెబుతున్నదానికి, క్షేత్రస్థాయి వాస్తవాలకు ఎక్కడా పొంతన లేదని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చెప్పారు. 'కశ్మీర్‌లో ఎవరినైనా కలిసి మాట్లాడుదామంటే అనుమతి లేదు. అసలు అక్కడ ఏం జరుగుతున్నదో తెలుసుకునే అవకాశమే లేకుండా పోయింది. నేను అక్కడ పర్యటించినప్పుడు రోడ్ల మీద, మార్కెట్లలో పరిస్థితులను పరిశీలించాను. కశ్మీర్ విషయంలో ప్రభుత్వం చెబుతున్నదానికి, అక్కడ పరిస్థితులకు అస్సలు పొంతనే లేదు' అని పేర్కొన్నారు. అస్వస్థతతో బాధపడుతున్న తమ పార్టీ నాయకుడు మహమ్మద్ యూసుఫ్ తరిగామిని కలువడం కోసం కశ్మీర్‌కు వెళ్లడానికి అనుమతించాలంటూ ఏచూరి దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన సుప్రీంకోర్టు షరతులతో కూడిన అనుమతిని మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం ఆ రాష్ట్రంలో పర్యటించిన ఏచూరి శుక్రవారం తిరిగి ఢిల్లీకి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తరిగామిని గురువారం కలిశాను. అప్పుడు డాక్టర్లు లేరు. దీంతో శుక్రవారం డాక్టర్లు వచ్చాక మళ్లీ తరిగామిని పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నాను' అని చెప్పారు. 'గురువారం తరిగామిని కలిశాక సాయంత్రం తిరిగి వెళ్లిపోవాలని అధికారులు సూచించారు. కానీ నేను నిరాకరించాను. దీంతో భారీ భద్రత మధ్య నన్ను ఓ గెస్ట్‌హౌస్‌లో ఉంచారు. ప్రజలను కలువడానికి అనుమతించలేదు. చివరికి గెస్ట్ హౌస్ నుంచి బయటికి కూడా వెళ్లనివ్వలేదు. కనీసం రాష్ట్రంలో ఏం జరుగుతుందో కూడా తెలుసుకోన్వీలేదు' అని తెలిపారు. పర్యటన సందర్భంగా పరిశీలించిన అంశాలను, తమ అనుభవాలను సుప్రీంకోర్టుకు తెలియజేస్తానని పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్ పర్యటన అనంతరం వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని అనుమతి మంజూరు సందర్భంగా సుప్రీంకోర్టు ఏచూరిని ఆదేశించింది.

శ్రీనగర్‌లో మహమ్మద్ యూసుఫ్ తరిగామితో సీతారాం ఏచూరి

మళ్లీ ఆంక్షలు..

శుక్రవారం ప్రత్యేక ప్రార్థనల నేపథ్యంలో శ్రీనగర్‌తోపాటు కశ్మీర్‌లోయలోని కొన్ని ప్రాంతాల్లో మళ్లీ ఆంక్షలను విధించారు. రోడ్ల మీద బారికేడ్లను ఏర్పాటు చేశారు. మరోవైపు శ్రీనగర్, కశ్మీర్ లోయలో ఉన్న చిన్న మసీదుల్లోనే ప్రార్థనలు చేసుకోవడానికి అధికారులు అనుమతించారు. పెద్ద మసీదుల్లో ప్రార్థనలకు అనుమతి నిరాకరించారు. పోలీసులు మాట్లాడుతూ ప్రార్థనలు ప్రశాంతంగా ముగిశాయని, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని చెప్పారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసి 26 రోజులు కావస్తున్నా.. ఇంకా ప్రజాజీవనం అస్తవ్యస్తంగానే ఉన్నది. దుకాణాలు తెరుచుకోలేదు. ప్రజారవాణా స్తంభించింది. కొన్ని ప్రాంతాల్లో ల్యాండ్‌లైన్ ఫోన్ సేవలు అందుబాటులోకి వచ్చినప్పటికీ.. మొబైల్, ఇంటర్నెట్ సేవలపై ఆంక్షలు కొనసాగుతూనే ఉన్నాయి.

పాక్‌లో సిక్కు యువతికి మతమార్పిడి.. పెండ్లి

చర్య తీసుకోవాలని ఇమ్రాన్‌ను కోరిన పంజాబ్ సీఎం

న్యూఢిల్లీ, ఆగస్టు 30: పాకిస్థాన్‌లో ఒక సిక్కు యువతి (19)ను అపహరించుకు వెళ్లి, బలవంతంగా ఇస్లాం మత మార్పిడి చేయించి, ముస్లిం యువకుడితో పెండ్లి జరిపించిన ఘటన సంచలనం రేపింది. దీనిపై ఆ దేశంలోని పంజాబ్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఈ ఘటనపై భారతదేశంలో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై తక్షణం చర్య తీసుకోవాలని పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌ను పంజాబ్ సీఎం అమరిందర్ సింగ్ కోరారు. ఈ అంశాన్ని గట్టిగా పాక్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విదేశాంగమంత్రి జైశంకర్‌ను అభ్యర్థించారు. పాకిస్థాన్‌లోని లాహోర్‌లో నాన్‌ఖానా సాహిబ్‌లో ఆమెకు బలవంతపు మత మార్పిడి చేశారని ఆయన ట్వీట్ చేశారు. ఇది తనను దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. బాధితురాలి కుటుంబం కూడా తమ కూతురును కిడ్నాప్ చేసి, బలవంతంగా మత మార్పిడి చేసి పెండ్లి జరిపించారని ఫిర్యాదుచేయడంతో విచారణకు ఆదేశిస్తున్నట్లు పంజాబ్ (పాక్) సీఎం సర్దార్ ఉస్మాన్ బజ్దార్ తెలిపారు. సదరు యువతి మాత్రం తాను ఇష్టపూర్తిగానే మత మార్పిడికి, పెండ్లికి ఒప్పుకున్నానని చెప్పడం విశేషం.

అమెరికాకు 'అంతరిక్ష దళం'

లాంఛనంగా ప్రారంభించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్
రష్యా, చైనాలకు చెక్ పెట్టడానికే!

అమెరికా స్పేస్ కమాండ్ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

వాషింగ్టన్, ఆగస్టు 30: అమెరికా ఉపగ్రహాలకు ఎదురయ్యే ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనే లక్ష్యంతో ఏర్పాటుచేసిన అమెరికా స్పేస్ కమాండ్ (అమెరికా అంతరిక్ష దళం)ను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. అంతరిక్ష దళం ఏర్పాటుతో ఇతర దేశాల బెదిరింపులకు లొంగకుండా రోదసిలో అమెరికా ఆధిపత్యం కొనసాగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గత కొన్ని రోజులుగా తమ ఉపగ్రహాలకు రష్యా, చైనా నుంచి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్న వార్తల నేపథ్యంలో అమెరికా ఈ అంతరిక్ష దళానికి అంకురార్పణ చేసింది. శ్వేత సౌధంలో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రంప్ మాట్లాడుతూ.. 'అంతరిక్ష దళం రాకతో విభిన్నమైన ఆట మొదలు కాబోతున్నది. మనకు చేటు చేయాలనుకునే వారు, ఇక మీదట రోదసిలో సవాలు చేయాల్సి ఉంటుంది.' అని అన్నారు. అంతరిక్ష దళం ఏర్పాటు రక్షణదళంలో మైలురాయి వంటిదని ట్రంప్ అభివర్ణించారు. అమెరికా సాయుధ దళంలో ఈ అంతరిక్ష దళంను 11వ యూనిఫైడ్ కంబాటెంట్ కమాండ్‌గా ఏర్పాటు చేశారు. దీనికి జనరల్ జాన్ డబ్లూ రేమండ్ కమాండర్‌గా వ్యవహరించనున్నారు. ప్రాథమికంగా 287 మంది సిబ్బంది ఈ దళంలో ఉంటారు. అయితే, దీన్ని ఎక్కడ ఏర్పాటు చేయాలన్నదానిని ఇంకా నిర్ణయించలేదు. అమెరికా వ్యూహాత్మక దళం(స్ట్రాటజిక్ కమాండ్) నిర్వర్తిస్తున్న కొన్ని బాధ్యతలను అంతరిక్ష దళానికి ప్రాథమికంగా బదిలీ చేయనున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సాయంతో అమెరికాకు ఎంతో కీలకమైన ఉపగ్రహాలను లక్ష్యంగా చేసుకోవడానికి కొన్ని దేశాలు ప్రయత్నిస్తున్నాయని ట్రంప్ అంతరిక్ష దళం ప్రారంభం సందర్భంగా ఆరోపించారు. 'అమెరికాకు వ్యతిరేకంగా ప్రయోగించే క్షిపణులను కనిపెట్టి, నాశనం చేయడం అవసరం' అని పేర్కొన్నారు. భూమి, గాలి, సముద్రం, సైబర్ తదితర మాధ్యమాలను మాత్రమే యుద్ధ క్షేత్రాలుగా ఇప్పటి వరకూ పరిగణించామని, ఇకపై అంతరిక్షం కూడా యుద్ధానికి వేదిక కానున్నదని ఆయన అభిప్రాయపడ్డారు. స్పేస్ కమాండ్‌ను రానున్న రోజుల్లో అమెరికా సాయుధ దళాల్లో ఆరో విభాగంగా.. అమెరికా అంతరిక్ష దళం (యునైటెడ్ స్టేట్స్ స్పేస్ ఫోర్స్) పేరుతో ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్, రక్షణ కార్యదర్శి మార్క్ ఎస్పర్ తదితరులు పాల్గొన్నారు.

కర్తార్‌పూర్ కారిడార్‌పై భారత్, పాక్ చర్చలు

సరిహద్దులో ఇరు దేశాల అధికారుల సమావేశం



కర్తార్‌పూర్‌లోని దర్బార్ సాహిబ్

ఇస్లామాబాద్/గురుదాస్‌పూర్, ఆగస్టు 30: కర్తార్‌పూర్ కారిడార్‌పై భారత్, పాకిస్థాన్ మధ్య మరోదఫా చర్చలు జరిగాయి. సరిహద్దులోని ఇరు దేశాలకు చెందని జీరో పాయింట్ వద్ద శుక్రవారం ఈ సమావేశం జరిగింది. భారత్, పాక్ నుంచి 15 మంది చొప్పున అధికారులు ఇందులో పాల్గొన్నారు. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ భేటీలో కారిడార్‌కు సంబంధించిన పలు సాంకేతిక అంశాలపై చర్చించినట్లు భారత్‌కు చెందిన నేషనల్ హైవేస్ అథారిటీ (ఎన్‌హెచ్ఏ), ల్యాండ్ పోర్టు అథారిటీ (ఎల్‌పీఏ) అధికారులు తెలిపారు. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంతోపాటు ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన నేపథ్యంలో భారత్, పాక్ మధ్య తాజాగా ఉద్రిక్తతలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు కూడా దెబ్బతిన్నాయి. ఇలాంటి పరిణామాలు నేపథ్యంలో కర్తార్‌పూర్ కారిడార్‌పై భారత్, పాక్ మధ్య చర్చలు జరుగడం విశేషం. ఈ సమావేశం జరిగిన ప్రాంతం వద్ద భారీగా భద్రతా బలగాలను మోహరించారు. మీడియా సిబ్బందిని కూడా అక్కడికి అనుమతించలేదు. నవంబర్‌లో జరుగనున్న గురునానక్ 550వ జయంతి ఉత్సవాల నేపథ్యంలో పాకిస్థాన్‌లో కర్తార్‌పూర్‌లోని దర్బార్ సాహిబ్ నుంచి భారత్‌లో గురుదాస్‌పూర్ జిల్లాలోని డేరా బాబా నానక్ మందిరం వరకు కారిడార్‌ను నిర్మించేందుకు గత ఏడాది ఇరు దేశాలు నిర్ణయించాయి. ఈ మేరకు ఇరువైపులా పనులు కూడా జరుగుతున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే భారత్‌కు చెందిన సిక్కులు వీసా లేకుండానే ప్రత్యేక అనుమతితో కర్తార్‌పూర్‌లోని దర్బార్ సాహిబ్‌ను సందర్శించవచ్చు.

అన్ని పండుగలకు సమప్రాధాన్యం

- అధికారికంగా దసరా, రంజాన్, క్రిస్మస్ పండుగలు
- పండుగల సమయంలో పేదలకు దుస్తుల పంపిణీ
- మతాల మధ్య సోదరభావం వెల్లివిరిసేలా చర్యలు
- గిరిజన సంస్కృతిని ప్రతిబింబించే మ్యూజియాలు
- గిరిజన పండుగల నిర్వహణకు నిధుల కేటాయింపు

ప్రభుత్వం దసరా కానుకగా మహిళలకు అందజేస్తున్న బతుకమ్మ చీరలు (ఫైల్)

క్రిస్టియన్లకు అందజేస్తున్న క్రిస్మస్ గిఫ్ట్‌ప్యాక్ (ఫైల్)

ముస్లింలకు అందజేస్తున్న రంజాన్ గిఫ్ట్‌ప్యాక్ (ఫైల్)

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తెలంగాణ సంస్కృతి, భాషా, పండుగలు పరాయీకరణ నుంచి పూర్తిగా బయటపడి సొంత రాష్ట్రం సాధించుకున్నాక పండుగలు జోర్‌దార్‌గా సాగుతున్నాయి. తెలంగాణ సంస్కృతి, పండుగల పరిరక్షణకు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ప్రభుత్వం నడుం బిగించింది. తెలంగాణ యాస, సంస్కృతిని అవహేళ చేసినవారికి మనమేంటో చూపేలా కార్యాచరణతో పని చేస్తున్నది. తెలంగాణ సాంస్కృతిక వేడుకలుగా వందల ఏండ్లుగా కొనసాగుతున్న బోనాల పండుగ, బతుకమ్మ పండుగలను ప్రభుత్వం రాష్ట్ర పండుగలుగా ప్రకటించింది. ఇన్నాళ్లూ సీమాంధ్ర పాలకులు నిర్లక్ష్యం చేసిన ఈ పండుగలను సాంస్కృతిక గౌరవంతో ప్రభుత్వమే అధికారికంగా నిర్వహిస్తున్నది. ప్రకృతిని దేవతలుగా కొలుచుకొనే ఎన్నో పండుగలకు ప్రభుత్వం దండిగా నిధులు కేటాయిస్తూ ప్రాచుర్యంలోకి తీసుకొస్తున్నది. ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ మహిళలు జరుపుకొనే బతుకమ్మ పండుగను రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిదిరోజులపాటు ప్రభుత్వమే నిర్వహిస్తున్నది. అందుకోసం రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాల్లో బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లుచేస్తున్నది. తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో విదేశాల్లో సైతం బతుకమ్మకు విశేష ప్రాచుర్యం కల్పించి తెలంగాణ సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పారు. బతుకమ్మ పండుగకు రాష్ట్రంలోని నిరుపేద ఆడపడుచులకు ప్రభుత్వ కానుకగా చీరెలు ఇచ్చే ఆనవాయితీని ప్రభుత్వం తీసుకొచ్చింది. వరుసగా మూడో ఏడాది కొనసాగిస్తున్న కేసీఆర్ సర్కార్.. ఈ ఏడాది రూ.320 కోట్లతో 100 వెరైటీల్లో కోటి చీరెలు నేయించి పంపిణీకి సిద్ధం చేసింది. అలాగే దసరా, రంజాన్, క్రిస్మస్ పండుగల సందర్భంగా పేద వర్గాలవారికి దుస్తుల పంపిణీ చేపట్టి కొత్త సంప్రదాయాన్ని వెలుగులోకి తెచ్చింది. ఆయా పండుగలను ప్రజల మధ్య జరుపుతూ విభిన్న మతాలకు చెందిన ప్రజల మధ్య సోదరభావం వెల్లివిరిసేలా ప్రభుత్వం కృషిచేస్తున్నది. తెలంగాణకు ప్రత్యేకమైన బోనాల పండుగను అధికారికంగా నిర్వహిస్తున్నది. ఈ చర్యలన్నీ కేసీఆర్ సర్కారు మత సామరస్యతకు అద్దం పడుతున్నాయి. పండుగలతోపాటు తెలంగాణ భాషా, సాహిత్యాల కీర్తిని ప్రపంచం దశదిశలా చాటి చెప్పేందుకు హైదరాబాద్ వేదికగా ప్రపంచ తెలుగు మహాసభలను అంగరంగ వైభవంగా నిర్వహించిన ఘనత సీఎం కేసీఆర్ సర్కారుకే దక్కింది.

ఉద్యమస్ఫూర్తితో పోరాడి సాధించుకొన్న తెలంగాణ రాష్ట్రంలో అన్ని మతాలు, వర్గాలకు సమ ప్రాధాన్యం దక్కుతున్నది. ఏండ్ల తరబడి అణచివేతకు గురైన తెలంగాణ సంస్కృతిని పరిరక్షించాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మార్గదర్శనంలో తెలంగాణ ప్రభుత్వం వినూత్న కార్యక్రమాలను చేపడుతున్నది. గంగా జమునా తెహజీబ్ అనే పదానికి సరైన నిర్వచనం చెప్తూ అన్ని మతాలవారు సుహృద్భావ వాతావరణంలో పండుగలను సంబురంగా జరుపుకొనేలా చర్యలు చేపడుతున్నారు. ఫలితంగా గత ఐదేండ్లుగా తెలంగాణలో సర్వమత సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తున్నది.

గిరిజనులపై ప్రత్యేక దృష్టి

గిరిజన తెగల సంస్కృతిని భవిష్యత్‌తరాలకు పదిలంగా అందించడంపై టీఆర్ఎస్ ప్రభుత్వం దృష్టి సారించింది. ఉమ్మడి రాష్ట్రంలో వివక్షకు గురయిన గిరిజన తెగల ఉనికిని చాటే విధంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. గిరిజన సంప్రదాయ పండుగలు, జాతరల నిర్వహణకు విరివిగా నిధుల మంజూరు చేస్తున్నది. గిరిజన సంప్రదాయం, సంస్కృతి పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా గిరిజన మ్యూజియాలను ఏర్పాటుచేశారు. ఎస్టీలు అధిక సంఖ్యలో నివసించే అయిదు ప్రాంతాల్లో వివిధ పేర్ల మీద గిరిజన మ్యూజియాలను నెలకొల్పారు. అదేవిధంగా గిరిజన జాతరలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. పెద్ద మొత్తంలో నిధులు కేటాయిస్తూ గిరిజనులు తమ సంప్రదాయ పండుగలను సంబురంగా చేసుకొనేలా ప్రోత్సహిస్తున్నది. అందులో భాగంగా కోయ సంప్రదాయం ఉట్టిపడేలా నిర్వహించే సమ్మక్క సారలమ్మకు చెందిన మేడారం జాతరకు ప్రభుత్వం రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నది. గిరిజన ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ జయంతి నిర్వహణకు ఏటా రూ.కోటి నిధులు వెచ్చిస్తున్నది. గోండు తెగలు వైభవంగా నిర్వహించుకునే కిస్లాపూర్ నాగోబా జాతరకు రూ.10 లక్షలు, జంగూబాయి జాతరకు రూ.10లక్షలు నిధులు ఇస్తున్నది. మంచిర్యాల వద్ద నిర్వహించే నాయక్‌పోడ్ తెగకు చెందిన గాంధారి జాతర నిర్వహణకు రూ.10లక్షలు, చెంచులు నిర్వహించే బారాంపూర్ భ్రమరాంబ జాతరకు రూ.10లక్షలు, సలేశ్వరం లొద్ది మల్లయ్య జాతర నిర్వహణకు రూ.10లక్షలు, ఆంధ్ జాతికి చెందిన దిపూబాజీ బాబా జయంతి ఉత్సవాలకు రూ.10లక్షలు ఖర్చు చేస్తున్నది. అలాగే గిరిజనుల సంప్రదాయ వృత్తులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ట్రైకార్ ద్వారా గిరిజన తండాలు, గూడేల్లో ఉంటున్న యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారు. గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఆర్థిక సహకార పథకం కింద రుణాలు కూడా అందిస్తున్నారు.

గిరిజన పండుగలకు కేటాయిస్తున్న నిధులు

సమ్మక్కసారలమ్మ మేడారం జాతర	రూ.100 కోట్లు
సంత్ సేవాలాల్ జయంతి	రూ.కోటి
కిస్లాపూర్ నాగోబా జాతర	రూ.10 లక్షలు
జంగూబాయి జాతర	రూ.10 లక్షలు
మంచిర్యాల గాంధారి జాతర	రూ.10 లక్షలు
బారాంపూర్ భ్రమరాంబ జాతర	రూ.10 లక్షలు
సలేశ్వరం లొద్ది మల్లయ్య జాతర	రూ.10 లక్షలు
దిపూబాజీ బాబా జయంతి	రూ.10 లక్షలు

ప్రభుత్వ కాలేజీలకు ఆదరణ

- ఫలించిన ప్రభుత్వ చర్యలు
- జూనియర్ కాలేజీల్లో 98,799 ప్రవేశాలు
- జనరల్ కోర్సులో 77,633 మంది, ఒకేషనల్ కోర్సులో 21,166 మంది చేరిక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉచిత ప్రవేశాలు.. పక్కాభవనాలు.. వసతులు.. పోటీ పరీక్షలకు కోచింగ్‌లు.. వంటి ప్రత్యేక చర్యల కారణంగా రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఆదరణ పెరుగుతున్నది. విద్యార్థుల ప్రవేశాల సంఖ్య క్రమేణా అధికమవుతున్నది. గతేడాదితో పోలిస్తే విద్యార్థుల ప్రవేశాల సంఖ్య నాలుగువేల పైచిలుకు పెరిగింది. 2019-20 విద్యాసంవత్సరానికిగాను రాష్ట్రంలోని 404 ప్రభుత్వ జూనియర్

నమస్తే తెలంగాణ
చిత్రం
[కరీంనగర్]
శనివారం 31 ఆగస్టు 2019

మీరు వయసును జయించారు

సమంత, నాగచైతన్య, నాగార్జున, అమల, అఖిల్

అక్కినేనివారి ఇంటికోడలు సమంత కుటుంబ సభ్యులందరి పట్ల చక్కటి ప్రేమానురాగాల్ని కనబరుస్తుంది. కాస్త విరామం దొరికినా ఫ్యామిలీ మెంబర్స్‌తో గడపడానికే ప్రాధాన్యతనిస్తుంది. ఇటీవలే నాగార్జున 60వ జన్మదినోత్సవాన్ని జరుపుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా తన మావయ్య నాగార్జునకు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా శుభాకాంక్షలందజేసింది సమంత. ఎన్నో తరాలకు స్ఫూర్తివంతంగా నిలిచే గొప్ప వ్యక్తిత్వం మీదంటూ ప్రశంసలతో ముంచెత్తింది. 'ప్రతి ఒక్కరు కోరుకునే ఆనందాన్ని మీరెప్పుడో పొందారు. మీరు పక్కనుంటే చాలు నిజమైన ఆనందం ఏమిటో తెలుస్తుంది. అందమైన మనసుతో నిత్యం సృజనాత్మకంగా ఆలోచించడం మీ విజయరహస్యం. మీరు వయసును సైతం జయించారు మామయ్య' అంటూ సమంత పొగడ్తలతో ముంచెత్తింది. నాగార్జున స్విమ్మింగ్‌పూల్‌లో తీయించుకున్న ఓ ఫొటోను షేర్ చేసింది. ప్రస్తుతం నాగార్జున కుటుంబ సభ్యులతో స్పెయిన్‌లో ఉన్నారు. ఈ విహార యాత్రకు సంబంధించిన ఫొటోల్ని సమంత ఇటీవల సోషల్‌మీడియాలో అభిమానులతో పంచుకుంది. మరోవైపు 'ఓ బేబీ' చిత్ర విజయంతో ద్విగుణీకృతమైన ఉత్సాహంతో ఉన్న సమంత ప్రస్తుతం '96' రీమేక్‌లో శర్వానంద్ సరసన కథానాయికగా నటిస్తున్నది.

సమంత

గోపీచంద్

గూఢచారి చాణక్య

గోపీచంద్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'చాణక్య'. తిరు దర్శకుడు. మెహరీన్, జరీన్‌ఖాన్ కథానాయికలు. రామబ్రహ్మం సుంకర నిర్మాత. టాకీపార్ట్ పూర్తయింది. ప్రస్తుతం పాటల చిత్రీకరణ జరుగుతున్నది. రాజుసుందరం నృత్య దర్శకత్వంలో ఇటలీ, మిలాన్‌లో పాటల్ని తెరకెక్కిస్తున్నారు. విశాల్‌చంద్రశేఖర్ సంగీత దర్శకుడు. 'గూఢచారి నేపథ్య కథాంశమిది. ఓ మిస్టరీని ఛేదించడానికి ఓ యువకుడు చేసిన ప్రయత్నమేమిటన్నది ఆసక్తిని పంచుతుంది. యాక్షన్, సస్పెన్స్ అంశాల కలబోతగా ఉత్కంఠగా సాగుతుంది. గోపీచంద్ పాత్ర చిత్రణ కొత్తపంథాలో ఉంటుంది' అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వెట్రి పళనిస్వామి, సంభాషణలు: అబ్బూరి రవి, సంగీతం: విశాల్‌చంద్రశేఖర్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: తిరు.

స్టిల్ ఫొటోగ్రఫీ: క్రిష్ణ

రష్మీరాకెట్

ప్రయోగాలతో కూడిన వైవిధ్యమైన కథాంశాల్ని ఎంచుకుంటూ కథానాయికగా ప్రతిభను చాటుకుంటున్నది తాప్సీ. విభిన్న ఇతివృత్తాలకు ప్రాముఖ్యతనిస్తున్న ఈ సొగసరి తాజాగా అథ్లెట్‌గా కొత్త పాత్రలో కనిపించబోతున్నది. తాప్సీ కథానాయికగా 'రష్మీరాకెట్' పేరుతో ఓ బాలీవుడ్ చిత్రం తెరకెక్కుతున్నది. ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను శుక్రవారం చిత్రబృందం విడుదలచేసింది. ఈ పోస్టర్‌లో ఎరుపు రంగు దుస్తుల్లో ముక్కుపుడక ధరించి గ్రామీణ ప్రాంత యువతిగా తాప్సీ వినూత్న లుక్‌తో కనిపిస్తున్నది. ఏడారి ప్రాంతంలో మొదలుపెట్టి రేస్ ట్రాక్‌పై తాప్సీ పరిగెడుతున్న దృశ్యాల్ని ఈ మోషన్‌పోస్టర్‌లో చూపించారు. ఈ సినిమాలో గుజరాత్‌కు చెందిన రష్మీ అనే అథ్లెట్ పాత్రలో ఆమె కనిపించబోతున్నది. 'రెగ్యులర్ అథ్లెటిక్ కథలకు భిన్నంగా ఈ సినిమా ఉంటుంది. కథలోని నాటకీయత, మానవీయ కోణం నచ్చి సినిమాను అంగీకరించాను. పూర్తిస్థాయి క్రీడా నేపథ్యంలో ఈ సినిమా సాగుతుంది' అని తాప్సీ చెప్పింది. ఓ గ్రామీణ ప్రాంత యువతి అంతర్జాతీయ అథ్లెట్‌గా ఎదిగిన వైనాన్ని స్ఫూర్తిదాయకంగా ఇందులో ఆవిష్కరించబోతున్నట్లు చిత్రబృందం చెబుతున్నది. ఆకర్ష్ ఖురానా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. రోనీ స్క్రూవాలా నిర్మిస్తున్నారు.

ఓ సొగసరి ప్రియ లాహిరి

రఘు కుంచె, బాలు

రక్షిత్, నక్షత్ర జంటగా నటిస్తున్న చిత్రం 'పలాస 1978'. కరుణకుమార్ దర్శకుడు. ధ్యాన్ అట్లూరి నిర్మాత. ఈ చిత్రంలోని 'ఓ సొగసరి ప్రియ లాహిరి' అనే గీతాన్ని చిత్రబృందం విడుదలచేసింది. రఘు కుంచె సంగీతాన్నందించిన ఈ గీతాన్ని ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, బేబీ ఆలపించారు. లక్ష్మీభూపాల సాహిత్యాన్ని అందించారు. నిర్మాత మాట్లాడుతూ 'యథార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతున్న చిత్రమిది. పలాసలో 1978లో ఏం జరిగిందన్నది తెరపై ఉత్కంఠను పంచుతుంది. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం, బేబీ ఆలపించిన యుగళగీతం ఫ్రెష్‌నెస్‌ను తీసుకొచ్చింది' అని అన్నారు. రఘుకుంచే, తీరువీర్ జనార్ధన్, లక్ష్మణ్, శృతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: అరుల్ విన్సెంట్, సమర్పణ: తమ్మారెడ్డి భరద్వాజ.

తమన్నా యాక్షన్

ప్రస్తుతం కథానాయికల ఆలోచన ధోరణుల్లో మార్పులు కనిపిస్తున్నాయి. హీరోలకు ధీటుగా యాక్షన్ కథాంశాల్లో నటిస్తున్నారు. తాజాగా తమన్నా యాక్షన్ బాట పట్టింది. ఆమె కథానాయికగా సుందర్.సి దర్శకత్వంలో 'యాక్షన్' పేరుతో ఓ చిత్రం రూపొందుతున్నది. విశాల్ హీరో. ఉగ్రవాదం నేపథ్యంలో రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్నది. ఇందులో తమన్నా మిలటరీ కమాండో ఆఫీసర్‌గా కనిపించబోతున్నది. తన పాత్ర శక్తివంతంగా ఉంటుందని తమన్నా చెప్పింది. పోరాట ఘట్టాల కోసం మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకొని నటించానంది. నటిగా తనను కొత్త కోణంలో ఆవిష్కరించే చిత్రమిదని అంది.

నివేథా థామస్

విలేజ్ క్రైమ్ థ్రిల్లర్‌లో..

కథాంశాల ఎంపికలో నవ్యతకు పెద్దపీట వేస్తుంది మలయాళీ ముద్దుగుమ్మ నివేథా థామస్. తాను ఎంచుకున్న పాత్రలకు పరిపూర్ణంగా న్యాయం చేయాలని తపిస్తుంది. సమకాలీన చిత్రసీమలో గ్లామర్‌కు దూరంగా కేవలం అభినయప్రతిభతో రాణిస్తున్న నాయికల్లో నివేథా అగ్రభాగాన ఉంటుందనడం అతిశయోక్తి కాదు. తాజాగా ఈ అమ్మడు మరో వినూత్న కథా చిత్రాన్ని అంగీకరించింది. అఖిల్ సరసన ఓ సినిమాకు ఓకే చెప్పింది. ప్రశాంత్‌వర్మ ('ఆ!' 'కల్కి' ఫేమ్) దర్శకత్వం వహించనున్న ఈ చిత్రం ఈ ఏడాది చివరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. గ్రామీణ నేపథ్యంలో క్రైమ్ థ్రిల్లర్ ఇతివృత్తంతో ఈ సినిమా తెరకెక్కనుందని సమాచారం. నివేథా థామస్, అఖిల్ పాత్ర చిత్రణ కొత్త పంథాలో సాగుతుందని అంటున్నారు. మ్యాట్నీ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనుంది. ఇదిలా వుండగా నివేథా థామస్ ప్రస్తుతం ఇంద్రగంటి మోహన్‌కృష్ణ దర్శకత్వంలో 'వి' చిత్రంలో నటిస్తున్నది. నాని, సుధీర్‌బాబు హీరోలు. దిల్‌రాజు నిర్మాత. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. రజనీకాంత్ తమిళ చిత్రం 'దర్బార్'లో కూడా నివేథా థామస్ కీలక పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే.

తమిళంలో విలన్‌గా..


అజయ్‌దేవ్‌గణ్

రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న 'ఆర్‌ఆర్‌ఆర్'తో బాలీవుడ్ నటుడు అజయ్‌దేవ్‌గణ్ దక్షిణాదిలో అరంగేట్రం చేయబోతున్నారు. తాజాగా ఆయన తమిళంలో ఓ సినిమాను అంగీకరించినట్లు తెలిసింది. అజిత్ కథానాయకుడిగా హెచ్.వినోద్ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్నది. బోనీకపూర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. సామాజిక ఇతివృత్తానికి యాక్షన్ హంగులను మేళవిస్తూ తెరకెక్కుతున్న ఈ చిత్రంలో అజయ్ దేవ్‌గణ్ ప్రతినాయకుడి పాత్రలో నటించబోతున్నట్లు తెలిసింది. కథ, తన పాత్రను తీర్చిదిద్దిన తీరు నచ్చడంతో విలన్‌గా నటించడానికి అజయ్ దేవ్‌గణ్ అంగీకరించినట్లు చెబుతున్నారు. కమల్‌హాసన్, శంకర్ కలయికలో రూపొందుతున్న 'ఇండియన్-2'లో ప్రతినాయకుడి పాత్ర కోసం తొలుత అజయ్ దేవగణ్‌ను సంప్రదించారు. కానీ డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో ఆయన ఈ సినిమాను అంగీకరించలేదు.